

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 111 | ఆదివారం | 22-03-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ఇరాన్ అణు కేంద్రంపై

# వైమానిక దాడి



- ఎలాంటి రేడియేషన్ లీక్ కాలేదని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ వెల్లడి
- పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రతీకార దాడులు చేస్తామని హెచ్చరిక
- అంతర్జాతీయ స్థాయిలో భద్రతపై పెరిగిన ఆందోళనలు
- భారీగా నౌకాదళాన్ని మోహరిస్తున్న అమెరికా

**బీరుట్/దుబాయ్ :** ఇరాన్‌లోని ప్రముఖ అణు కేంద్రం నటాంజ్ న్యూక్లియర్ ఫెసిలిటీపై తాజాగా వైమానిక దాడి జరిగింది. ఇది ఇరాన్‌లోని ప్రధాన యురేనియం శుద్ధి కేంద్రం కావడంతో ఈ ఘటన అంతర్జాతీయంగా ప్రాధాన్యత పొందింది. ఈ దాడిని ఇరాన్ ధ్రువీకరించింది. అయితే, ఈ దాడి వల్ల ఎలాంటి రేడియేషన్ లీకేజీ జరగలేదని ఇరాన్ అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. నటాంజ్ కేంద్రం ఇప్పటికే గతంలో కూడా దాడులకు గురైంది. ముఖ్యంగా గత ఏడాది ఇజ్రాయెల్ ఈ కేంద్రంపై దాడులు చేసింది. ఇప్పుడు ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఉపగ్రహ చిత్రాల ప్రకారం అప్పట్లో కొన్ని భవనాలు దెబ్బతిన్నాయి. అంతర్జాతీయ అణు పర్యవేక్షణ సంస్థ (ఐఎఇఎ) కూడా గత దాడుల సమయంలో పెద్దగా రేడియేషన్ ప్రమాదం లేదని తెలిపింది. ప్రస్తుతం జరిగిన తాజా దాడి ప్రభావంపై పూర్తి సమాచారం ఇంకా వెలువడలేదు. ఈ కేంద్రం టెహ్రాన్‌కు దక్షిణఆగ్నేయ దిశలో సుమారు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇరాన్ తరువాయి 2లో

## ఫొటోలు అప్‌లోడ్ ధోరణిపై

# ‘సుప్రీం’ ఆందోళన

ఈ కార్యకలాపాలు నిష్పక్షపాత విచారణకు ముప్పు కలిగిస్తాయని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** పోలీసులు మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించిన వీడియోలను ప్రజలు తక్షణమే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసే ధోరణిపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి కార్యకలాపాలు నిష్పక్షపాత విచారణకు తీవ్రమైన ముప్పును కలిగిస్తాయని తెలియజేసింది. ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పంచౌలి శుక్రవారం ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పోలీసులు నిందితుల వీడియోలు, ఫోటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి ప్రజల్లో పక్షపాత వైఖరిని సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై ధర్మాసనం విచారణ జరుపుతోంది. పోలీసులు మీడియా బ్రీఫింగ్‌ల కోసం మార్గదర్శకాలను రూపొందించాలని, అందులో సోషల్ మీడియా పోస్టులను కూడా చేర్చాలని కోర్టు మరో కేసులో ఇప్పటికే రాష్ట్రాలను కోరిందని ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వాదించింది. అయితే ఆ మార్గదర్శకాల ఫలితాల కోసం వేచిఉండాలని పిటిషనర్ హేమేంద్ర పటేల్‌కు ధర్మాసనం సూచించింది. అలాగే ఈ రోజుల్లో మొబైల్ ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరూ మీడియాగా అవతారమెత్తారని పిటిషనర్ హేమేంద్ర పటేల్ తరపున హాజరైన న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. నిందితులకు బేడీలు వేయడం, తాళ్లతో బంధించడం, ఊరేగించడం, మోకాళ్లపై కూర్చోబెట్టడం వంటి చిత్రాలను పోలీసులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అనేది వ్యక్తిగత గౌరవానికి అవమానం కలిగించడమే కాకుండా ప్రజల పక్షపాతాన్ని కూడా పెంచుతుందని సీనియర్ న్యాయవాది తరువాయి 2లో



## రైతు భరోసా

# నేడు విడుదల

- సిద్ధిపేట జిల్లా_నర్మెట్టలో ఆయిల్ పామ్ కంపెనీ ప్రారంభ వేదికనుంచి నిధులు విడుదల చేయనున్న సిఎం రేవంత్ రెడ్డి
- ఒక ఎకరం వరకు ఉన్న 70 లక్షల మంది రైతు ఖాతాల్లోకి రూ.3,590 కోట్లు జమ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎట్టకేలకు రైతు భరోసా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం మూడు విడుతల్లో రూ.9 వేల కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. ఈ నెల 22వ తేదీన సిద్ధిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్ పామ్ కంపెనీ ప్రారంభించనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇదే వేదికగా రైతు భరోసాను లాంఛనంగా విడుదల చేయనున్నారు. ఒక ఎకరం వరకు ఉన్న మొత్తం 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,590 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండున్నర ఏళ్ల కాలంలో ఇప్పటివరకు ఒక దఫా మాత్రమే రైతు భరోసా నిధులను విడుదల చేసింది. దీంతో ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సహాయం తరువాయి 2లో

## హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం

- మాజీ డిజిపి మనవరాలికి రూ.1.20 కోట్ల టోకరా

03

## నౌకాయాన స్వేచ్ఛను

# పరిరక్షించాలి

ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌కు ప్రధాని మోదీ ఫోన్ కాల్



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధానికి సంబంధించిన ఉద్రిక్త పరిస్థితులు తీవ్రతరమవుతున్న వేళ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌కు ఫోన్ కాల్ చేశారు. పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ (పర్షియన్ సంవత్సరం) శుభాకాంక్షలు తరువాయి 2లో

## హోర్ముజ్‌ను తెరవండి!

ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి

**యుఎఇ :** హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై ఇరాన్ చేస్తోన్న దాడులను ఖండించాయి. ఈ చర్యల వల్ల అన్ని దేశాలపైనా దుష్ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు యుఎఇ, యుకె, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. “గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధి మూసివేత చర్యలను ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస తరువాయి 2లో

# జీవన్ రెడ్డికి బుజ్జగింపులు

- మాజీ మంత్రితో మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్ చర్చలు
- పార్టీ మార్పు అంశాన్ని అధిష్టానం, సిఎం దృష్టికి తీసుకువెళ్తామని వెల్లడి
- ఎవరు చెప్పినా తగ్గబోనన్న జీవన్‌రెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల



మాజీ మంత్రి జీవన్ రెడ్డికి అండగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ ఆలోచన చేస్తుందని ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు శనివారం తరువాయి 2లో





## హెజ్బొల్లాకు సాయం చేస్తున్న
# సంస్థలపై అమెరికా ఆంక్షలు



**వాషింగ్టన్:** హెజ్బొల్లాకు సంబంధించిన గ్లోబల్ ఆర్థిక నెట్‌వర్క్‌పై అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. అమెరికా దృష్టిలో హెజ్బొల్లా ఒక విదేశీ ఉగ్రవాద సంస్థ. ఈ చర్య ప్రధానంగా ఆ సంస్థకు నిధులు సమకూర్చే మార్గాలను అడ్డుకోవడంపై దృష్టి సారించింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రకటన ప్రకారం, మధ్యప్రాచ్యం, యూరప్, ఉత్తర అమెరికా ప్రాంతాల్లో పనిచేస్తున్న వ్యక్తులు, కంపెనీలు కలిసి హెజ్బొల్లాకు డబ్బు సమకూర్చుతున్నాయి. ఇవి, అక్రమ డబ్బును చట్టబద్ధంగా చూపించే మనీలాండరింగ్ తోపాటు వివిధ వ్యాపార ప్రాజెక్టుల ద్వారా నిధులు సేకరించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నాయి. ఈ ఆర్థిక మార్గాలను నిలిపివేస్తే, హెజ్బొల్లా ఉగ్ర కార్యకలాపాలకు అవసరమైన నిధులను సమకూర్చడం కష్టమవుతుందని అమెరికా భావిస్తోంది. ప్రత్యేకంగా, హెజ్బొల్లా ఫైనాన్సియర్ అలా హసన్ హమీచ్ నేతృత్వంలో ఉన్న నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకున్నారు. ఈ నెట్‌వర్క్‌లో 16 మంది వ్యక్తులు, సంస్థలు ఉన్నాయని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది ట్రెజరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. లెబనాన్, సిరియా, పోలాండ్, స్లోవేనియా, ఖతా ర్, కెనడా వంటి దేశాల్లో ఈ నెట్‌వర్క్ పనిచేస్తూ, 2020 నుంచి సుమారు 100 మిలియన్ డాలర్లకు పైగా నిధులను మళ్లించిందని అంచనా. ఈ ఆంక్షల ప్రకారం, ఆ వ్యక్తులు లేదా సంస్థలకు చెందిన అమెరికాలో ఉన్న ఆస్తులు పూర్తిగా ఫ్రీజ్ అవుతాయి. అలాగే, అమెరికా పౌరులు లేదా సంస్థలు వారితో ఎలాంటి లావాదేవీలు చేయడానికి వీలు ఉండదు. వారి యాజమాన్యం లో 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ భాగస్వామ్యం ఉన్న ఇతర సంస్థలపైనా ఇదే నిబంధనలు వర్తిస్తాయి. అమెరికా అభిప్రాయం ప్రకారం, ఇరాన్ మద్దతుతో హెజ్బొల్లా ప్రపంచవ్యాప్తంగా అస్థిరత సృష్టించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, ఆర్థిక నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఉగ్రవాదాన్ని అరికట్టడం ముఖ్యమైన వ్యూహంగా అమెరికా భావిస్తోంది. మొత్తంగా, ఈ చర్య హెజ్బొల్లా కార్యకలాపాలపై ఆర్థిక ఒత్తిడి పెంచి, దాని ప్రభావాన్ని తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న కీలక నిర్ణయంగా చూడవచ్చు.

# ఇరాన్ చమురుపై ఆంక్షల సడలింపు



**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న చమురు ధరలను నియంత్రించేందుకు అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురును అమ్మడానికి వీలుగా ఒక నెలపాటు ఆంక్షలను సడలించింది. ఈ నిర్ణయం ప్రకారం ఇప్పటికే నౌకల్లో ఉన్న చమురును మాత్రమే విక్రయించేందుకు అనుమతి ఉంది. కొత్తగా ఉత్పత్తి చేయడం లేదా కొనుగోలు చేయడానికి ఈ సడలింపు వర్తించదు. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ప్రకటన ప్రకారం, ఈ చర్యతో సుమారు 140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లోకి వస్తుంది. దీంతో సరఫరా పెరిగి, ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్ ధర 70 డాలర్ల వద్ద ఉండగా, ఇటీవల అది 100 డాలర్లకు పైగా పెరిగింది. ఈ చర్య వెనుక వ్యూహాత్మక ఉద్దేశం కూడా ఉంది. ఇరాన్ హోర్ముజ్ జలసంధి వద్ద చమురు రవాణాను ప్రభావితం చేస్తుండగా, మార్కెట్లో అదనపు సరఫరా అందించడం ద్వారా ధరలపై ఒత్తిడిని తగ్గించాలనేది అమెరికా లక్ష్యంగా కనిపిస్తున్నది. అయితే, ఈ విక్రయాల ద్వారా వచ్చే డబ్బును ఇరాన్ సులభంగా వినియోగించుకోలేని విధంగా ఆర్థిక పరిమితులు కొనసాగుతాయి. మొత్తంగా, ఇది తాత్కాలికంగా చమురు ధరలను నియంత్రించే ప్రయత్నమే కానీ, ఇరాన్‌పై అమెరికా ఆర్థిక ఒత్తిడి మాత్రం కొనసాగుతూనే ఉంటుంది.

## ఇరాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘన!



**బీరుట్:** ఇరాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘన నిరాటంకంగా కొనసాగుతున్నదని ఇటీవల అమలు చేసిన ఉరి శిక్షలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయంపై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ వారం 19 ఏళ్ల యువ రెజ్లర్ సలే మహమ్మద్‌తోపాటు మరో ఇద్దరు యువకులను అధికారులు ఉరితీశారు. ఈ ఏడాది జనవరిలో దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల సమయంలో అరెస్టైన వారికి విధిస్తున్న శిక్షల అమలు ప్రారంభమైనట్టు ఈ చర్యను పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వం వీరిపై 'దేవునికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం' అనే తీవ్ర ఆరోపణలు మోపింది. నిరసనల సమయంలో ఇద్దరు పోలీసులను హత్య చేశారని ఆరోపించారు. అయితే ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు ఈ కేసులను తీవ్రంగా విమర్శిస్తున్నాయి. వీరిపై విచారణలు న్యాయపరంగా సరిగ్గా లేవని, బలవంతంగా అంగీకరింపచేసి, ఆ వాంగ్మూలం ఆధారంగా తీర్పులు ఇచ్చారని పేర్కొన్నాయి. మానవ హక్కుల సంస్థల అంచనాల ప్రకారం, నిరసనల సమయంలో అరెస్టైన వేలాది మందిలో కనీసం 27 మందికి మరణదండనలు విధించారు. మరో 100 మందికి పైగా ఇలాంటి శిక్షలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ పరిణామాలు ప్రభుత్వం ప్రజల్లో భయాన్ని సృష్టించి, భవిష్యత్తులో నిరసనలను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నదనే అనుమానాలను పెంచుతున్నాయి. అమెరికా–ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నప్పటికీ, ఇరాన్‌లో అంతర్గత నిర్బంధం తగ్గలేదని మానవ హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి. అయితే, ఇంటర్నెట్‌పై ప్రభుత్వం పరిమితులు విధించడం వల్ల వాస్తవ పరిస్థితులపై పూర్తి సమాచారం బయటకు రావడం లేదని అంటున్నాయి. కాగా, నిరసనల సమయంలో వేల మంది మరణించారని, లక్షలాది మంది అరెస్టయ్యారని వేర్వేరు నివేదికలు సూచిస్తున్నాయి.



## దక్షిణ కొరియా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం
### 10 మంది మృతి.. పలువురికి గాయాలు

**సియోల్:** దక్షిణ కొరియాలోని డేజోన్ నగరంలో జరిగిన భారీ అగ్నిప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. ఒక ఆటో పార్ట్స్ ఫ్యాక్టరీలో పేలుడు కారణంగా అగ్ని చెలరేగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో కనీసం 10 మంది మృతిచెందగా, 59 మందికి పైగా గాయపడ్డారు. మరో నలుగురు గల్లంతైనట్లు సమాచారం. భారీగా పొగ వ్యాపించడంతో కొంతమంది కార్మికులు ప్రాణాలు కాపాడుకోవడానికి భవనం నుంచి దూకాల్సి వచ్చింది. కొందరు పొగ శ్వాసించడం వల్ల తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. గాయపడిన వారిలో 25 మంది పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదాన్ని అదుపులోకి తీసుకురావడానికి 500 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, అత్యవసర సిబ్బంది పనిచేశారు. భవనం కూలిపోతుందనే భయంతో మొదట్లో లోపలికి వెళ్లడం కష్టమైంది. అనంతరం ప్రత్యేక రోబోలు, యంత్రాలను ఉపయోగించి అగ్నిని చల్లార్చి, శోధన చర్యలు ప్రారంభించారు. మృతదేహాల్లో ఒకటి రెండో అంతస్తులో, మిగతా తొమ్మిది మూడో అంతస్తులో ఉన్న జిమ్ ప్రాంతంలో కనుగొన్నారు. ఇంకా మిగిలిన నలుగురు కూలిపోయిన శిథిలాల కింద చిక్కుకుపోయి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాద స్థలంలో 100 కిలోలకుపైగా ప్రమాదకర రసాయనాలు కూడా గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది. కాగా, ఈ ప్రమాదం పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై మళ్లీ ప్రశ్నలు లేవనెత్తుతోంది.

## పడవపై అమెరికా దాడి..



అమెరికా సైన్యం తూర్పు పసిఫిక్ సముద్రంలో డ్రగ్ స్మగ్లింగ్ అనుమానంతో ఒక పడవపై దాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, ఒకరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ఈ దాడి తర్వాత బాధితులను గుర్తించిన అమెరికా కోస్ట్ గార్డ్, వారిని కోస్టారికా తీరరక్షక దళానికి అప్పగించింది. అమెరికా ప్రభుత్వం లాటిన్ అమెరికా డ్రగ్ కార్టెల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనిని సాయుధ పోరాటంగా పేర్కొన్నారు. అయితే, ఈ దాడులు చట్టబద్ధతపై, వాస్తవ ప్రభావంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మావోయిజం క్లోజింగ్ కార్డ్ పది రోజులే గడువు..
# గణపతి అడుగు ఎటువైపు?



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో దశాబ్దాల కాలం గా సాగుతున్న సాయుధ పోరాటం కీలక మలుపు తిరగబోతోందా? అడవి బాట పట్టిన అగ్రనేతలు ఒక్కొక్కరుగా జనజీవన స్రవంతిలో కలుస్తుండటంతో మావోయిస్ట్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందా? ఇప్పుడు ఇదే అంశం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా సంచలనంగా మారిం ది. కేంద్ర ప్రభుత్వం విధించిన ఈ నెల 31 గడువు ముగియడానికి మరో పది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన 'నక్సల్స్ రహిత భారత్' లక్ష్యానికి గడువు సమీపిస్తోంది. గత కొద్ది నెలలుగా సాగుతున్న 'ఆపరేషన్ కాగర్' మావోయిస్టుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. అగ్ర నాయకత్వం అంతా ఛిన్నాభిన్నం కావడం, కీలక కమిటీలు కుప్పకూలడంతో అడవిలో తుపాకీ గొట్టం మూగబోయే పరిస్థితి కనిపిస్తోంది.మావోయిస్ట్ పార్టీలో అత్యంత కీలక వ్యూహకర్త, నంబాల కేశవరావు తర్వాత జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టినట్లు భావిస్తున్న తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ఇటీవలే లొంగుబాటు ప్రకటించడం పార్టీకి కోలుకోలేని దెబ్బ. ఆయనతో పాటు మల్లా రాజిరెడ్డి వంటి అగ్రనేతలు కూడా బయటకు రావడంతో అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారి ఆలోచనల్లో మార్పు మొదలైంది. యుద్ధ ప్రాతిపదికన సాగుతున్న పోలీసుల గాలింపు చర్యల మధ్య, ప్రాణాలు కాపాడుకోవడానికి లొంగుబాటే మేలనే అభిప్రాయం కేడర్‌లో వ్యక్తమవుతోంది.

**అందరి కళ్లు గణపతిపైనే..!**

మావోయిస్టు ఉద్యమానికి సుమారు మూడు దశాబ్దాల పాటు దిశానిర్దేశం చేసిన ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి(77) ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఆయన లొంగుబాటు ఎప్పుడు? అనే ప్రశ్నలు మిన్నంటుతున్నాయి. గత కొంతకాలంగా గణపతి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు, ప్రస్తుతం ఆయన నేపాల్ సరిహద్దుల్లో లేదా ఢిల్లీ పరిసరాల్లో ఇంటెలిజెన్స్ నిఘాలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. లొంగుబాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి కొన్ని హామీలు (కేసుల ఎత్తివేత, పునరావాసం) ఆశిస్తున్నట్లు సమాచారం. ఆయన సోదరుడు కూడా ఇప్పటికే బహిరంగంగా విజ్ఞప్తి చేయడంతో గణపతి రాక దాదాపు ఖాయమని తెలుస్తోంది.

**చివరి అంకం.. ఎండ్ కార్డ్ పడినట్లేనా?**

గణపతి వంటి అత్యున్నత స్థాయి నేత లొంగిపోతే, అది మావోయిస్ట్ చరిత్రలో అతిపెద్ద మలుపు అవుతుంది. ఆయన లొంగుబాటుతోనే ఈ సాయుధ పోరాటానికి 'ఎండ్ కార్డ్ పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అజ్ఞాతంలో మిగిలి ఉన్న అతికొద్ది మంది నాయకులు కూడా గడువు లోపు బయటకు వస్తారా లేక ఆఖరి వరకు పోరాడతారా అన్నది తేలాల్సి ఉంది.యుద్ధం లాంటి పరిస్థితుల్లో గడువు పెంచడం కంటే, నేతలను జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించి శాంతియుత పరిష్కారం చూపడమే మేలని పౌర సమాజం కోరుకుంటోంది. మరో పది రోజుల్లో ఏం జరగబోతోంది? గణపతి లొంగుబాటు ప్రకటన ఢిల్లీ నుంచి వస్తుందా లేక హైదరాబాద్ నుంచా? వేచి చూడాలి.



## ముస్లిం సోదరులందరూ ప్రశాంతంగా ఉండాలి : సిపి సజ్జనర్ ఆకాంక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముస్లిం సోదరులందరూ సుఖసంతోషాలతో, ప్రశాంతంగా ఉండాలని హైదరాబాద్ సిపి విసి.సజ్జనర్ ఆకాంక్షించారు. ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద ముస్లింలు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనర్ అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ప్రార్థనల అనంతరం ఆయన చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసమంతా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల షాపింగ్ అవసరాలకు, ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని, అందరి సహకారంతో వేడుకలు విజయవంతంగా సాగాయని వివరించారు. పండుగ ఏర్పాట్లలో సహకరించిన మత పెద్దలకు, ఇతర ప్రభుత్వ విభాగాలకు సిపి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి ట్రాఫిక్ డి.జోయల్ డెవిస్, జాయింట్ సిపి ఎన్.శ్వేత, డిసిపిలు ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాస్, అవినాశ్ కుమార్‌తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ద్రవ్యోల్బణం తరముకొస్తున్నా మోదీ సర్కార్ డొల్ల మాటలు
### లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో రూపాయి విలువ పడిపోవడం, పారిశ్రామిక ఇంధన ధరలు పెరగడంపై లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో భారత్‌లో ద్రవ్యోల్బణం ఖాయమని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం స్పష్టమైన ఆర్థిక వ్యూహానికి బదులుగా డొల్ల మాటలు చెబుతోందని విమర్శించారు. శుక్రవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 93 మార్కు కంటే దిగువకు పడిపోయిన నేపథ్యంలో రాహుల్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడి 100 వైపు పయనించడం, పారిశ్రామిక ఇంధన ధరలు విపరీతంగా పెరగడం ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు. రాబోయే ద్రవ్యోల్బణానికి స్పష్టమైన సంకేతాలు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత స్టాక్ మార్కెట్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంటారు. మోదీ ప్రభుత్వం దీనిని సాధారణం (నార్మల్) అని పిలవొచ్చు. కానీ వాస్తవం ఏంటంటే ఉత్పత్తి, రవాణా మరింత ఖరీదైనవిగా మారుతాయి. ఎంఎస్ఎంఈలు అత్యంత తీవ్రంగా దెబ్బతింటాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. ఎఫ్ఐఐల డబ్బు మరింత వేగంగా బయటకు తరలిపోతుంది. ఇది స్టాక్ మార్కెట్‌పై మరింత ఒత్తిడిని పెంచుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఇది ప్రతి కుటుంబంలోని ఉన్న వ్యక్తి జేబుపై ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావం చూపడం ఖాయం. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు కూడా పెరుగుతాయి' అని అన్నారు.

## జీవన్ రెడ్డికి బుజ్జగింపులు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నుంచి జగిత్యాలకు విచ్చేశారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌తో కలిసి ఆయన నివాసానికి చేరుకుని జీవన్‌రెడ్డితో రెండు గంటలకు పైగా చర్చలు జరిపారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగాలని జీవన్ రెడ్డిని మంత్రులు కోరారు. అనంతరం జీవన్ రెడ్డి నివాసంలోనే మంత్రి శ్రీధర్ బాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కోసమే 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. జీవన్ రెడ్డి పార్టీ మారే అంశంపై చర్చించేందుకు ఇక్కడికి వచ్చామని, చర్చల విషయాలను అధిష్టానం దృష్టికి, సీఎం రేవంత్ రెడ్డికి తీసుకువెళ్తామన్నారు. ఏ నిర్ణయం తీసుకోవద్దని కాంగ్రెస పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరామన్నారు. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో జీవన్‌రెడ్డి ప్రజల గొంతుకగా ఉన్నారన్నారు. ఆయన బాధపడితే తాము బాధపడుతామన్నారు. తెలంగాణలో జీవన్ రెడ్డి అంటే తెలియని వారు ఉండరని , సీనియర్ నాయకులు కూడా జీవన్ రెడ్డితో మాట్లాడి పార్టీలో ఉండాలని కోరినట్లు వివరించారు. నాలుగు దశాబ్దాల పాటు పద్ధతి గల నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ సంక్షేమం కోసం పనిచేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని, పదవుల కోసం ఏనాడు ఆరాటపడలేదని వివరించారు. ఈ సమావేశంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు మేడిపెల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం జీవన్ రెడ్డి



కార్యకర్తలతో మంత్రులతో జరిపిన మంతనాలను వివరించి మాట్లాడారు. ఎవరొచ్చి మాట్లాడినా తగ్గేది లేదని దేవుడు ఎలా శాసిస్తే మానవుడు అలా అనుసరిస్తాడన్నారు.

**తెలంగాణ బడ్జెట్ సంక్షేమానికి పెద్దపీట**

అనంతరం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమానికి పెద్ద పీఠ వేసేలా రూపొందించామన్నారు. రాష్ట్ర జనాభాలో ఉన్న కోటి 15 లక్షల మందికి ప్రమాధ భీమా అనే నూతన సంక్షమ పథకాన్ని అమలులోకి తీసుకరావడం గొప్ప విషయమన్నారు. ఉద్యోగస్థులకు సంబంధించిన విషయంలో ప్రత్యేక దృష్టి పెడుతూ ఆరోగ్య కార్డులు అందించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ప్రభుత్వ విధ్యను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## పరిరక్షించాలి (మొదటి పేజీ తరువాయి)

తెలియజేశారు. ఈ పండుగ దినాలు పశ్చిమాసియాకు స్థిరత్వం, శాంతి, శ్రేయస్సును తీసుకువస్తుందన్న ఆశాభావాన్ని భారత ప్రధాని వ్యక్తంచేశారు. నరేంద్రమోదీ ఇరాన్ అధ్యక్షుడితో జరిపిన టెలిఫోన్ సంభాషణలో ఈ ప్రాంతంలోని కీలక సదుపాయాలపై జరుగుతోన్న దాడులను ఖండించారు. యుద్ధ ఉద్రిక్త పరిస్థితులపై ఆరాతీశారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తున్నాయని, ప్రపంచ సప్లయ్ గొలుసుకు అంతరాయం కలిగిస్తున్నాయని మోదీఅన్నారు.అలాగే నౌకాయన మార్గాలుతెరిచి, సురక్షితంగాఉండేలా చూసుకుంటూ నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఇరాన్‌లో భారత పౌరుల భద్రతకు ఇరాన్ అందిస్తున్న నిరంతర మద్దతును ప్రధానమంత్రి ప్రశంసించారు. ఫిబ్రవరి 28న ప్రస్తుత సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి ప్రధానమంత్రి మోదీ, ఇరాన్ అధ్యక్షుడి మధ్య జరిగిన రెండవ టెలిఫోన్ సంభాషణ ఇది మార్చి 12న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ఇరాన్‌లోని ప్రస్తుత పరిస్థితిపై మోదీకి వివరించారు. ఈ ప్రాంతంలోని పరిణామాలపై ఆయన తన ఇటీవలి కాలపు ఆలోచన దృక్పథాన్ని పంచుకున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న భద్రతా పరిస్థితిపై ప్రధానమంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని, అన్ని సమస్యలు,చర్చలు దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలన్న భారతదేశపు స్థిరమైన వైఖరిని పునరుద్ఘాటించారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఫిబ్రవరి 28న అమెరికా,ఇ జ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడి చేయగా దానికి బదులుగా ఇరాన్ తన పొరుగుదేశాలను, ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంది. కీలక నౌకా రవాణ మార్గమైన హోర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ నియంత్రిస్తోంది. ఈ హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచ ఇంధనంలో 20శాతం రవాణా జరుగుతోంది. సంఘర్షణలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ కొద్ది షిప్‌లను మాత్రమే ఇరాన్ అనుమతిస్తున్నది. ఈ వివాదం ప్రారంభమైన నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ సౌదీ అరేబియా, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా వంటి ప్రపంచస్థాయి నాయకులతో కూడా మాట్లాడారు.

## నేడు విడుదల (మొదటి పేజీ తరువాయి)

కోసం ఎంతో కాలంగా రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం మూడు విడుతల్లో రూ.9 వేల కోట్లను రైతు ఖాతాల్లో జమ చేసే విధంగా ప్రభుత్వం షెడ్యూల్ రూపొందించింది. రెండో విడత మరో 20 రోజుల తర్వాత ఏప్రిల్ రెండవ వారంలో రూ.2,650 కోట్ల నిధులను విడుదల చేయనుంది. ఏప్రిల్ నెలాఖరు లోపు మూడో విడతగా మిగిలిన రైతుల ఖాతాల్లో రైతు భరోసాను జమ చేయనుంది. ఇందుకు సంబంధించిన ఆర్థిక పరమైన అంశాలపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులతో చర్చించి కసరత్తును పూర్తి చేసినట్లు అధికారవర్గాలె తెలిపాయి.

## హోర్ముజ్‌ను తెరవండి!

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి'' అని యుఎఇ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి.

## 'సుప్రీం' ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)


గోపాల్ శంకర్ నారాయణన్ ఎత్తిచూపారు. పోలీసుల మీడియా సమావేశాలపై ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించుకోవడానికి మూడు నెలల గడువు ఇచ్చినప్పటికీ పోలీసులతో మాట్లాడటానికి బదులుగా పోలీస్, సాంప్రదాయ, సామాజిక మాధ్యమాల కోసం ఒక సమగ్ర యంత్రాంగాన్ని కోరాలని జస్టిస్ ఎం.బాగ్చి శంకర్‌నారాయణ్‌కు సూచించారు. విస్తృత దృక్పథంతో చూస్తే పోలీసులు బ్రీఫింగ్‌ల ద్వారా నిందితులపై పక్షపాతం సృష్టించకూడదని కోర్టు భావిస్తున్నదని జడ్జి చెప్పారు. ఎస్‌ఓపి ద్వారా పోలీసులను నియంత్రించవచ్చు. కానీ, 'మీడియా ముఖ్యంగా సోషల్ మీడియా, ప్రజల సంగతేమిటి? మనం వారిని నియంత్రించగలమా? ఒకవేళ పోల్చిచూస్తే టీవీ ఛానెళ్లు చాలా వరకు నియంత్రణలోనే ఉన్నాయి. అయినప్పటికీ వారి అభిప్రాయాలతో విభేదించవచ్చు' అని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి వ్యాఖ్యానించారు. పిటిషన్ లేవనెత్తిన తక్షణ ప్రశ్నకు మించి ప్రస్తుత సమస్యకు విస్తృతమైన పరిశీలన అవసరం కావచ్చని ఆయన అన్నారు. న్యాయమూర్తి జోయ్‌మాల్యా బాగ్చి మాట్లాడుతూ 'పోలీసులు మీడియాకు ఇచ్చే బ్రీఫింగ్‌లు బాధ్యతాయుతంగా, సహేతుకంగా ఉండాలని, పక్షపాతానికి లోనుకాకూడదని మేం అర్థం చేసుకున్నాం. ఎందుకుంటే క్రిమినల్ న్యాయవ్యవస్థలో దర్యాప్తు సంస్థ బాధితులకుగానీ, నిందితులకు గానీ అనుకూలంగా ఉండకూడదన్నారు. మీడియా సమావేశాల సమయంలో పోలీసు అధికారులు ఉద్రేకానికి లోనవడం, పెండింగ్‌లలో ఉన్న క్రిమినల్ కేసులలో తలెత్తుతున్న ప్రమాదాలే ఆందోళన కలిగిస్తున్నాయి' అని జోయ్‌మాల్యా బాగ్చి అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ మీడియా సంస్థలు బ్లాక్‌మెయిలర్ల'లా వ్యవహరిస్తున్నాయని ధర్మాసనానికి తెలిపారు. కేవలం వర్చువల్ బ్లాక్‌మెయిలర్ల కోసమే పనిచేసే కొన్ని ప్లాట్‌ఫారమ్‌లు ఉన్నాయని, వాటిని బ్లాక్‌మెయిలింగ్ అనడం కూడా చాలా తక్కువ మాట అని సొలిసిటర్ జనరల్ అన్నారు. న్యాయమైన విచారణ అనే అంశానికి సమగ్రమైన విధానం అవసరం కాబట్టి పోలీసుల కోసం మార్గదర్శకాలు లేదా ప్రామాణిక కార్యాచరణ విధానాలు (ఎస్ఓపి) అమలులోకి ఏప్రిల్ తర్వాత వచ్చే అవకాశం ఉందని, ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకుని, విస్తృత పరిధితో తిరిగి పిటిషన్ దాఖలు చేయడం మంచిదని ధర్మాసనం సూచించింది.

## వైమానిక దాడి (మొదటి పేజీ తరువాయి)

అణు కార్యక్రమంలో కీలకమైన ఈ కేంద్రంపై దాడులు జరగడం వల్ల ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కాగా మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం మరింత విస్తరిస్తున్న నేపథ్యంలో, తన ప్రతీకార చర్యలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలకూ విస్తరించవచ్చని ఇరాన్ హెచ్చరించింది. ఈ ప్రకటనతో అంతర్జాతీయ స్థాయిలో భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ముఖ్యంగా పార్కులు, వినోద కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు కూడా లక్ష్యాలుగా మారవచ్చని ఇరాన్ సైనిక ప్రతినిధులు పేర్కొనడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఇక మరోవైపు, అమెరికా మధ్యప్రాచ్యానికి అదనంగా నౌకాదళాన్ని పంపుతున్నది. సుమారు 2,500 మంది మెరైన్స్‌ను మోహరింపచేస్తున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే అక్కడ 50,000కు పైగా అమెరికా సైనికులు ఉన్న నేపథ్యంలో, ఈ నిర్ణయం యుద్ధం మరింత తీవ్రమవుతుందనే సంకేతం ఇస్తోంది. అయితే అదే సమయంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యల్లో యుద్ధ చర్యలను తగ్గించే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. ఈ రెండు విభిన్న సంకేతాలు అమెరికా వ్యూహంపై అనిశ్చితికి నిదర్శనం. కాగా, టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతుండగా, ఇరాన్ కూడా ప్రతిదాడులు చేస్తోంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల ఇంధన సదుపాయాలపై డ్రోన్ దాడులు చేసి చమురు సరఫరాను ప్రభావితం చేస్తోంది. కువైట్‌లోని ఒక పెద్ద ఆయిల్ రిఫైనరీపై దాడి జరగడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ దాడులు గ్లోబల్ ఆయిల్ మార్కెట్‌పై ప్రభావం చూపించి, ధరలను గణనీయంగా పెంచాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర యుద్ధం ప్రారంభానికి ముందు 70 డాలర్ల వద్ద ఉండగా, ఇప్పుడు 100 డాలర్లకు పైగా చేరింది. ఇక నాటో కూటమి కూడా భద్రతా కారణాల వల్ల ఇరాక్‌లోని తన సిబ్బందిని యూరప్‌కు తరలించింది. ఇది యుద్ధ ప్రభావం ప్రాంతీయంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయికి వ్యాపిస్తున్నదని సూచిస్తోంది. ఇటీవల జరుగుతున్న దాడులను ప్రభుత్వాన్ని కూల్చే కుట్రగా భావిస్తున్న ఇరాన్, తమ ప్రతిఘటన కొనసాగుతుందని ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు తమ సంకల్పాన్ని దెబ్బతీయలేవని ఇరాన్ నాయకత్వం తెలిపింది. మొత్తం మీద, ఈ సంఘర్షణ సైనిక పరంగా మాత్రమే కాకుండా ఆర్థిక, భద్రతా రంగాల్లో కూడా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది. చమురు సరఫరా అంతరాయం, పర్యాటక రంగంపై ముప్పు, అంతర్జాతీయ సైనిక కదలికలు వంటి అంశాలు ప్రపంచ సంక్షోభానికి ఇసూచికలుగా పరిశీలకులు పేర్కొంటున్నారు.

# డిండి ప్రాజెక్టు నిర్మాణంలో వివక్ష ఆపాలి

- ఏదుల రిజర్వాయర్ నుంచి సమాన ఎత్తుతో నీరు ఇవ్వాలి : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్
- ప్రాజెక్టులో జరుగుతున్న అన్యాయంపై ఏప్రిల్ 1,2 తేదీలలో ఎస్ఎల్‌బిసి టన్నెల్, ఏదుల రిజర్వాయర్ సందర్శన, 5న నల్లగొండ జిల్లా కేంద్రంలో సదస్సు
- పంట పొలాలు ఎండిపోతున్న రైతులను ఆదుకోవాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి




**ప్రజాపక్షం/నల్లగొండ :** ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులకు ఎలాంటి వివక్ష లేకుండా ఒకే లెవెల్‌తో నీటిని సరఫరా చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని ఫ్లోరైడ్, కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి (వట్టెం) ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 436 మీటర్ల ఎత్తు నుంచే నీటిని తరలించే అవకాశం కల్పిస్తుండగా డిండి కాలువకు మాత్రం 440 మీటర్ల ఎత్తు నుంచి మాత్రమే నీటిని తీసుకునేలా నిబంధనలు విధించడం వలన నల్లగొండ జిల్లాపై జరుగుతున్న అన్యాయమని పేర్కొన్నారు. డిండి ప్రాజెక్టు విషయంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ, కొంతమంది ఇంజనీర్లు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం 440 మీటర్ల నుంచి 436.70 మీటర్లకు తగ్గిన తర్వాత 1,500 క్యూసెక్కుల నీరు కూడా కేవలం 56 రోజులపాటు మాత్రమే డిండి కాలువకు అందే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. దీనివల్ల ప్రభుత్వం నిర్ణయించిన 30 టీఎంసీల నీటికి బదులుగా కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే నల్లగొండ జిల్లాకు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి కొనసాగితే మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశముందని పెర్కొన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 1,2 తేదీలలో ఎస్ఎల్‌బిసి టన్నల్, ఏదుల రిజర్వాయర్ ప్రాజెక్టులను సిపిఐ బృందం సందర్శించి, ఏప్రిల్ 5న నల్లగొండ జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు,ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెండు పంటల రైతు భరోసాను ఒకే సారి విడుదల చేయాలని కోరారు. వ్యవసాయం చివరి దశలో ఉన్న రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానంలో పారదర్శకంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి బొల్గురి నర్సింహా అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహా రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉజ్జిని యాదగిరి రావు, పబ్బు వీర స్వామి, ఆర్.అంజచారి, బంటు వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, నలపరాజు రామలింగయ్య, టి.వెంకటేశ్వర్లు, తుమ్మ బుచ్చి రెడ్డి పాల్గొన్నారు.

# నేడు నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

- సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రూ.300 కోట్ల ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని, రూ.78 కోట్లతో నిర్మించిన జిల్లా జైలును ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి
- బహిరంగవేదిక నుండి రైతుభరోసా నిధులు విడుదల చేయనున్న సిఎం



**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్టలో రూ.300 కోట్లతో నిర్మించిన అయిల్‌పామ్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిచే ఆయిల్‌పామ్‌ను ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా అధికార యంత్రాంగం ఇప్పటికే అవసరమగు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికార యంత్రాంగం, అయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్ అధికారులు నర్మెట్టలో గత రెండు రోజులుగా పర్యటిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి పర్యనకు అవసరమగు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 19న ఉగాది పర్వదినం రోజున నర్మెట్టలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు మేళా నిర్వహించి 150 స్టాళ్లను ఏర్పాటు, రైతులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. రైతుమేళాలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, శ్రీహరి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి స్పీకర్ సుఖేందర్‌రెడ్డిలు సందర్శించి, అయిల్‌పామ్ రైతులతో ముచ్చటించారు. 22న ఆదివారం సిఎం పర్యటను పురస్కరించుకొని నంగునూర్ మండలం నర్మెట్టలో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. నర్మెట్ట ఫ్యాక్టరీ ఆవరణలో జిల్లా అధికార యంత్రాంగం హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. హైదరాబాద్ నుండి సిఎం సాయంత్రం 4.30 గంటలకు నర్మెట్టకు చేరుకుంటారు. నర్మెట్టలో 62 ఎకరాల్లో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించి పైలాన్‌ను ఆవిష్కరిస్తారన్నారు. అలాగే ఎన్సాన్‌పల్లిలో శివారులో 30 ఎకరాల్లో రూ.78 కోట్లతో నిర్మించిన ఆధునాతన జిల్లా జైలు, సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ, ఆయుష్ ఆసుపత్రి, అర్బన్ ఆసుపత్రిని నర్మెట్ట నుండి సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అలాగే నర్మెట్ట ఆయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో రూ.80 కోట్లతో నిర్మించతలపెట్టిన తెలంగాణలోనే మొట్టమొదటి ఆయిల్ రిఫైనరీ నిర్మాణానికి సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఆయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో గత మూడు రోజులు రైతు మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 150 స్టాళ్లను ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం రేవంత్‌రెడ్డి సందర్శించనున్నారు. అనంతరం నర్మెట్టలో ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఇదే వేదిక నుండి రైతుభరోసా నిధులను సైతం సిఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారు. సిఎం పర్యటన సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. సిద్దిపేట సిపి రశ్మీ పేరుమాల్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. వాహనాల పార్కింగ్. విద్యుత్, ఫైర్ స్టేషన్, అంబులెన్స్, ఇతర ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ హైమావతిలు పర్యవేక్షిస్తున్నారు.

**బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్**

సిద్దిపేట జిల్లా నర్మెట్ట అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం... బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌లు పర్యవేక్షించారు. సిఎం సందర్శించే రైతు మహోత్సవం స్టాళ్లనుసైతం పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. సిఎం పర్యటనను విజయవంతం చేయాలని మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌లు పిలుపునిచ్చారు.




# సర్పంచ్‌ల ఫీడ్‌బ్యాక్‌కు ప్రాముఖ్యత

- మంత్రి అనసూయ సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యతని, ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో సర్పంచ్‌లు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌కు అత్యంత ప్రాముఖ్యతనిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయం సేకరించిన సర్పంచుల అభిప్రాయాలపై శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

**12,457 మంది సర్పంచులతో ముఖాముఖి..**

గత పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,728 గ్రామ పంచాయతీలలో మిషన్ భగీరథ అధికారులు ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. ఇందులో 12,457 మంది సర్పంచులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.



ప్రధానంగా 16 కీలక అంశాలపై ఈ సేకరణ జరిగింది. నీటి నాణ్యత, సరఫరా క్రమబద్ధత, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, పైపులైన్ లీకేజీల మరమ్మతులు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్‌ల లభ్యత, టోల్ ఫ్రీ నెంబర్ 1916పై అవగాహన, 99 రోజుల ప్రగతి ప్రణాళికలో పరిష్కారం, అభిప్రాయ సేకరణలో అధిక శాతం సర్పంచులు నీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అయితే సర్పంచులు గుర్తించిన చిన్నపాటి లోపాలను, సమస్యలను '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 2026 వచ్చేనెల 1 నుండి 15 లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**మంత్రి సీతక్క కీలక ఆదేశాలు..**

'గ్రామస్థాయిలో సర్పంచుల అభిప్రాయమే ప్రభుత్వానికి అసలైన మార్గదర్శకం. వారి సూచనల ఆధారంగా సేవలను మరింత మెరుగుపరుస్తాం' అని మంత్రి సీతక్క అన్నారు. మిషన్ భగీరథ సౌకర్యం లేని మారుమూల గ్రామాల్లో ఓపెన్ వెల్స్ తవ్వించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద వర్షాకాలం లోపే చెక్ డ్యాంలు నిర్మించాలని సూచించారు. ఆదివాసీ గూడాలు, లంబాడీ తాండాలు, అటవీ ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలన్నారు. ప్రజలు తాగునీటి సమస్యల కోసం ఎప్పుడైనా 1916 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి సూచించారు.

# ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెడతాం

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం శాసనసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొచ్చేందుకే ఈ బిల్లును ప్రవేశపెట్టబోతున్నామని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపైన కాం గ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ ప్రవేట్ మెంబర్ బిల్లును సభలో అనుమతించాలన్నారు. 'ఆరు గ్యారంటీల అమలుకు' శాసనసభలో ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టే అంశంపైన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, న్యాయ నిపుణుల బృందం, బిఆర్ఎస్ లీగల్ సెల్‌తో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ శనివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మాజీ ఎంపి, న్యాయవాది బోయినపల్లి వినోద్ కుమార్, ఎంఎల్‌సి ప్రొఫెసర్ శ్రవణ్, బిఆర్ఎస్ నాయకులు సోమ భరత్, రావులచంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రావు, మాజీ అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ హాజరయ్యారు. సమావేశం అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొలి రోజే ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీల అమలు ఫైలు పైన సంతకం చేశారని, ఆ వారం రోజుల తర్వాత జరిగిన ఉభయ సమావేశాల్లో అప్పటి గవర్నర్ ప్రసంగంలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారని కెటిఆర్ గుర్తు చేశారు. 800 రోజులైనప్పటికీ ఆరు గ్యారంటీల అమలకు అతిగతీ లేదన్నారు. ప్రజల నుంచి ఒక్క ఓటు రాబట్టడానికి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను, 11 డిక్లరేషన్లను, 420 హామీలను ఇచ్చి, వల వేసి ఓట్లు పట్టిందని అన్నారు. ఓట్లు కొల్లగొట్టి, గెలిచి, టోకున మొత్తం నాలుగు కోట్ల మందికి టోపీ పెట్టారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1986లో హయాంలో బిజెపి ఫ్లోర్ లీడర్ విద్యాసాగర్ రావు శాసనసభలో ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రవేశపెడితే అప్పటి సిఎం నందమూరి తారకరామారావు ఆహ్వానించి, చట్టాన్ని చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ప్రజల పట్ల ప్రేమ ఉంటే ప్రైవేటు బిల్లును ఆహ్వానించాలని సూచించారు. మహిళలకు రూ.2,500లు, పెన్షన్ రూ.4వేల హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత అన్ని పార్టీల నాయకులను కలిసి మద్దతు కోరనున్నట్టు కెటిఆర్ తెలిపారు.




# అర్చకుల సంక్షేమానికి పెద్దపీట



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో దేవాదాయ శాఖకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ రూ.1,200.99 కోట్లను కేటాయించింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆలయాల అభివృద్ధి, పండుగల నిర్వహణ, అర్చకుల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడం గమనార్హం. బడ్జెట్ వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బోనాలు పండుగకు రూ.20 కోట్లు కేటాయించగా, చిన్న దేవాలయాల అభివృద్ధి, మరమ్మత్తుల కోసం కామన్ గుడ్ ఫండ్‌కు సుమారు రూ.4.68 కోట్లు మంజూరు చేశారు. అర్చకులు, దేవాలయ సిబ్బంది జీతభత్యాలు, సంక్షేమం కోసం రూ.476.34 కోట్ల భారీ కేటాయింపు చేశారు. అదనంగా ధార్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, ఉత్సవాల నిర్వహణకు సుమారు రూ.50 లక్షలు కేటాయించారు. అలాగే గోదావరి పుష్కరాలు వంటి ప్రధాన ధార్మిక కార్యక్రమాలకు అవసరానుసారం ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులు ఆలయాల నిర్వహణ, అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, చిన్న దేవాలయాలకు ఆర్థిక సహాయం, ధార్మిక కార్యకలాపాల ప్రోత్సాహానికి వినియోగించబడనున్నాయి. దేవాదాయ శాఖకు ఈ స్థాయిలో కేటాయింపులు చేయడం ద్వారా రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణ, అర్చకుల సంక్షేమాన్ని బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం స్పష్టమవుతోంది.

# అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అకాల వర్షాలు, వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో పలు జిల్లాలలో అకాల వర్షాలకు వడగండ్ల వానకు మొక్కజొన్న, వరి, పత్తి ,మిరప కూరగాయలు ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. కొత్తగూడెం, వికారాబాద్ ,మంచిర్యాల, కొమురంభీం అసిఫాబాద్, వనపర్తి ఇతర జిల్లాలలో పంటలు నష్టం వాటిల్లడంతో పాటు వనపర్తి జిల్లాలో పిడుగు పాటుతో ఓ వ్యక్తి, వికారాబాద్ జిల్లాలో 217 మేకలు చనిపోయాయ్యన్నారు. అకాల వర్షాల కారణంగా చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఏర్పడిందని, యుద్ధ ప్రాతిపదికన పంటల నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం

- మాజీ డిజిపి మనవరాలికి రూ.1.20 కోట్ల టోకరా

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో సైబర్ నేరగాళ్లు మరోసారి పంజా విసిరారు. మాజీ డిజిపి కుటుంబానికి చెందిన యువతిని లక్ష్యంగా చేసుకుని మోసగాళ్లు దాదాపు రూ.1.20 కోట్ల మేరకు దోచుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన నగరంలో కలకలం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు తమను నమ్మదగిన వ్యక్తులుగా పరిచయం చేసుకుంటూ ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా బాధితురాలిని సంప్రదించారు. ప్రారంభంలో చిన్న మొత్తాలతో పెట్టుబడులు పెట్టిస్తామని నమ్మబలికిన వారు, అధిక లాభాలు వస్తాయని చెప్పి ఆమెను మోసం చేసినట్లు తెలుస్తోంది. తదుపరి దశలో నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని చూపించి, దశలవారీగా పెద్ద మొత్తాలను వివిధ బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. చివరికి డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు బాధితురాలు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. ఇటీవల హైదరాబాద్‌లో ఇలాంటి సైబర్ మోసాలు పెరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. పెట్టుబడుల పేరుతో, 'డిజిటల్ అరెస్ట్' బెదిరింపులతో, లేదా నకిలీ అధికారుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డబ్బు వెళ్లిన ఖాతాల వివరాలు సేకరిస్తూ, అంతర్రాష్ట్ర ముఠా పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. తెలియని వ్యక్తుల మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో డబ్బులు పెట్టకూడదని, ఎలాంటి అనుమానాస్పద కాల్స్ వచ్చినా 1930 హెల్ప్‌లైన్, సైబర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

# విద్య, వైద్య రంగాలను విస్మరించిన ప్రభుత్వం

- రాష్ట్రాల హక్కులను కేంద్రం లాక్కోవడం దారుణం
- సిపిఐ(ఎం) రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను విస్మరించిందని, అధిక నిధులను కేటాయించి, ఆ రెండు రంగాలను ప్రభుత్వ వ్యవస్థలో బలోపేతం చేయాలని పలువురు మేధావులు, డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ, సంక్షేమం లాంటి ప్రాధాన్యతా రంగాలకు నిధుల కేటాయింపును పెంచాలని, లేనట్లయితే వాటిని సాధించుకోవడానికి ఉద్యమాలు తప్పవని వారు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిజెఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డి.జి.నర్సింహారావు (సిపిఐ(ఎం), సారంపల్లి మల్లారెడ్డి, టి.సాగర్ (రైతు సంఘం), భూపాల్ (సిఐటియు), వెంకట్రాములు (వ్యవసాయ కార్మిక సంఘం), శ్రీరాంనాయక్ (గిరిజన సంఘం), రమణ, ఆశయ్య (వృత్తిదారుల సంఘం సమన్వయ కమిటీ), అబ్బాస్ (ఆవాజ్), అరుణజ్యోతి (ఐద్వా), ఎ.వెంకటేశ్ (డివైఎఫ్ఐ), కిరణ్ (ఎస్ఎఫ్ఐ) తదితరులు మాట్లాడారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఓ వైపు రాష్ట్రాల ఆదాయ వనరులు, కేంద్రం నుంచి వచ్చే వాటాలు తగ్గుతున్నాయని, మరోవైపు ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్రానికి పంపే వాటాలో రాష్ట్రాలకు 42 శాతమే తిరిగి వస్తున్నదని, ఆ కేటాయింపుల్లోనూ బిజెపి పాలిత రాష్ట్రాలకు ఒక విధంగా, ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలకు మరో విధంగా ఉంటున్నదని ఎత్తిచూపారు.

**విద్య, వైద్యం, రవాణ సేవలను ఉచితంగా అందించాలి**

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ స్వీడన్‌లో ధనికులపై 60 శాతం పన్నులు వేస్తారని, ఆ దేశంలో విద్య, వైద్యం, రవాణా రంగాల సేవలను ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తున్నదని వివరించారు. ఆ మూడు రకాల సేవలను భారతదేశంలో కూడా ప్రజలకు ఉచితంగా ఇస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని చెప్పారు. భారతదేశంలోని సంపన్నులపై అదనంగా రెండు శాతం పన్ను వేస్తే పేదలకు సంక్షేమం సాధ్యమని ప్రభాత్ పట్నాయక్ చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు.

**బిఆర్ఎస్ సర్కార్‌ను మించి కాంగ్రెస్ సర్కార్ అప్పులు**

పాపారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ సర్కార్‌ను మించి అప్పులు చేస్తున్నదన్నారు. కెసిఆర్ పదేళ్లలో రూ.6 లక్షల కోట్లకు పైగా అప్పు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరల్లోనే రూ.3.49 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈసారి బడ్జెట్‌లో మరో రూ.82 వేల కోట్ల అప్పు చేయనున్నట్లు పొందుపర్చారని వివరించారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా రుణాలు, వడ్డీలు, జీత భత్యాలకే పోతే సంక్షేమం, అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ, వైద్య రంగాలకు అరకొర నిధులు కేటాయించడం తగదన్నారు.

## నేడు ''సోషల్ మీడియా- ఇంపాక్ట్- పాజిటివ్ అండ్ నెగెటివ్'' అంశంపై జాతీయ సదస్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''సోషల్ మీడియా ఇంపాక్ట్ పాజిటివ్ అండ్ నెగెటివ్'' అనే అంశంపై జాతీయ సదస్సును తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియూడబ్ల్యూజె), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఇండియా (మెఫి) ఆదివారం హైదరాబాద్‌లో ఒక జాతీయ సదస్సును నిర్వహించనున్నాయి. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో గల సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు సదస్సు జరగనుంది. న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ వెబ్‌సైట్ 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకులు ఎంకె.వేణు కీలకోపన్యాసం చేస్తారు. సీనియర్ జర్నలిస్ట్ ములుగు సోమశేఖర్ అధ్యక్షత వహిస్తారు. ఈనెల 27–29 తేదీలలో విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) 11వ ప్లీనరీ సందర్భంగా ఈ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు టియూడబ్ల్యూజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, మెఫి మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియా తీరు, దాని ప్రభావంపై భిన్నమైన భావాలు వ్యక్తం అవుతున్న ప్రస్తుత సమయంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 29న ట్రైనీ సూపర్‌వైజర్ల రాత పరీక్షలు

- టిఎస్ఎల్‌పిఆర్‌బి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో 198 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ ల పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 29న రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డు ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబరు 25న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఈ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను ఈ నెల 23వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 28వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు బోర్డు అధికారిక వెబ్‌సైట్ www.tgprb.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఒకవేళ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తితే support@ tslprb.in కు ఈమెయిల్ చేయాలని లేదా పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య 9391005006 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు

- ముస్లిం సోదరులతో కిక్కిరిసిన ఈద్‌గాలు, మసీదులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పవిత్ర రంజాన్ నెల ముగిసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈద్‌ఉల్‌ఫితర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మసీదులు, ఈద్గాలు ముస్లింల ప్రార్థనలతో కళకళలాడాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లోని కవాడిగూడ, అంబర్‌పేట్, ఎన్‌టిఆర్ స్టేడియం, కుతుబ్ షాహీ టుంబ్స్, మక్కా మసీదు, బహదూర్‌పుర, సైదాబాద్ ఈద్గాలకు ముస్లిం సోదరులు తమ కుటుంబాలతో పెద్ద ఎత్తున తరలి వచ్చి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమృద్ధి నెలకొనాలని ప్రార్థించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా రంజాన్ పండుగను అత్యంత ఆనందోత్సాహంతో జరుపుకున్నారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు మసీదుల వద్ద ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించగా, పేదలకు జకాత్, ఫిత్రా రూపంలో దానం చేయడం విశేషంగా కనిపించింది. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాల్లో సంప్రదాయ వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా శీర్ ఖుర్మా, బిర్యానీ వంటి వంటకాలను తయారుచేసి బంధుమిత్రులతో పంచుకున్నారు. పండుగ ఆనందాన్ని అందరితో పంచుకోవాలనే ఉద్దేశంతో వివిధ వర్గాల ప్రజలను తమ ఇళ్లకు ఆహ్వానించడం గమనార్హం. రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రార్థనల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు కీలక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ముస్లిం సోదరులకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావం, ఐక్యతకు రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మొత్తంగా తెలంగాణ వ్యాప్తంగా రంజాన్ పండుగ ఆనందం, ఆధ్యాత్మికత, సామాజిక సమానత్వం సందేశాలతో ఘనంగా జరుపుకోవడం ప్రత్యేకంగా నిలిచింది.



# పశ్చిమాసియ యుద్ధ ప్రభావం
# రోడ్డున పడ్డ 25 లక్షల మంది కార్మికులు

### మూతపడ్డ హోటళ్లు
### -అద్దెలు కట్టలేమంటున్న వ్యాపారులు
### -రోడ్డుపాలవుతున్న పాడి రైతులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం, తెలంగాణ కార్మికులు, హోటళ్ల యజమానులపై తీవ్ర ప్రభావం పడింది.పక్షం రోజుల నుంచి వాణిజ్య గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో వేల సంఖ్యలో చిన్నా చితక హోటళ్లు మూతపడగా, ఇందులో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. రోజు వారి కూలీ డబ్బుతో జీవనం పోసుకుంటున్న వీరి బాధలు వర్ణనాతీతంగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 70 వేలకుపైగా టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, బిర్యానీ, భోజన హోటళ్లు మూతపడినట్లు అంచనా. ఇందులో పనిచేస్తున్న కార్మికులతో పాటు హోటళ్లకు వస్తువులు సరఫరా చేసే వాళ్లు ప్రస్తుతం రోడ్డున పడ్డారు. ఇలా రోడ్డున పడ్డ వారి సంఖ్య సుమారు 25 లక్షల కుటుంబాలు ఉన్నాయని నిఘా వర్గాల అంచనా.

**హాస్టళ్లలో నిచిలిచపోయిన వంటలు ..**

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షకుపైగా ప్రైయివేటు హాస్టళ్లు నడుస్తున్నాయి. ఇందులో వంట పనుషులుగా పనిచేస్తున్న వారు సుమారుగా మూడు లక్షల వరకు ఉంటారు. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో హాస్టళ్లలో ఎక్కడికక్కడ వంటలు బంద్ అయ్యాయి. ఇందులో పనిచేస్తున్న వంట కార్మికులకు పనులు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**పానీపూరీ సెంటర్లు బంద్..**

రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ నుంచి తెలంగాణకు జీవనోపాధి కోసం వచ్చిన పానీపూరీ, గప్‌చుప్ బండ్లను నడిపిస్తున్న వారి కుటుంబాల సంఖ్య కూడా లక్షకుపైగానే ఉంటుంది. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ఈ కుటుంబాలు కూడా తమ వ్యాపారాలను బంద్ చేసుకున్నారు. దీంతో ఈ కుటుంబాలు దీనావస్థలో పడ్డాయి.ఇక ఇండ్లలో చేసుకునే చిన్న చిన్న శుభకార్యాల కోసం క్యాటరింగ్ చేసుకునే వ్యాపారులు సైతం రోడ్డున పడ్డారు. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో వంటలు బంద్ చేయడంతో ఇందులో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు పనిలేక పస్తులు ఉంటున్నారు.

**లబోదిబోమంటున్న పాడిరైతులు..**

మరోపక్క హోటళ్లు, టి స్టాల్స్ మూత పడడంతో వీటికి పాలు ఇతర సరకులు సరఫరా చేసే వేలాది మంది చిన్నాచితక వ్యాపారులు లబోదిబోమంటున్నారు. హోటళ్లు మూతపడడంతో తాము రోజు తీసుకు వచ్చే లక్షలాది లీటర్ల పాలు ఎవరికి పోయాలో తెలియక పాడి రైతులు పెద్ద పెద్ద డెయిరీలకు తక్కువ ధరకే తమ పాలను విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లోని హోటళ్లకు మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మల్కాజ్‌గిరి, నల్గొండ, వరంగల్, గుంటూరు, అనంతపురం నుంచి లక్షలాది లీటర్ల పాలు ప్రతి రోజు సరఫరా జరుగుతుంది. పాడి రైతులతో పాటు పాలు సరఫరా చేసే డ్రైవర్లకు సైతం మూడు పువ్వులు, ఆరు కాయలుగా తమ సంపాదన ఉండేది. యుద్ధ ం నేపథ్యంలో వీరందరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం తమ పాల విక్రయాలు నష్టాల్లో నడుస్తున్నా, రెపోమాపో హోటళ్లు తెరిస్తే తాము గట్టెక్కుతామన్న ఆశతో పాడి రైతులు గ్యాస్ సరఫరా ఎప్పుడు మొదలవుతుందోనని ఆశతో ఎదురు చూస్తున్నారు.

**అద్దెలపై రగడ..**

రాష్ట్ర వ్యాప్తంగా సగానికిపైగా టి, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు మూతపడడంతో దీని ప్రభావం షాప్ అద్దెలపై పడింది. ఇందులో కొన్ని హోటళ్ల యజమానులు తమ షాప్‌లకు రోజు వారి చొప్పున అద్దెలు చెల్లిస్తున్నారు. వారం రోజుల నుంచి తమ వ్యాపారాలు బంద్ కావడంతో అద్దెలు చెల్లించడం వారికి కష్టసాధ్యంగా మారింది. వ్యాపారం నడవని నడవకపోని తమకు మాత్రం అద్దె కట్టాల్సిందేనని షాప్ యజమానులు భీష్మిస్తున్నారు. ఇన్ని రోజులు వినియోగదారులకు మంచి సేవలు అందించి తమ వ్యాపారాన్ని పటిష్టం చేసుకున్న తరుణంలో ఇలాంటి దుస్థితి రావడం తమకు దిక్కుతోచటం లేదని హోటళ్ల యజమానులు ఆవేదన చెందుతున్నారు. అద్దె చెల్లించాలంటే వ్యాపారం నడవడం లేదు..అద్దె కట్టకపోతే షాప్ ఖాళీ చేయమని భవన యజమాని అంటున్నారు తమకు ముందు నొయ్యి, వెనక గొయ్యి పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.రెపోమాపో తిరిగి హోటళ్లు తెరుచుకుంటాయనే ఆశాభావంతో అప్పోసప్పోచేసి అద్దెలు కడుతున్నామని వారంటున్నారు.

### వాణిజ్య సిలిండర్ల సరఫరాను
# 20 శాతం పెంచిన కేంద్రం



**న్యూఢిల్లీ :** వాణిజ్య సిలిండర్ల సరఫరాపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను 20 శాతం పెంచినట్లు తెలిపింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాసింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్ సరఫరాకు సంబంధించి గృహ అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని గతంలో పేర్కొన్న కేంద్రం, ఇప్పుడు హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, క్యాంటీన్లకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా చాలా హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాలు, క్యాంటీన్లు మూతపడటంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, వలస కూలీలకు ఉచితంగా 5 కిలోల గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎల్లుండి నుంచి వాటిని సరఫరా చేస్తామని ప్రకటించింది.

**వాణిజ్య సిలిండర్ కేటాయింపును పెంచుతూ కేంద్రం నిర్ణయం**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్‌లో ఇంధన సరఫరాలపై తాత్కాలిక ఒత్తిడి ఏర్పడింది. ఈ ప్రభావంతో ముఖ్యంగా వాణిజ్య సిలిండర్ సరఫరాలు తగ్గుముఖం పట్టడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అయితే ఆ పరిస్థితులు ప్రస్తుతం సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో వాణిజ్య సిలిండర్ కేటాయింపును మరింతగా పెంచుతూ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. వాణిజ్య అవసరాలకు కేటాయించిన సిలిండర్లలో ముందుగా కోత విధించిన ప్రభుత్వం, ఆ తర్వాత దశలవారీగా వాటిని పునరుద్ధరించింది. తాజాగా మరో 20 శాతం అదనపు కేటాయింపును ఆమోదించింది. దీంతో మొత్తం వాణిజ్య సిలిండర్ కేటాయింపు 50 శాతానికి చేరింది. కాగా, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో మంది చిరువ్యాపారులకు ఊరటను కలగనుంది.

**అదనపు కేటాయింపునకు కొన్ని షరతులు**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో మొదట్లో గృహ వినియోగదారులకు ప్రాధాన్యత నిస్తూ వాణిజ్య సిలిండర్ సరఫరాలను తగ్గించారు. ఆ తరువాత పరిస్థితులు కొంత మెరుగుపడటంతో 20 శాతం సరఫరాను పునరుద్ధరించారు. అదనంగా 10 శాతం సరఫరాను రాష్ట్రాలు పైప్‌డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) ప్రాజెక్టులను వేగవంతం చేస్తే మాత్రమే అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు మరో 20 శాతం పెంపుతో వాణిజ్య రంగానికి గణనీయమైన ఊరట లభించింది. అయితే ఈ అదనపు కేటాయింపుకు కొన్ని షరతులు విధించారు. వాణిజ్య సంస్థలు చమురు కంపెనీలతో నమోదు చేసుకోవాలి. అలాగే పైప్‌డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటేనే ఈ అదనపు కేటాయింపు సాధ్యమవుతుంది.

**సిలిండర్లు కొరత లేదు!**

ఇదిలా ఉండగా, దేశంలో గృహ వినియోగ సిలిండర్ సరఫరా స్థిరంగా ఉందని, పంపిణీ కేంద్రాల వద్దనుంచి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. సాధారణ డెలివరీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా, ప్రజలు ఆందోళనలతో చేసే బుకింగ్స్ చాలా వరకు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. వినియోగదారులు సిలిండర్ కోసం పంపిణీ కేంద్రాల వద్ద అనవసరంగా గుమికూడవద్దని, హోం డెలివరీపై ఆధారపడాలని సూచించారు. మరోవైపు, సిలిండర్ సరఫరాల ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం సహజ వాయువు (పీఎన్‌జీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా వాణిజ్య రంగంలో పీఎన్‌జీ వినియోగం పెంచాలని రాష్ట్రాలకు సూచనలు జారీ చేసింది. నగర గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్‌లకు అనుమతులు త్వరగా మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

**రిటైల్ అవుట్‌లెట్లలో ఎలాంటి ఇంధన కొరత లేదు!**

ఇక ఇంధన రంగంలో ఇతర అంశాలపైనా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రిటైల్ అవుట్‌లెట్లలో ఎలాంటి ఇంధన కొరత నమోదు కాలేదని, ప్రజలు ఆందోళనతో కొనుగోళ్లు చేయవద్దని సూచించినట్లు పేర్కొంది. ఇంకా సరఫరా సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచడం, బుకింగ్ మధ్య వ్యవధిని పొడిగించడం, రాష్ట్రాలకు అదనపు కిరోసిన్ సరఫరా చేయడం వంటి చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపింది. దీనివల్ల ప్రజలకు ప్రత్యామ్నాయ ఇంధన అవకాశాలు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు.



## టపాసుల లారీకి విద్యుత్ వైర్లు తగిలి దగ్ధం

**ప్రజాపక్షం/కొత్తూరు:** టపాసుల లోడ్‌తో వెళ్తున్న లారీకి ఆకస్మత్తుగా విద్యుత్ వైర్లు తగలడంతో లారీ పూర్తిగా దగ్ధమైన సంఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంజర్ల రోడ్డు మణిక్యమ్మగూడ వెపు వెళ్తున్న సమయంలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం ఘటన స్థలానికి షాద్‌నగర్ డిసిపి శిరీష,ఏసిపి లక్ష్మీ నారాయణతోపాటు సిఐ నర్సయ్యలు చేరుకొని పరిశీలించారు. తమిళనాడు రాష్ట్రంలోని శివకాశీ నుండి టపాసుల లోడ్‌తో మహేశ్వరం మండలం మీదుగా నిజామాబాద్ జిల్లాకు వెళ్తున్నట్లు పోలీసులు వివరించారు. లారీలో ఉన్న డ్రైవర్ అయ్యప్పన్, క్లినర్ సట్టివేల్‌లు సురక్షితంగా బయటపడ్డారు. లారీ దగ్ధమవుతున్న విషయాన్ని అందుకున్న షాద్‌నగర్ ఫైర్ సిబ్బంది హుటాహుటిని ఘటన స్థలానికి చేరుకొని ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రణ నష్టం జరగలేదు. ఈ విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాలను వెంటనే ఎక్కడికక్కడే నిలిపివేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డిఎఫ్ఎస్ ఆదేశాలను ఖండించిన ఎన్‌సిబిఇ

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్సియల్ సర్వీసెస్(డీఎఫ్ఎస్) జారీ చేసిన కొత్త పర్ఫామెన్స్ లింక్‌డ్ ఇంటెన్సివ్(పీఎల్ఐ) పథకాన్ని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్(ఎన్‌సీబీఈ) తీవ్రంగా ఖండించింది. యూనియన్లతో సంప్రదించకుండా తీసుకున్న ఏకపక్ష నిర్ణయమని సంఘం ఆక్షేపిస్తూ ప్రకటన విడుదల చేసింది. సవరించిన ఈ విధానం ఉద్యోగుల మధ్య అసమానతలను, విభజనలను సృష్టిస్తుందని.. ఈ చర్యను వ్యతిరేకిస్తూ, ఎన్‌సీబీఈ దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాలను ప్రకటించింది. అవసరమైతే సమ్మెకు దిగేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని సంఘం హెచ్చరించింది. డీఎఫ్ఎస్ ఆదేశాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎన్‌సీబీఈ డిమాండ్ చేసింది. పీఎల్ఐ పథకానికి సంబంధించిన ఏ నిర్ణయాలైనా యూనియన్లతో సరైన చర్చల ద్వారా మాత్రమే తీసుకోవాలని ఎన్‌సీబీఈ జనరల్ సెక్రెటరీ ఎల్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

## శ్రమ మాది.. శిలాఫలకం రేవంత్ రెడ్డిదా?

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట:**నేడు సిద్దిపేట జిల్లా లో ప్రారంభించే కార్యక్రమాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసి,నిధులు కే టాయించి,నిర్మాణాలు పూర్తి చేసినవేనని మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా పర్యాటన నేపథ్యంలో శనివారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో సిద్దిపేట నియోజకవర్గానికి కొత్తగా మంజూరైనా కార్యక్రమం ఒక్కటి లేదని నేడు సిద్దిపేటలో ప్రారంభించే కార్యక్రమాలన్నీ బిఆర్ఎస్ హయాంలో మంజూరు చేసి నిర్మించినవేనని అన్నారు.ఆరోగ్య శాఖ మంత్రిగా నాడు నేను మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలకు ముఖ్యమంత్రి నేడు రిబ్బన్ కటింగ్ చేస్తున్నారని అన్నారు.దేవాలయాలు,విద్యాలయాలతో పాటు 78 కోట్లతో 30 ఎకరాల స్థలంలో జిల్లా జైలును నిర్మించింది కూడా మేమేనని అన్నారు.కేవలం రాజకీయ కక్షతో రద్దు చేసిన పనులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## అడవుల సంరక్షణకు ప్రాధాన్యం

### అటవీ శాఖకు రూ.166 కోట్ల కేటాయింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ 202627 బడ్జెట్‌లో అటవీ శాఖకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. అడవుల సంరక్షణ, వన్యప్రాణుల రక్షణ, అభయారణ్యాల అభివృద్ధిపై దృష్టి సారిస్తూ మొత్తం రూ.166.39 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో రాష్ట్ర రంగ పథకాల కోసం రూ.125.14 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కోసం రూ.41.25 కోట్లు కేటాయించారు.అభయారణ్యాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 'సివిల్ వరక్స్ ఫర్ సాంక్చువరీస్' పథకానికి సుమారు రూ.70 కోట్లు కేటాయించడం ముఖ్యంగా నిలిచింది. వన్యప్రాణుల నివాసాల అభివృద్ధికి 'ఇంటిగ్రేటేడ డెవలప్‌మెంట్ ఆఫ్ వైల్డ్‌ఫ్ హాబిటాట్స్' పథకానికి నిధులు కేటాయించగా, పులుల సంరక్షణ కోసం 'ప్రాజెక్ట్ టైగర్' కొనసాగింపుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది.అడవుల్లో అగ్ని ప్రమాదాలను నియంత్రించేందుకు 'ఫైర్ మేనేజ్‌మెంట్' పథకానికి కూడా నిధులు కేటాయించారు. కేంద్ర పథకాల అమలులో భాగంగా రాష్ట్రం తన వాటాగా రూ.13.88 కోట్లు మ్యాచింగ్ షేర్‌గా కేటాయించింది.మొత్తంగా ఈ బడ్జెట్‌లో అటవీ శాఖకు కేటాయించిన నిధులు వన్యప్రాణి సంరక్షణ, అడవుల అభివృద్ధి, అగ్ని నియంత్రణపై ప్రభుత్వ దృష్టిని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.

# పండుగలు మనుషుల మధ్య ఐఖ్యత పెంచుతాయ్



### గంగా-జమునా తెహాజీబ్ సంస్కృతి కాపాడుకుందాం
### నిరుపేద ముస్లీం కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత
### రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** రంజాన్ పర్వదినం క్రమ శిక్షణకు, సోదరభావానికి ప్రతీకని, ఈ పండుగ సమాజంలో శాంతిని వెల్లవిరియజేస్తుందని, రంజాన్ కేవలం ముస్లీం సోదరుల పండుగే కాకుండా సమస్త మానవాళికి ఒక సందేశమని కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు మసీదులు, ఈద్గాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని వారికి పర్వదిన శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని గడపడం గొప్పవిషయం అన్నారు. రంజాన్ మాసం నేర్పిన త్యాగనిరతి, ధాతృత్వం ఏడాది పొడవునా కొనసాగించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని మసీదులు, ఈద్గాలు అదేవిధంగా ఖబరిస్తన్ల అభివృద్ధిపై తనకు ప్రత్యేక దృష్టి ఉందని, వాటి పునః నిర్మాణానికి అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లీం మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ప్రభుత్వం పరంగా అందాల్సిన ఫలాలు ప్రతీ ఒక్క పేదకుటుంబానికి చేరేలా చూస్తామని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో అన్ని మతాల వారు సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, నాయకులు ముత్యాలవిశ్వనాధం, పూర్ణ చంద్రరావు, సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, మైనార్టీ నాయకులు నయూమ్ ఖురేషీ, అబీద్ హుస్సేన్ ఉమర్ ఫరూక్, జహంగీర్, అమీర్ ఖాద్రి, అబ్దుల్ కరీమ్, జుబేర్, జావెద్, కార్పొరేటర్లు సాయిబాబా, విశ్వేశ్వరరావు, బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, జ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

**అసెంబ్లీ సమావేశాల్లో పంట నష్టంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : ఎంఎల్ఎ కూనంనేని**

వడగండ్లవాన, ఈదురు గాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని, పంట నష్టంపై తక్షణమే సహాయం అందేలా కృషి చేస్తానని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు రైతాంగానికి హామీ ఇచ్చారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా మొక్కజొన్న పంటకు జరిగిన భారీ నష్టంపై ఆయన శనివారం స్పందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వడగండ్ల వాన, ఈదురు గాలులకు మండలంలో పంట తీవ్రంగా దెబ్బతిన్నదని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుసప్పులు చేసి సాగు చేసిన పంటలు చేతికందే సమయానికి ప్రకృతి కన్నెర్రతో పాడైపోయాయని పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో శాస్త్రీయపద్ధతిలో సర్వే చేపట్టి నివేదికలు ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. రైతులు ఎదుర్కొన్న ఈ సమస్యపై అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖా, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. అన్నదాతలు ఎవ్వరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటామన్నారు.



### ఆగమశాస్త్రానుసారం
## భద్రాచలం అభివృద్ధి
### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో ఆలయ అభివృద్ధి ప్రణాళికలుండాలి
### అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాచల శ్రీ సీతారామచంద్ర మూర్తి ఆలయ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు పూర్తయిన భూసేకరణ అనుగుణంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా పూర్తిగా ఆగమశాస్త్రానుసారం అభివృద్ధి పనులు నిర్వహించాలని అధికారులకు సిఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా ప్రణాళికలుండాలన్నారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి అంచనాలతో తొలి దశ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలోని ఘాట్స్ నిర్మాణం, అభివృద్ధి ఉండాలన్నారు. 2027 మార్చి 31 నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పుష్కరాలు ముగిసిన అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు ఇప్పుడే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఇఒ, పూజారులు, అధికారులు పాల్గొన్నారు.

### ఆధునిక సదుపాయాలతో
# రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యం

### మోడల్ బస్టాండ్ పనులను పరిశీలించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలో రూ.4.80 కోట్ల వ్యయంతో నిర్మించబడుతున్న నూతన ఆర్‌టిసి బస్టాండ్ నిర్మాణ పనులను గౌరవ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బస్టాండ్ నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఆధునిక సదుపాయాలతో కూడిన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం త్రాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు వంటి మౌళిక వసతులు సమకూర్చబడతాయని పేర్కొన్నారు. ములుగు జిల్లా అభివృద్ధిలో భాగంగా ఈ బస్టాండ్ కీలక పాత్ర పోషిస్తుందని, నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, ప్రజా ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పత్తి చేనులో పసికందు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం వల్లగొండ గ్రామ పంచాయతీ సీతానగర్ శివారులో పత్తి చేనులో పసికందును వదిలివెళ్లిన ఘటన శనివారం కలకలం రేపింది. స్థానికులు ఉదయం పత్తి చేను వైపు వెళ్లగా శిశువు అరుపులు వినిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంచిలో చుట్టి ఉన్న ఆడ శిశువును సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం శిశువును కాగజ్ నగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న బాల సంరక్షణ అధికారి మహేశ్ తన సిబ్బందితో కలిసి ఆసుపత్రికి చేరుకున్నారు. ఒక రోజు వయసున్న ఆ పసికందును మెరుగైన సంరక్షణ కోసం బాల సంరక్షణ కేంద్రానికి తరలించారు. కన్నపేగు బంధాన్ని తెంచుకుని పసికందును అడవి పాలు చేసిన వారిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# యువరైతు ఆత్మహత్య....

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**గల్ఫ్‌నుండి వచ్చాక అప్పులభారంతో చేసుకున్న సంఘటన వీర్నపల్లి మండలంలో చోటుచేసుకుంది.తీవ్రమనోవేధనకు గు రై శాంతినగర్‌కు చెందిన గుగులోతు గోపాల్ ఆత్మహత్యకు పాల్పడటం విషాదకరమని స్థానికులు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం మధ్యలోనే ఆగింది.అప్పులు చేసి గల్ఫ్‌వెళ్ళి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు.మానసికంగా ఒత్తిడికి గురై తనమరణానికి కారణం కావడం చ ర్చనీయంశంగా మారింది,గ్రామంలో విషాదచాయలు అలుముకున్నా యి,మృతునికి భార్య నిర్మల,ఇద్దరు కుమార్తెలు కుమారుడు చదువుకుంటున్నారు.భాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాల ని ఎవరైన దాతలు ఉంటే ముందుకు రావాలని గ్రామవాసులు అన్నారు.

# ఓటింగ్ హక్కును లాక్కోనివ్వం


- చివరి వరకూ పోరాడుతాం : మమతా బెనర్జీ



**కోల్‌కతా :** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ద్వారా ప్రజల ఓటు హక్కులను లాక్కోవడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రయత్నిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో ఈద్ ప్రార్థనల అనంతరం వేలాది మంది ముస్లిం సోదరునుద్దేశించి ఆమె మాట్లాడారు. పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని అధికార పార్టీ ఆరోపిస్తున్న ఈ సర్ ప్రక్రియ, రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు జరుగుతున్న 'విస్తృత ప్రయత్నంలో' భాగమని టిఎంసి అధినేత్రి ఆరోపించారు.'(ప్రధానమంత్రి నరేంద్ర) మోదీజీ మీ ఓటు హక్కులను లాక్కోవడానికి మేము అనుమతించము. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి పౌరుడి హక్కులను కాపాడటానికి మేము చివరి వరకు పోరాడతాము' అని బెనర్జీ అన్నారు. ఎన్నికలకు ముందు, ముఖ్యంగా మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల నుండి నిజమైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నంగా టిఎంసి పదేపదే అభివర్ణిస్తున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తీవ్రమవుతున్న రాజకీయ వివాదం మధ్య ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితాల సవరణ లేదా ధ్రువీకరణ పేరుతో ఓటర్ల ఓటు హక్కును రద్దు చేసే ఏ ప్రయత్నాన్నైనా తమ పార్టీ ప్రతిఘటిస్తుందని బెనర్జీ హెచ్చరించారు.'బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకుని, ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తున్న వారు నరకానికి పోవాలి' అని ఆమె పేర్కొనగా, సభికుల నుండి పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వినిపించాయి. బెంగాల్‌కు ఉన్న సుదీర్ఘ మత సామరస్య సంప్రదాయాన్ని ప్రస్తావిస్తూ, సమాజాన్ని ధ్రువీకరించడానికి ప్రయత్నించే శక్తులను రాష్ట్రం విజయం సాధించనివ్వదని ముఖ్యమంత్రి అన్నారు.'బెంగాల్ ఐక్యతను విశ్వసిస్తుంది. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు... ఇక్కడ అందరూ కలిసి జీవిస్తారు. ఈ సామాజిక బంధాన్ని విచ్ఛిన్నం చేయడానికి మేము ఎవరినీ అనుమతించము' అని ఆమె అన్నారు. తూర్పు భారతదేశంలోని అతిపెద్ద సమావేశాలలో ఒకటైన రెడ్ రోడ్‌లోని వార్షిక ఈద్ సమావేశం, ఎన్నికల సంవత్సరాలలో తరచుగా రాజకీయ వేదికగా కూడా ఉపయోగపడుతుంది. ఈ సభలో ప్రసంగించిన టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, సమాజాన్ని విభజించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ముఖ్యమంత్రి చేసిన విమర్శలను పునరుద్ఘాటించారు. బెంగాల్ మత సామరస్య సంప్రదాయాన్ని పరిరక్షిస్తామని ఆయన నొక్కి చెప్పారు. 'బెంగాల్ మత సామరస్యం పరిరక్షించబడుతుంది. వర్గాలను విభజించే ప్రయత్నాలు ఎలాంటి ఫలితాలనివ్వవు' అని ఆయన అన్నారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా టిఎంసి ప్రతిఘటిస్తుందని డైమండ హార్బర్ ఎంపి ధిక్కార స్వరంతో ప్రకటించారు. 'నా తల నరకవచ్చు కానీ నేను తలవంచను' అని అభిషేక్ బెనర్జీ అన్నారు.

## ఇరాన్‌పై దాడులను ఖండించడంలో
# మోదీ ప్రభుత్వం విఫలం

- ఇది పిరికితనం...
- రాజకీయ ద్రోహం : జైరామ్ రమేష్



**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిని ఖండించడంలో అక్కడ క్రూరమైన పాలన మార్పును తీసుకురావడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ మండిపడింది. భారతదేశ నాగరిక విలువలకు చేసిన నైతిక పిరికితనం, రాజకీయ ద్రోహం అని విమర్శించింది. అమెరికా అధ్యక్షుడు (డొనాల్డ్ ట్రంప్), ఇజ్రాయెల్ ప్రధాని (బెంజమిన్ నెతన్యాహు)లతో తనకు మిత్రుత్వం ఉందని చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోదీ.. దానిని కాల్పుల విరమణకు ఉపయోగించుకోలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడి ప్రారంభమై సరిగ్గా 21 రోజులు లేదా మూడు వారాలు అయ్యిందని శనివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధాని ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన తన ఇజ్రాయెల్ పర్యటన నుంచి తిరిగి వచ్చి 23 రోజులు అయ్యిందని కూడా ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై జరిపిన భారీ వైమానిక దాడులను, దానివల్ల భారతదేశంతో సహా అన్నిచోట్లా తీవ్రమైన ఆర్థిక అవకతవకలకు దారితీయడాన్ని మోదీ ప్రభుత్వం ఖండించిందా, విమర్శించిందా లేదా విచారం వ్యక్తం చేసిందా? సమాధానం లేదన్నారు. ఇరాన్‌లో అంతర్యుద్ధానికి దారితీసే విధంగా పాలన మార్పును, దేశ పతనాన్ని బలవంతంగా రుద్దడానికి అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు చేస్తున్న క్రూరమైన ప్రయత్నాలను మోదీ ప్రభుత్వం ఖండించిందా, విమర్శించిందా లేదా విచారం వ్యక్తం చేసిందా? సమాధానం లేదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఇరాన్‌పై బాంబు దాడులను, గల్ఫ్ దేశాల్లోని ఇంధన, ఇతర కీలక మౌలిక సదుపాయాలపై ఇరాన్ జరుపుతున్న దాడులను తక్షణమే నిలిపివేయడానికి మోదీ ప్రభుత్వం తీవ్రమైన దౌత్యపరమైన ప్రయత్నాలు, చొరవలు చేపట్టిందా? కాల్పుల విరమణ కోసం ప్రధాని, అమెరికా అధ్యక్షుడు, ఇజ్రాయెల్ ప్రధానితో తనకు ఉందని చెప్పుకుంటున్న స్నేహాన్ని ఉపయోగించుకున్నారా? సమాధానం లేదని మండిపడ్డారు. 'ఈ 4 తిరస్కరణలు భారతదేశ నాగరిక విలువలకు చేసిన నైతిక పిరికితనాన్ని, రాజకీయ ద్రోహాన్ని ప్రతిబింబిస్తున్నాయి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. కాగా, మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ యుద్ధం సద్దుమణిగే సూచనలు కనిపించడం లేదు. శనివారం తెల్లవారుజామున కూడా ఇరాన్ తమపై క్షిపణులను ప్రయోగించడం కొనసాగించిందని ఇజ్రాయెల్ పేర్కొనగా, ప్రధాన చమురు కేంద్రాలున్న తమ దేశ తూర్పు ప్రాంతంలో కేవలం రెండు గంటల వ్యవధిలోనే 20 డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా తెలిపింది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై కూడా కాల్పులు జరిపింది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినోద, పర్యాటక ప్రదేశాలను బెదిరించింది. ఈ యుద్ధంలో ఇరాన్‌లో మృతుల సంఖ్య 1,300 దాటింది, లెబనాన్‌లో 1,000 మందికి పైగా, ఇజ్రాయెల్‌లో 15 మంది, ఈ ప్రాంతంలో 13 మంది అమెరికా సైనికులు మరణించారు. లెబనాన్, ఇరాన్‌లలో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు.

# 23న 'ప్రపంచ నీటి దినోత్సవ సదస్సు

- 700 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారని జలశక్తి మంత్రిత్వశాఖ అంచనా




**న్యూఢిల్లీ :** జలశక్తి మంత్రిత్వ శాఖ, ఈనెల 23న దేశ రాజధానిలో 'ప్రపంచ నీటి దినోత్సవ సదస్సు 2026'ను నిర్వహించనుంది. ఈ సమావేశంలో 700 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మార్చి 22న జరుపుకునే ప్రపంచ నీటి దినోత్సవం, మంచినీటి ప్రాముఖ్యతను, సుస్థిర నీటి నిర్వహణ ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. ఈ ఏడాది ఈ సదస్సు 'నీరు, లింగ సమానత్వం' ఇతివృత్తంగా కొనసాగనుంది. ఈ సదస్సు సుస్థిర నీటి నిర్వహణ కోసం చర్చలు, ఆవిష్కరణలు, సహకారానికి ఒక జాతీయ వేదికగా ఉపయోగపడుతుందని మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందులో విధాన రూపకర్తలు, పారిశ్రామిక నాయకులు, విద్యావేత్తలు, స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఇలు, యువ ఆవిష్కర్తలు పాల్గొంటారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, రీసైక్లింగ్, పునర్వినియోగంలో పరిశ్రమల పాత్రను ఈ సదస్సు నొక్కి చెబుతుందని, తద్వారా సుస్థిర పద్ధతులను అవలంబించే నీటి వినియోగదారుల నుండి నీటి సంరక్షకులుగా మారడానికి ఇది నాంది పలుకుతుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. జల్ శక్తి హ్యాకథాన్ విజేతలను సన్మానించడం, అలాగే '7వ చిన్న నీటిపారుదల గణన', '2వ జలాశయాల గణన', '1వ ఊటల గణన', '1వ ప్రధాన, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టుల గణన' వంటి ప్రధాన జాతీయ నివేదికలు, సాంకేతిక, నేపథ్య ప్రచురణలు, జాతీయ నీటి డేటా విధానాన్ని విడుదల చేయడం వంటివి ఈ కార్యక్రమంలోని ముఖ్యాంశాలలో ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. నాలుగు నేపథ్య సమావేశాలు బురద నిర్వహణ, ఎఐ, ఐఒటి ఉపయోగించి పరిశ్రమల నేతృత్వంలోని నీటి సామర్థ్యం, హిమానీనద వ్యవస్థలు, వాతావరణ స్థితిస్థాపకత, ప్రణాళిక కోసం నీటి గణన డేటా వినియోగంపై దృష్టి సారిస్తాయి. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంపొందిస్తూ, నీటి రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమాలను కూడా మంత్రిత్వ శాఖ ప్రముఖంగా ప్రస్తావిస్తుంది. ప్రపంచ నీటి దినోత్సవం అనే భావనను తొలిసారిగా 1992లో రియో డి జనీరోలో జరిగిన ఐక్యరాజ్యసమితి పర్యావరణ మరియు అభివృద్ధి సదస్సు (యుఎన్‌సిఇడి)లో ప్రతిపాదించారు. ఆ తర్వాత, సురక్షితమైన నీటి సదుపాయం లేకుండా జీవిస్తున్న 210 కోట్ల మంది ప్రజల గురించి అవగాహన కల్పించేందుకు, ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం మార్చి 22వ తేదీని ప్రపంచ నీటి దినోత్సవంగా ప్రకటించింది. 1993 నుండి దీనిని ఏటా పాటిస్తున్నారు. 2030 నాటికి అందరికీ నీరు, పారిశుద్ధ్యం కల్పించాలనే సుస్థిర అభివృద్ధి లక్ష్యం 6 సాధనకు మద్దతు ఇవ్వడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరగనున్న ఈ సదస్సు, సుస్థిర నీటి నిర్వహణ పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ఒక ఉమ్మడి పారిశ్రామిక ప్రకటనతో ముగుస్తుందని ఆ ప్రకటన తెలిపింది.

# కాంగ్రెస్, రాహుల్‌గాంధీ బిజెపికి 'బిటీమ్'

'పిటిఐ' ఇంటర్వ్యూలో కేరళ సిఎం పినరయ్ విజయన్



**తిరువనంతపురం:** కేరళలో అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్‌పై ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బిజెపికి బిటీమ్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పిటిఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో విజయన్ ఈ ఆరోపణ చేశారు. కేరళ ముఖ్యమంత్రి మినహా దేశంలోని ఇతర ప్రతిపక్ష నాయకులను కేంద్ర ఏజెన్సీలు అరెస్టు చేశాయని లేదా విచారణకు పిలిచాయని రాహుల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా, కాంగ్రెస్ నాయకుడు, ఆయన పార్టీ బిజెపికి బిటీమ్‌గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది ఏదైనా చూసినా లేదా అనుభవించినా నేర్చుకోరని, వారు సాధారణ వ్యక్తులు కాదన్నారు. వారు ఒక అరుదైన దృగ్విషయమని, సాధారణంగా విషయాలను గ్రహించలేని వారికి అలా జరుగుతుందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఆ కోవకే చెందుతారన్నారు. రాహుల్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారని, అయితే కోర్టు ఆ ఆరోపణలన్నింటినీ తిరస్కరించి, ఆప్ నాయకుడికి క్లీన్ చిట్ ఇచ్చిందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ నాయకత్వానికి ఇది గట్టి దెబ్బ అని అన్నారు. అయినప్పటికీ, ఆయన అదే విషయాన్ని పునరావృతం చేయడం దయనీయమన్నారు. అందుకే వారు చూసిన, అనుభవించిన వాటి నుండి పాఠాలు నేర్చుకోరని తాను వ్యాఖ్యానించానని విజయన్ చెప్పారు. జాతీయ స్థాయి వ్యవహారాలను పరిశీలిస్తే మనకు కనిపించేది ఏమిటంటే, రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ వాస్తవానికి బిజెపికి బిటీమ్‌గా మారిపోయిందన్నారు. గతంలో కేరళలో కాంగ్రెస్-బిజెపి పొత్తు చాలాసార్లు కనిపించిందని, అయితే రాబోయే ఎన్నికల్లో పరిస్థితులు ఎలా మారుతాయో ఇంకా స్పష్టంగా తెలియలేదని ఆయన పేర్కొన్నారు. రెండు పార్టీలు ఎల్‌డిఎఫ్‌ను ఒకే విధంగా వ్యతిరేకిస్తున్నాయని, అవి చాలా బాగా కలిసిపోతున్నట్లు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి ఏమాత్రం వెనుకాడని వర్గంగా కాంగ్రెస్, యుటిఎఫ్ మారాయని విజయన్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌పై ఆయన బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని, మెజారిటీ, మైనారిటీ మతతత్వంలో నిమగ్నమైన వర్గాల మద్దతు కోరుతున్నారని ఆరోపించారు. సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ మతతత్వానికి వ్యతిరేకమని, మత కార్యకలాపాలలో నిమగ్నమైన ఏ వర్గం మద్దతును కోరదని ముఖ్యమంత్రి అన్నారు. 'ఎలాంటి మతతత్వాన్నైనా దూరంగా ఉంచగలగాలి. ఓట్లకు ప్రాధాన్యత ఇచ్చేవారు అలా చేయలేరు, ఇప్పుడు యుడిఎఫ్‌కు అదే జరిగింది. మతతత్వం ఏ రూపంలో ఉన్నా అది దేశానికి ప్రమాదకరం, దానితో యుడిఎఫ్ రాజీ పడటానికి సిద్ధమవుతోంది.దానిపై గట్టి వైఖరి తీసుకోగలగాలి. మేము తీసుకునే వైఖరిలోని ప్రత్యేకత అదే. మేము ఏ మతతత్వ శక్తితోనూ రాజీ పడము. మేము అన్ని రకాల మతతత్వానికి వ్యతిరేకం' అని ఆయన అన్నారు. శబరిమల బంగారం నష్టం విషయంపై విజయన్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ చేస్తున్న వ్యతిరేక వాదనలను పక్కనపెట్టి, ఈ కేసు దర్యాప్తును కేరళ హైకోర్టు పర్యవేక్షిస్తోందని, విచారణలో ఎలాంటి తప్పునూ హైకోర్టు కనుగొనలేదని అన్నారు. ఈ విషయంలో ప్రమేయం ఉన్న ఎవరినీ వదిలిపెట్టబోమనేది ప్రభుత్వ వైఖరిలో స్పష్టంగా ఉందని, అందువల్ల ఈ అంశంపై సిపిఐ(ఎం)పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు ఏప్రిల్ 9న జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపవని ఆయన అన్నారు. ప్రభుత్వంపై దాడి చేయడానికి యుడిఎఫ్‌కు వేరే వాస్తవ ఆధారాలు లేనందున, కేవలం దాని ద్వారా ఓటర్లను ప్రభావితం చేయగలరేమోనని చూసేందుకే ఈ విషయాన్ని పదేపదే లేవనెత్తుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగే శాసనసభ సమావేశాలు ప్రభుత్వంపై, దాని మంత్రులపై దాడి చేయడానికి యుడిఎఫ్‌కు మంచి అవకాశమని, కానీ ఆ అవకాశం చేజారడంతో, అది పలు రోజుల పాటు సభా కార్యకలాపాలను బహిష్కరించిందని ముఖ్యమంత్రి అన్నారు. జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ పాలనలో నాజీ పార్టీకి ప్రచారకర్తగా పనిచేసిన జోసెఫ్ గోబెల్స్‌ను మించి ప్రతిపక్షాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని కూడా ఆయన ఆరోపించారు. వయనాడ్ పునరావాసానికి ఆర్థిక సహాయం సహా పలు అంశాలపై కేరళ పట్ల కేంద్రం శత్రు వైఖరి అవలంబిస్తోందని ఆరోపిస్తూ విజయన్ కేంద్రంపై కూడా కేంద్రంలోని బిజెపి సర్కార్‌పై కూడా గుప్పించారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంతో సహాయం చేసిందన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ వ్యాఖ్యలను ఆయన అసంబద్ధమని కొట్టిపారేశారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి పెంచేందుకు, కేరళలోని ఉన్నత విద్యా రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని కూడా ఆయన ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

## పంజాబ్‌లో అధికారి ఆత్మహత్య..
# మంత్రి రాజీనామా



**చండీగఢ్ :** పంజాబ్‌లో ఓ మంత్రి రాజీనామా చేశారు. అమృత్‌సర్‌లోని రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ అధికారి ఆత్మహత్యకు మంత్రి ప్రేరేపించారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ రాజీనామా కోరడంతో పంజాబ్ క్యాబినెట్ మంత్రి లాల్‌జిత్ సింగ్ భుల్లర్ శనివారం రాష్ట్ర క్యాబినెట్‌కు రాజీనామా చేశారు. టర్న్ తరణ్‌లోని పట్టి నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన భుల్లర్, ఈ ఆరోపణలు నిరాధారమైనవని తోసిపుచ్చారు. ఈ విషయంపై విచారణ జరపాలని తాను ప్రధాన కార్యదర్శిని ఆదేశించినట్లు మాన్ తెలిపారు. నిష్పక్షపాత విచారణ కోసమే మంత్రిని రాజీనామా చేయమని కోరినట్లు ఆయన చెప్పారు. భుల్లర్ రాజీనామాపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, 'దీని వెనుక కారణాలు ఏమిటి? ఇది విచారణకు సంబంధించిన విషయం. విచారణ జరపక ముందే, దానిపై ఎవరూ ప్రభావం చూపకుండా లేదా ఎలాంటి ఒత్తిడి తీసుకురాకుండా ఉండేందుకు మా క్యాబినెట్ మంత్రి రాజీనామా తీసుకున్నారు' అని మాన్ అన్నారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, భుల్లర్ చేపట్టిన రవాణా, జైళ్ల శాఖలను మరో మంత్రికి కేటాయిస్తామని మాన్ తెలిపారు. శనివారం, సోషల్ మీడియాలో ఒక వీడియో వెలుగులోకి వచ్చింది. అందులో మృతుడైన మేనేజర్ గగన్‌దీప్ సింగ్ రంధావా, తాను ఏదో విషపదార్థం సేవించానని చెబుతూ, లాల్‌జిత్ సింగ్ భుల్లర్ తనను వేధించారని ఆరోపించారు. భుల్లర్ ఒక ఫేస్‌బుక్ పోస్ట్‌లో, తమ పార్టీ ఎల్లప్పుడూ సత్యం పక్షాన నిలుస్తుందని, అందుకే తనపై వచ్చిన ఆరోపణలపై సరైన విచారణ జరపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'ఈ విచారణ పూర్తయ్యే వరకు, మంత్రి పదవికి నా రాజీనామాను ఆమోదించాలని పార్టీని, మా ముఖ్యమంత్రిని నేను అభ్యర్థిస్తున్నాను. ఈ విషయంపై సరైన విచారణ జరిపేందుకు వీలుగా నా రాజీనామాను ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు పంపుతున్నాను' అని ఆయన అన్నారు. అంతకు ముందు, శిరోమణి అకాలీ దళ్ నాయకుడు విక్రమ్ సింగ్ మజీతియా, రంధావా సెల్ఫాస్ సేవించడం వల్ల మరణించారని ఆరోపించారు. మరణానికి ముందు రంధావా, భుల్లర్ పేరు చెప్పారని, రూ.10 లక్షల లంచం తీసుకున్నట్లు ఒప్పుకోవాలని తనపై ఒత్తిడి తెచ్చారని కూడా మజీతియా ఆరోపించారు. భుల్లర్ సహాయకుడికి టెండర్ ఇవ్వాలని రంధావాపై ఒత్తిడి తెచ్చారని, అయితే ఆయన దానికి బదులుగా సరైన బిడ్డర్‌ను ఎంచుకున్నారని అకాలీ నాయకుడు ఆరోపించారు. రంధావాను భుల్లర్ ఇంటికి పిలిపించి, ఆయనపై దాడి చేశారని, వీడియో తీసేందుకు ప్రయత్నాలు జరిగాయని ఎస్ఎడి నాయకుడు ఆరోపించారు. భుల్లర్‌పై వచ్చిన ఆరోపణలు తీవ్రమైనవని కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్ సింగ్ బాజ్వా అభివర్ణించారు. అమృత్‌సర్‌లోని వేర్‌హౌస్ కార్పొరేషన్ డిఎం గగన్‌దీప్ సింగ్ రంధావా ఆత్మహత్య చేసుకుని మరణించారు. మరణానికి ముందు, రూ. 10 లక్షల లంచం, టెండర్ల అవకతవకలు, దాడి, బెదిరింపులను అంగీకరించమని మంత్రిపై ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ ఆయన మంత్రి పేరును వెల్లడించారు. 'పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ కేసును సుమోటోగా స్వీకరించి, న్యాయం జరిగేలా చూడాలని నేను కోరుతున్నాను' అని ఆయన అన్నారు.

# యుఎన్ఐ న్యూస్ ఏజెన్సీ ఆఫీసు సీజ్



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ ఆఫీసు (యుఎన్ఐ కార్యాలయం)ను శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యుఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యుఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యుఎన్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యుఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యుఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యుఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యుఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది.1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యుఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

## 'సీజ్'పై ఐజెయు ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యుఎన్ఐ) కార్యాలయాన్ని బలవంతంగా సీజ్ చేసి స్వాధీనం చేసుకోవడంపై ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్య దేశంలో పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనని, ప్రజాస్వామ్యంలో నాలుగవ మూల స్తంభంగా భావించే మీడియాకు అవమానకరమని పేర్కొంది. మార్చి 20వ తేదీ సాయంత్రం న్యూఢిల్లీలోని రఫీ మార్గ్‌లో ఉన్న యుఎన్ఐ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశాల పేరుతో స్వాధీనం చేసుకున్న తీరు దిగ్భ్రాంతిని కలిగించిందని ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్ము శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు, ల్యాండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ అధికారులు వ్యవహరించిన తీరు దేశంలోని జర్నలిస్టులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. సిబ్బందికి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, వారి వ్యక్తిగత వస్తువులు తీసుకునే అవకాశం ఇవ్వకుండా కార్యాలయాన్ని సీజ్ చేసే చర్యను అమలు చేయడం బాధాకరమన్నారు. సాధారణ పరిపాలనా ప్రక్రియ మాదిరిగా కాకుండా, ఇది పోలీసు దాడి మాదిరిగా సాగిందని విమర్శించారు. ఈ చర్య సందర్భంగా మహిళా జర్నలిస్టులను తోసివేసినట్లు వచ్చిన సమాచారం, దృశ్యాలు తీవ్రంగా కలవరపరుస్తున్నాయని వారు పేర్కొన్నారు. పోలీసుల ప్రవర్తనపై సమగ్ర దర్యాప్తు జరిపి, జర్నలిస్టుల గౌరవం, భద్రతకు భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన విశ్వసనీయ వార్తా సంస్థలలో యుఎన్ఐ ఒకటని, దశాబ్దాలుగా ఢిల్లీలోని ఈ కార్యాలయం సజీవ వార్తా కేంద్రంగా పనిచేస్తోందని గుర్తు చేశారు. అర్ధరాత్రి సమయంలో కార్యాలయాన్ని మూసివేసి, వార్తా సేకరణ, ప్రసారాన్ని అడ్డుకోవడం మొత్తం జర్నలిస్టు లోకాన్ని భయపెట్టడమేనని వారు పేర్కొన్నారు.

# స్వతంత్ర అభ్యర్థిగా నటుడు సుధీర్ కరమనను బరిలో దింపిన ఎల్‌డిఎఫ్



**తిరువనంతపురం :** కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ నటుడు సుధీర్ కరమనతో పాటు మరో ముగ్గురిని తమ స్వతంత్ర అభ్యర్థులుగా ఎల్‌డిఎఫ్ శనివారం ప్రకటించింది. లెఫ్ట్ పార్టీ సహచరుడైన కరమన, ఎల్‌డిఎఫ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. కమ్యూనిస్ట్ మార్క్సిస్ట్ పార్టీ (సిఎంపి), యుడిఎఫ్ నాయకుడు సి.పి. జాన్, బిజెపి అభ్యర్థి కరమన జయన్‌లను ఎదుర్కోనున్నారు. ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికల కోసం సిపిఐ(ఎం)తో సహా ఎల్‌డిఎఫ్ మిత్రపక్షాలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. అయితే, తిరువనంతపురం నియోజకవర్గాన్ని మిత్రపక్షమైన జనధిపత్య కేరళ కాంగ్రెస్ (జెకెసి)కి కేటాయించడంతో, ఆ స్థానంపై నిర్ణయం పెండింగ్‌లో ఉంది. సాక్ష్యాలను తారుమారు చేసిన కేసులో జెకెసి నాయకుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆంటోనీ రాజును ఇక్కడి మేజిస్ట్రేట్ కోర్టు దోషిగా నిర్ధారించి, శిక్ష విధించడంతో ఆయన అనర్హుడిగా ప్రకటించబడ్డారు. జెకెసి ఆ నియోజకవర్గంలో మరో అభ్యర్థిని నిలబెట్టడంలో విఫలమవడంతో, ఎల్‌డిఎఫ్ ఆ నటుడిని బరిలోకి దింపింది. కాగా, కరమన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేయడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటానని అన్నారు. స్థానికుడిగా తనకు తిరువనంతపురంలోని ప్రతి మూలమూ తెలుసని, అలాగే ప్రజల మనోభావాలు, సమస్యలు కూడా తెలుసని ఆయన అన్నారు. ఎన్నికల కోసం అన్ని వర్గాల ప్రజల మద్దతును కూడా ఆయన కోరారు. 'సవాళ్ల విషయానికొస్తే, నేను బలమైన వామపక్ష కూటమితో ఉన్నాను. మేము కొనసాగింపు నినాదంతో ముందుకు వెళ్తాము, అది తప్పక జరుగుతుంది' అని ఆయన అన్నారు. ఎన్నికల బరిలోకి ఎక్కువ మంది నటులు రావడంపై ఆయన మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాజకీయాల్లో సినీ పరిశ్రమ నుంచి వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. 'నేను సినిమాను, రాజకీయాలను భిన్నంగా చూస్తాను. నేను ఉపాధ్యాయుడిని, సినీ నటుడిని. దీనిని నేను సామాజిక సేవలో భాగంగా చూస్తాను. సమాజం కోసం జీవించడం, పనిచేయడమే అంతిమ లక్ష్యం. ప్రజా జీవితంలోకి ప్రవేశించడానికి దీనిని ఒక అవకాశంగా నేను భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, కాసరగోడ్ నుంచి షానవాస్ పధూర్, వల్లికున్ను నుంచి సి.పి. ముస్తఫా, తానూర్ నుంచి మహమ్మద్ సమీర్‌లను కూడా ఎల్‌డిఎఫ్ ప్రకటించింది. ఎల్‌డిఎఫ్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి వి. అబ్దురహిమాన్‌ను తానూర్ నుంచి తిరూర్‌కు బదిలీ చేయగా, ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సమీర్‌ను ఎంపిక చేశారు.

## నధుల అనుసంధానం పథకం కింద 2025-26లో
# తక్కువ నిధుల వినియోగం ఎందుకు ?

పార్లమెంటరీ ప్యానెల్ అసహనం

**న్యూఢిల్లీ:** నదుల అనుసంధానం పథకం కింద 202526 కాలంలో నిధుల వినియోగం తక్కువగా ఉండటంపై ఒక పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయ్యేలా అమలును వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. జలవనరులపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఒక నివేదికలో 1980లో రూపొందించిన జాతీయ దృక్పథ ప్రణాళిక (ఎన్‌పిపి) కింద నదుల అనుసంధాన బాధ్యతను జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యుడిఎ)కు అప్పగించినట్లు పేర్కొంది.ఈ ప్రణాళిక ప్రకారం మిగులు ప్రాంతాల నుంచి లోటు ప్రాంతాలకు బేసిన్ల మధ్య నీటి బదిలీని సులభతరం చేయడానికి, కరువు పీడిత, వర్షాధార ప్రాంతాలలో నీటి లభ్యతను మెరుగుపర్చడానికి ద్వీపకల్పభాగంలో 16, హిమాలయ భాగంలో 14చొప్పున 30 అనుసంధాన ప్రాజెక్టులను గుర్తించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో నిధుల వినియోగం తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. బడ్జెట్ ఎస్టిమేట్స్ (బిఇ) దశలో నిధుల కేటాయింపు రూ.2,4 00కోట్లు ఉండగా, రివైజ్డ్ ఎస్టిమేట్స్ (ఆర్ఇ) దశలో రూ.1,808.29 కోట్లకు సవరించారు. వ్యయం రూ.453.16 కోట్లుగా ఉంది.

**CHANGE OF NAME**

I, **YENDA GOVIND RAO S/o YENDA CHANDER RAO,** H.No. 7-76/1, Plot No. 302, Subash Nagar, Quthbullapur Mandal, Rangareddy Dist, Telangana State - 500055, My daughter name was wrongly occurred in Aadhaar Card as **YENDA SHANVIKA** (Old Name), Age: 03 Years, Shall henceforth be known as **YENDA SHANVIKA IRA** (New Name) for all purposes.

**LOST PASSPORT**

I, **BINGI TIRUPATHI S/o BINGI RAJA NARSAIAH**, R/o. H.No. 8-87, Polasa Village, Jagtial Rural Mandal, Jagtial Dist., Telangana State - 505327. lost my original **Passport No. N7972975** while I was travelling from Jagtial to Polasa Village by Motor cycle. If anybody found please return the same to me. **Contact No. 7396713002.**




## వృక్షాల శిల్పి!







శిల్పులు శిలలను అద్భుత శిల్పాలుగా చెక్కుతారు. ఎక్సెల్ ఎర్లాండ్సన్ అనే అమెరికన్ రైతు కూడా గొప్ప శిల్పే. అయితే, అతను శిలలను కాకుండా చెట్లను చెక్కుతాడు. వివిధ ఆకృతులతో కనువిందు చేసే చెట్లను చూస్తే, అతని పట్టుదల, దీక్ష, ఆసక్తి స్పష్టమవుతాయి. చెట్ల పెరుగుదలను నియంత్రిస్తూ వాటిని కళాత్మక రూపాల్లోకి మలచిన శిల్పిగా గుర్తింపు పొందిన ఎక్సెల్ కాలిఫోర్నియాలో ఒక ఉద్యానవనాన్ని స్థాపించాడు. అక్కడ చెట్లను సహజంగా పెంచడమే కాకుండా, వాటిని వంకరలుగా, పలకలుగా, తెరలుగా, వృత్తాలుగా మలిచే ప్రయోగాలు చేశాడు. ఈ ప్రక్రియలో ఆయన ప్రధానంగా ప్రూనింగ్ (కొమ్మలను కత్తిరించడం), గ్రాఫ్టింగ్ (రెండు మొక్కలను కలిపి పెంచడం) వంటి ఉద్యాన పద్ధతులను వినియోగించాడు. ఈ పద్ధతులు శాస్త్రీయంగా తెలిసినవే అయినప్పటికీ, వాటిని కళాత్మకంగా ఉపయోగించడం ఆయన ప్రత్యేకత. ఆయన రూపొందించిన చెట్లలో ఒకటి 'బాస్కెట్ ట్రీ'గా ప్రసిద్ధి చెందింది, ఇది చెట్ల కొమ్మలను పరస్పరం ముడివేసి బుట్టలా రూపొందించిన ఆకృతి. ఈ ఉద్యానవనం తరువాత సందర్శకులను ఆకర్షించే ప్రదేశంగా మారి 'ది ట్రీ సర్కస్' అనే పేరుతో ప్రాచుర్యం పొందింది. 1963లో ఎర్లాండ్సన్ ఈ ప్రదేశాన్ని ల్యారీ, పెగ్గీ థాంసన్‌కు విక్రయించారు. తరువాత ఇది పలువురు యజమానుల చేతులు మారుతూ, చివరకు మిచెల్ బోన్‌ఫాంటే దీనిని తన నర్సరీలోకి తరలించాడు. 'బోన్‌ఫాంటే గార్డెన్స్'గా అభివృద్ధి చేశాడు. ప్రస్తుతం ఈ ప్రదేశం 'గిల్‌రాయ్ గార్డెన్స్'గా ప్రసిద్ధి చెందింది. ప్రకృతి, మానవ సృజనాత్మకత కలిసినప్పుడు ఎలా అసాధారణ రూపాలు సృష్టించవచ్చో ఇక్కడి చెట్లు నిరూపిస్తాయి. చెట్లు సహజంగా పెరిగేవే అయినప్పటికీ, వాటి ఎదుగుదలను శాస్త్రీయ పద్ధతులతో మార్గనిర్దేశం చేస్తే కళాత్మక రూపాల్లోకి మారవచ్చని ఎర్లాండ్సన్ నిరూపించాడు.

## ఆకట్టుకునే మంచు గుహలు..



రాతి గుహలు, మంచు కొండలు గురించి చాలా మందికి పరిచయం ఉంటుంది. కానీ మంచుగుహలు అనే ప్రకృతి అద్భుతం గురించి వినడం మాత్రం కొంత అరుదు. భూమిపై ఎన్నో మంచుగుహలు ఉన్నప్పటికీ, వాటిలో చాలా కొద్ది మాత్రమే మనుషులకు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ప్రసిద్ధి చెందినది ఈస్రిసెన్‌వెల్ట్. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మంచుగుహల సముదాయం. ఈ గుహలు ఆస్ట్రియాలోని, సాల్జ్‌బర్గ్ సమీపంలో ఉన్న టెన్నెన్‌గెబిర్గే పర్వత శ్రేణుల్లో, సుమారు 40 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి. ఇవి ప్రకృతి సృష్టించిన అద్భుత కళాఖండంలా కనిపిస్తాయి. అయితే భద్రతా కారణాల వల్ల మొత్తం గుహను పర్యాటకులకు అనుమతించరు. కేవలం కొంత భాగాన్ని మాత్రమే సందర్శించేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఆ చిన్న భాగమే చూసినా, మంచుతో ఏర్పడిన శిల్పాలు, స్ఫటికంలా మెరుస్తున్న గోడలు, గడ్డకట్టిన ప్రవాహాల ఆకృతులతో పర్యాటకులను ఆకట్టుకుంటాయి. వారిని ఒక కలల లోకంలోకి తీసుకెళ్తాయి. ఈ గుహల్లో ఏర్పడే మంచు నిర్మాణాలు సంవత్సరాల పాటు నిలిచి ఉంటాయి. వెలుతురు పడినప్పుడు అవి వెండి మెరుపులా కాంతులు విరజిమ్ముతాయి. అందుకే ఇక్కడికి వెళ్లిన పర్యాటకులు, ఇది ఒక సహజ శిల్పాల గ్యాలరీ అని వర్ణిస్తారు. ప్రకృతి తన సృజనాత్మకతను చూపించడానికి మానవ కళాకారుడి అవసరం లేదని ఇవి నిరూపిస్తాయి. సరదాగా మనం కూడా, కనీసం ఊహలోనైనా ఈ మంచుగుహల్లోకి అడుగుపెడితే, చల్లని గాలితో పాటు ప్రకృతి అందాల్ని ఆస్వాదించే అనుభూతి కలుగుతుంది. ఇది కేవలం ఒక పర్యాటక ప్రదేశం కాదు. ప్రకృతి మహిమను మనకు గుర్తుచేసే ఒక విశేష ప్రపంచం.


## దృష్టి భ్రమ.. ఎండమావి



ఎండమావి (మిరాజ్) అనే పదం ఒక సాధారణ ప్రకృతి ఘటనను సూచించినప్పటికీ, దాని అర్థం శాస్త్రం, సాహిత్యం, జీవన అనుభవం అనే మూడు స్థాయిల్లో విస్తరించింది. సాధారణంగా ఎండమావి అంటే దూరంలో నీరు ఉన్నట్టుగా కనిపించే దృశ్యం. కానీ అది వాస్తవంలో ఉండదు. ఇది ఒక దృష్టి భ్రమ మాత్రమే. శాస్త్రీయంగా చూస్తే, ఇది కాంతి వక్రీభవనంతో ఏర్పడే పరిణామం. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు భూమి ఉపరితలం చాలా వేడిగా మారుతుంది. దాని పైన ఉన్న గాలి పొరలు కూడా వేడి కారణంగా సాంద్రతలో మార్పు పొందుతాయి. ఈ పరిస్థితిలో కాంతి కిరణాలు సూటిగా ప్రయాణించకుండా వక్రీభవిస్తాయి. ఫలితంగా, ఆకాశం లేదా చుట్టుపక్కల ఉన్న వస్తువుల ప్రతిబింబం నేలపై నీరు ఉన్నట్టుగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఎడారులు, పొడిబారిన రహదారులపై ఇది స్పష్టంగా గమనించవచ్చు. ఎండమావి కేవలం శాస్త్రీయ అంశం మాత్రమే కాదు. తెలుగు సాహిత్యంలో ఇది ఒక శక్తివంతమైన రూపకం. సాధ్యంకాని ఆశలు, మాయమాటలు, నెరవేరని కలలు వంటి ఎన్నో విషయాలను వ్యక్తీకరించడానికి ఈ పదాన్ని ఉపయోగిస్తారు. దూరం నుంచి ఆకర్షణీయంగా కనిపించినా, దగ్గరికి వెళ్లినప్పుడు మాయమైపోయే భావాన్ని ఇది సూచిస్తుంది. అందుకే ప్రేమ, మోసం, నిరాశ వంటి భావోద్వేగాలకు కూడా ఇది చిహ్నంగా నిలుస్తుంది. గ్రామీణ జీవనంలో, ముఖ్యంగా ఎడారులలో ప్రయాణించే వారికి ఎండమావి ఒక ప్రమాదకర భ్రమ. నీరు ఉందని నమ్మి ముందుకు సాగితే, అది కేవలం మోసపూరిత దృశ్యమే అని తెలుసుకునే సమయానికి శక్తి వృథా అవుతుంది. ఇదే భావం మన జీవితానికి వర్తిస్తుంది. మొత్తానికి, ఎండమావి ఒక ప్రకృతి శాస్త్రీయ అద్భుతంగానేగాక, మనిషి ఆలోచనల్లో, భావోద్వేగాల్లో, జీవన అనుభవాల్లో ప్రతిబింబించే ఒక గాఢమైన ప్రతీకగా కూడా చూడాలి.

— బిఎస్ఎస్ మైత్రేయి

# భగత్‌సింగ్ స్ఫూర్తి



దేశమాత దాస్య శృంఖలాలు తెంచేందుకు భగత్‌సింగ్ యువక ప్రాయంలోనే ప్రాణార్పణగావించిన రోజు (1931 మార్చి 23 ) 95 సంవత్సరాల అనంతరం కూడా యువతరానికి స్ఫూర్తిమంతంగా వర్ధిల్లుతున్నది. మరో ఐదేళ్లలో ఆ విప్లవయోధుని, ఆయన సహచరులు రాజ్‌గురు, సుఖదేవ్‌ల అమరత్వ శతవార్షికోత్సవం వస్తోంది. బ్రిటిష్ వలస పాలకుల నుంచి దేశవిముక్తికై ఆరోజుల్లో సరికొత్త ఆలోచనలతో ముందుకు వచ్చిన పట్టణ యువతలో భగత్‌సింగ్ అగ్రగణ్యుడు. ఆయన తన సహచరులతో కలిసి తొలుత హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మార్క్సిజం ప్రభావం కింద 'ఆర్మీ' పదం స్థానంలో 'అసోసియేషన్' చేర్చారు. తమ కేసు విచారణ కోర్టులో భగత్‌సింగ్ ఇలా చెప్పారు. 'విప్లవం మానవాళి అవిభాజ్యమైన హక్కు, స్వేచ్ఛ ప్రతి ఒక్కరి జన్మహక్కు. శ్రమజీవి సమాజ మనుగడకు మూలాధారం.. అటువంటి అద్భుత లక్ష్యాల కన్నా మిన్న అయిన త్యాగం మరొకటి లేదు...' విప్లవం అంటే తనకు బాంబు లేదా పిస్టల్ ఆరాధన కాదని వివరణ యిచ్చారు. 'విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారీతనాన్ని కూలదోసి, కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపించే విధంగా సమాజంలో మార్పు తీసుకురావటమే విప్లవం' అని అన్నారు. అప్పుడు అతని వయస్సు 23 సంవత్సరాలు. కోర్టు విధించిన ఉరిశిక్ష అమలుకోసం వేచిచూస్తూ, సమయం వృధా చేయకుండా మార్క్సిజం అధ్యయనంలో నిమగ్నమైనారు. ఒకే మార్గం, ఒకే సూత్రాలు అనుసరిస్తున్న భగత్‌సింగ్, ఆయన మిత్రులు తమపై కోర్టులో కేసు విచారణ జరుగుతున్న సమయంలో, జైల్లో తోటి రాజకీయ ఖైదీలు జీవిస్తున్న దుర్భర పరిస్థితుల మెరుగుదల కోరుతూ పోరాటాలు చేశారు. దేశం లోపల కూడా ఆశావాదం చాలా బలంగా ఉంది. బొంబాయి జౌళి కార్మికులు ఆరుమాసాల పాటు బ్రహ్మాండమైన సమ్మె కొనసాగించారు. కలకత్తా, కాన్పూర్‌ల్లోని కార్మికులు కూడా బొంబాయి కార్మికులతో చేరారు. 1926లో భగత్‌సింగ్, అతని మిత్రులు భారత్ నవజవాన్ సభ ఏర్పాటు చేశారు. అది త్వరలోనే బలమైన సంస్థగా ఆవిర్భవించింది. పంజాబ్‌లో యువతను అతివాద భావాల వైపు మరల్చటంలో అది ప్రధానమైన పాత్ర వహించింది. భగత్‌సింగ్ కొంత కాలం 'కీర్తి' పత్రిక సంపాదక విభాగంలో పనిచేశారు. అది సోహాన్ సింగ్ జోష్ ప్రచురించిన సోషలిస్టు పత్రిక. హెచ్ఎస్ఆర్ఎ త్వరలోనే పునర్నిర్మాణం చెందింది. స్వేచ్ఛాయుతమైన సోషలిస్టు రాజ్యంగా దేశాన్ని వియుక్తి చేయటం ప్రధాన ధ్యేయంగా అది ప్రకటించింది. స్వేచ్ఛ, సోషలిజం కోసం పోరాటం చేయటం ఎలా అన్నది ప్రధాన సమస్య. సోషలిజం ఆదర్శంగా ఉంది. ఈ లక్ష్యం కోసం ఆ సంస్థలో చేరినవారిలో చాలా మంది అటు తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వారిలో అజయ్‌ఘోష్ ఒకరు. అటు తర్వాత ఆయన సిపిఐ ప్రధాన కార్యదర్శి అయినారు.

దేశంలో నిరాశ తగ్గుతున్నది. ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. యువజన సంఘాలు ఏర్పడుతున్నాయి. కార్మికవర్గం పెద్ద ఎత్తున అసమ్మతి వ్యక్తీకరణ మొదలుపెట్టింది. కమ్యూనిస్టులు, ట్రేడ్‌యూనియన్ నాయకుల అరెస్టుకు త్వరలోనే అరెస్టు ఉత్తర్వులు జారీ అయినాయి. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి, యువజన సంఘం నాయకుడు పి.సి.జోషిని అరెస్టు చేశారు. పర్యవసానంగా విద్యార్థులు మూకుమ్మడిగా లేచారు. దేశమంతటా ప్రదర్శనలు తీశారు. కమ్యూనిస్టులతో తాము కలిసి పని చేయాలని, వారితో కార్యాచరణ ఐక్యత ఏర్పరుచుకోవచ్చునని భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్ గుర్తించిన సమయం రానే వచ్చింది. భేదాభిప్రాయాలున్నా సారూప్యతలను వారు గుర్తించారు. ఇరువురూ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్నారు.సోషలిజం దిశగా ప్రయాణించటం వారి అంతిమ లక్ష్యం. ఈ విషయంలో హెచ్ఎస్ఆర్ఎ, కమ్యూనిస్టుల అభిప్రాయం ఒక్కటే. కమ్యూనిస్టులను అరెస్టు చేయటం తమకు కూడా ముప్పు అని ఆ విప్లవ నాయకులు భావించారు. ప్రజలను అణచివేసే సామ్రాజ్యవాదుల విధానాన్ని మొత్తంగా వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేయాలని తీర్మానించారు. ప్రభుత్వం ఆమోదించిన వ్యాపార వివాదాల బిల్లును వ్యతిరేకిస్తూ కరపత్రాలు పంచారు. మొత్తం దేశం దృష్టిని ఆకర్షించేందుకు అసెంబ్లీలో బాంబు పేల్చాలని నిర్ణయించారు. ఎవర్నీ చంపటం వారి ఉద్దేశం కాదు, భగత్ సింగ్ రచించిన కరపత్రాన్ని సభ్యులందరికీ పంచాలనుకున్నారు. ఈ మొత్తం చర్యకు బటుకేశ్వర్ దత్ బాధ్యత తీసుకున్నారు. అయితే బాంబు పేలగానే అంతా గందరగోళం, అరుపులు, ఉరుకులు, పరుగులు, కరత్రాలు చెల్లా చెదురుగా పడ్డాయి. భగత్‌సింగ్ ప్రకటనతో కూడిన ఆ కరపత్రంలో వారు తను బాధ్యతను ఒప్పుకున్నారు. భగత్‌సింగ్, దత్‌లను అక్కడికక్కడే అరెస్టు చేశారు. 1929లో లాహోర్ కుట్ర కేసు ప్రారంభమైంది. విచారణను విప్లవం కోసం వినియోగించుకోవాలని భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్స్ నిర్ణయించుకున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. నూతన నాయకత్వం వృద్ధిలోకి రావటానికి తమ తరం ఆదర్శం నెలకొల్పుతున్నట్లు విప్లవకారులు విశ్వసించారు. సోషలిజం వారికి ఆదర్శం, దేశవిముక్తి తర్వాత సోషలిజం నిర్మాణానికి నడిపించే సూత్రంగా వారు భావించారు. భగత్‌సింగ్ విపరీతంగా పుస్తకాలు చదువుతారు. అందులో సోషలిస్టు సాహిత్యం ఎక్కువగా చదువుతారు. సోషలిజం దిశగా ఆ గ్రూపులో ఆకర్షితులయ్యే వారిలో బహుశా ఆయనే ప్రథముడు. జైలు బయట జరుగుతున్న ఘటనలన్నీ – షోలాపూర్ తిరుగుబాటు, పెషావర్ తిరుగుబాటు, చంద్రసింగ్ గర్వాలీ నాయకత్వంలో గర్వాలీ సైనిక పటాలం వీరోచిత ధిక్కారం వగైరా అన్నింటి గూర్చి తెలుసుకునేవారు. తమ పోరాటం పిస్టల్, బాంబులపై ఆధారపడిందికాదని, ప్రజల ప్రాథమికావసరాలు తీర్చే దిశగా అనగా సోషలిజం దిశగా సమాజ పరివర్తన తమ పోరాట లక్ష్యమని భగత్‌సింగ్ కోర్టుకు చెప్పారు. జైలులో వారి అధ్యయనం వారి దార్శనికతను విశాలమొనర్చింది. వారు ఎల్లప్పుడు సోవియట్ యూనియన్‌ను అభిమానించారు. 1930లో నవంబర్ విప్లవ (అక్టోబర్ విప్లవం) వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్ష లు పంపారు. సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ కరాచీ సెషన్ ప్రారంభంకానుండగా 1931 మార్చి 23న లాహోర్ జైల్లో భగత్‌సింగ్, ఆయన అనుచరులరు సుఖ్‌దేవ్ థాపర్, శివరాం రాజ్‌గురుల ఉరిశిక్ష అమలు జరిపారు. భగత్‌సింగ్‌కు అప్పటికి 24 సంవత్సరాలు పూర్తి కాలేదు. ఆ అమర జీవులకు జోహార్లు. యువతకు నేటికీ ఆయన జీవితం స్ఫూర్తిదాయకం. ●

(న్యూఏజ్ సంపాదకీయం)

# ఉన్నది అంతా బ్రాహ్మణవాదమే!



డాక్టర్ దేవరాజు మహారాజు

> ఆలోచన, ముఖ్యంగా సొంత ఆలోచన ఒక విప్లవాత్మకమైన గుణం. అంతేకాదు, తప్పనిసరిగా ఉండాల్సిన గుణం. నేను ఒక మానవుణ్ణి, మానవుడే కేంద్రంగా మానవత్వం కోసమే పనిచేస్తాను.
>
> –షాహిద్ భగత్ సింగ్.

ఒక దర్జీ చొక్కా కుట్టడానికి ఒక కొత్త కత్తెర తెచ్చుకున్నాడు. కొత్త గుడ్డను కావాల్సిన రీతిలో ముక్కలు కత్తిరించాడు. కత్తెరను కాళ్ల దగ్గర పెట్టుకుని, సూదితో గుడ్డ ముక్కల్ని కలిపి కుట్టడం ప్రారంభించాడు. టైలర్ కూతురు వచ్చి అడిగింది, నాన్నా కత్తెర కొత్తది కదా! దాన్ని అలా కాళ్ల దగ్గర పడేశావు, విలువలేని ఆ పాత సూదిని మాత్రం తలమీద తలపాగాకు కుచ్చుకున్నావు అని అడిగింది. దర్జీ లోలోన నవ్వుకున్నాడు. 'నిజమే నమ్మా, కత్తెర కొత్తదే కానీ అది గుడ్డను ముక్కలు చేసింది, ఆ గుడ్డ ముక్కలకు విలువలేదు, పాతదైనా సరే, ఖరీదైంది కాకపోయినా సరే సూది ఏం చేసింది? ఆ గుడ్డ ముక్కల్ని కలిపికుట్టి ఒక మంచి చొక్కా తయారు చేసింది. అప్పుడే కదా చొక్కాకు విలువ పెరిగేది? చొక్కా కుట్టక ముందు గుడ్డ ముక్కలకు విలువలేదు. వస్తువు కొత్తదా? పాతదా? అని కాదు– అది చేసే పనిని బట్టి మనం దాన్ని ఉపయోగించుకోవాలి. కత్తెర ఎక్కడ వేసినా ఉంటుంది, గుడ్డ ముక్కల్ని కలిపికుట్టే సూదిని ఎక్కడ బడితే అక్కడ పడేయలేం– దాని విలువ ఎక్కువ. అది సున్నితం, అపురూపం. జాగ్రత్తగా చూసుకోవాలి కదమ్మా– అందుకే దాన్ని నా తలమీద జాగ్రత్తగా తలపాగాకు గుచ్చుకుని భద్రపరుచుకుంటాను. "అయినా ఇది చెప్పు? పరపరమని కోసి విడదీసేది గొప్పదా? లేక విడిపోయిన గుడ్డముక్కల్ని కలిపి కుట్టేది గొప్పదా?" అని ప్రశ్నిస్తూ ప్రేమగా కూతురు కళ్లలోకి చూశాడు దర్జీ.'కలిపి కుట్టేదే నాన్నా' అంది కూతురు మెరిసే కళ్లతో. సమాజంలో కూడా కొందరు మనుషుల్ని విభజించి పైశాచికానందం పొందుతుంటారు. ఈ దేశ పౌరులమైన మనం చాలా చిన్నవాళ్లమే కావొచ్చు, అయినా కూడా మనుషుల మధ్య సౌహార్థాన్ని పెంపొందించి కలుపుకు పోవాల్సినవాళ్లం. అందరం సమైక్యంగా ఉంటేనే దేశం విలువ పెరిగేది' అన్నాడు తండ్రి. సూదిని తలపాగాకు గుచ్చుకుంటూ.


'మనం చిన్నవాళ్లమే, గుడ్డ ముక్కల్ని కలిపికుట్టే సూది చిన్నదే– అయితే మాత్రమేం? చేస్తున్నది గొప్ప పని కదా నాన్నా!'. 'అవునా తల్లీ బాగా చెప్పావ్! భారత్ జోడో అంటూ ఆసేతు హిమాచలం కాలినడకన వెళుతూ జనాన్ని కలుపుకుపోయేవారూ, న్యాయ యాత్ర పేరుతో అణగారిన వర్గాలకు న్యాయం కావాలని కోరుకునేవారు కావాలా? లేక మతం, గుళ్లు, విగ్రహాలు, ప్రాణప్రతిష్ఠ అంటూ పరిపాలనను గాలికి వదిలేసేవారు కావాలా?' 'ఓ నాన్నా! నాకు దేశరాజకీయాలన్నీ సులభంగా అర్థమవుతున్నాయి. రామాలయ నిర్మాణం పేరుతో అయోధ్యలో వేలవేల ఇండ్లూ, దుకాణాలు, పురాతన కట్టడాలు అన్నింటికి అన్నీ ధ్వంసం చేశారు. దౌర్జన్యంగా జనాన్ని నిరాశ్రయుల్ని చేశారు, వారిని ఆదుకోకుండా గాలికి వదిలేస్తే ఎలా? పాపం!' 'దేశ ప్రధాని తాను హిందూ దేశానికి రాజునయ్యాననీ, తనకిక తిరుగులేదనీ భావిస్తున్నాడు' 'ఆ.. ఆ.. జనం తలుచుకుంటే క్షణం పట్టదు– మట్టికరిపించడానికి! వివేకంలేని వారు అని అనుకుంటున్నాడేమో' అంది కూతురు సీరియస్‌గా. 'అయ్య బాబోయ్ ఏమో అనుకున్నా..నీకు చాలా విషయాలు తెలుసే తల్లీ' 'తెలుసు నాన్నా! పుస్తకాలు చదివి చాలా విషయాలు తెలుసుకుంటున్నా, హిందూ హిందూ అని చచ్చే ఈ కాషాయ మూకలు విషయాలు తెలుసుకోరు. 12వ శతాబ్దం దాకా దేశంలో మనవారికి 'హిందూ' అనే మాటే తెలియదట నాన్నా ఎక్కడో చదివాను. పర్షియా వాళ్లు మనదేశానికి సింధూ నది దాటి వచ్చారట. వారు సింధూ అని పలకలేక హిందూనది దాటి వచ్చాం అని చెప్పుకున్నారు. హిందూ నదికి ఆవల ఉన్నవాళ్లను హిందువులు అని అన్నారు. అప్పుడు అది మతానికి సంబంధించిన పదమేకాదు.' 'అవునమ్మా నిజమే..నాకు ఓ మాస్టారుగారు చెప్పారు. దేవుణ్ణి, మతాన్ని కలిపి రాజకీయం చేస్తున్నవారిని వదిలిపెట్టగూడదు. బుద్ధి చెప్పాల్సిందే. పౌరులుగా రాజ్యాంగబద్ధంగా మనం చేయాల్సింది మనం చేస్తూ ఉండాల్సిందే' 'కత్తెర్లు ముక్కలు చేస్తుంటే మనం కలిపి కుట్టుకుంటూ ఉండాల్సిందే, అంతే కదూ నాన్నా' అంటూ పెద్దగా నవ్వింది కూతురు. ఆమె నవ్వులో నవ్వుకలిపాడు తండ్రి.. సూదీ దారం పైకెత్తి ఆ తండ్రీ కూతుర్ల సంభాషణని అలా ఉండనిచ్చి, మనం మరో ముఖ్యమైన విషయంలోకి వెళదాం!.

సైన్సును నమ్మడం కూడా ఒక మతమే! హేతువాదం కూడా ఒక మతమే అని అనేవారున్నారు. అలాంటివారిని ఒప్పించాలని ప్రయత్నించడం కూడా వృథా! కాస్త ఇంగిత జ్ఞానం ఉన్నవాడికి ఇంకొన్ని విషయాలు అర్థం చేయించి ఆలోచించమని చెప్పొచ్చు. అసలు మొత్తానికి మొత్తంగా మెదడే మూసుకున్నవారిని ఏం చేయగలం? మానసిక వికలాంగులుగా పరిగణించాలి. కారణం ఏమంటే, హేతువాదానికీ, సైన్సుకు మతగ్రంథాలు లేవు. లేని ఆ పవిత్ర గ్రంథాల్లోంచి విషయాలు తీసి, ప్రవచించేవారూ లేరు. తమకు తామే ఏదో ఓ మతానికి పేటెంట్ హక్కులు సాధించినట్టు పిచ్చివాగుడు వాగే బాబాలు, స్వాములు, ప్రవచనకారులు, లేదా ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలకు పుట్టిన రాజకీయ నాయకులు ఎవరూ లేరు. మత బుల్డోజర్లు వేసుకుని తిరిగే యోగులు, బైరాగుల భరతం పట్టడమే సైన్స్ కార్యకర్తలు, హేతువాదులు, ప్రశ్నను బతికించుకుంటున్న రచయితలూ చేస్తుంటారు. మరి వీరిది కూడా ఓ మతమే– అని అనేవారికి బుద్ధీ జ్ఞానం లేదని అనుకోవాలి!. సృష్టి ఆదిలో భగవంతుడే వచ్చి హేతువాదులకు, శాస్త్రవేత్తలకు ఏవైనా గ్రంథాలు ఇచ్చి వెళ్లాడా? అంటే లేదు కదా? పూజలు, హారతులు, భజనలు, ప్రేయర్లు, నమాజులు, ఉపవాసాలు, ముడుపులు, మొక్కులు, ఏవంటే ఏవీ లేవు కదా?. ఊరికే అవీ మతాలే అని నోరు పారేసుకుంటే అయిపోయిందా? ఎలా మతాలయ్యాయో చెప్పాలి కదా?. హేతువాదులైనా, వైజ్ఞానికులైనా విశ్వాసంలోంచే ముందుకు పోతారు. ఆ విశ్వాసం రుజువులతో పెరిగే ఆత్మవిశ్వాసం! ఒక అవివేకి సంప్రదాయవాదిగా మనగలుగుతాడేమో గానీ వివేకవంతుడుగా మనలేడు. పైగా అతను వైజ్ఞానికుడో, హేతువాదో తప్పక అవుతాడు. జవాబులు బట్టీయం వేసి పరీక్షలో మార్కులు సంపాదించినవాడు జ్ఞానవంతుడు అవుతాడన్న నమ్మకం లేదు. విషయం అర్థం చేసుకుని, కొత్త ప్రశ్నలు లేవనెత్తేవాడే జ్ఞాని!. అందువల్ల పరిజ్ఞానం వేరు, వివేకం వేరు. ఏదో కొద్దిపాటి పరిజ్ఞానం సంపాదించి, దానితో మనుగడ సాగించేవాడికన్నా నిరంతర అధ్యయనంలో వివేచనతో కొత్తగా ఆలోచిస్తూ, కొత్తగా ప్రశ్నించేవాడే మనకు అవసరం. సమాజానికి అవసరం. ప్రపంచానికి అవసరం. ప్రపంచం 21వ శతాబ్దంలోకి వచ్చింది ఇలాంటి వారితోనే తెల్లవారుజామునే లేచి.. వేదాలు, ఉపనిషత్తులు, ఖురాన్, బైబిల్ వల్లెవేసిన వారితో సమాజం ఇక్కడి దాకా రాలేదు ఈ ఒక్క విషయం గమనిస్తే చాలు!. దేశ కాల పరిస్థితుల్ని గమనించి బాలీవుడ్ గీత రచయిత, హేతువాది జావేద్ అక్తర్ " ఏక్ హమారీ, ఔర్ ఏక్ ఉన్ కీ / ముల్క్ మే హై ఆవాజ్ దో (ఒకటి మాది మరొకటి వారిది/ దేశంలో గొంతులు రెండు) హం కహతే హై ఇన్సానో మె ఇన్సానో సె ప్యార్ రహే/ ఓ కహతే హై హాతో మె త్రిశూల్ రహే–తల్వార్ రహే (మేమంటాం మనుషుల్లో మనుషుల్లాంటి ప్రేముండాలని!/ వారంటారు చేతుల్లో త్రిశూలమో, ఖడ్గమో ఉండాలని!) హం కహతే హై బే ఘర్ బే దర్ లోగోంకో ఆబాద్ కరో/ ఓ కహతే హై భూలే బిస్రే మందిర్ మజ్జిద్, రామ్ సేతూ కో యాద్ కరో( మేమంటాం ఇల్లూ వాకిలీ లేని దీనుల్ని ఆదుకోండని/ వారంటారు మరిచిపోయిన మందిర్, మసీదు, రామసేతులను గుర్తుచేసుకోండని). కేవలం నాలుగు కవితా పంక్తుల్లో జావేద్ అక్తర్ దేశం ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉందో వివరించారు. ఇక మన సనాతన మనువాదులు చెప్పే విషయాలు ఎలా ఉంటాయో చూడండి.

'భూమి శేషనాగుపై ఉంది. శేషనాగు సముద్రంలో ఉన్నాడు. సముద్రం భూమిపై ఉంది". ఇలాంటి తలతిక్క రాతలు చదివితే మనకు ఏమనిపిస్తుందీ? 'ఎవడ్రా ఈ స్క్రిప్టు రాసింది? ఏం రాస్తున్నామన్నది చూసుకోపనిలేదా?' అని ఒళ్లు మండుతుందా మండదా? మతం మత్తు మందులాంటిదని అన్నది అందుకేనేమో, మత్తెక్కితే ఏముంది? ఒళ్లు తెలియకుండా ప్రవర్తిస్తారు కదా?. మహాభారతం గొప్ప కావ్యం కదా? అందులో జరిగింది ధర్మయుద్ధమా? కృష్ణుడు ఏం చేశాడో ఆలోచించండి! తన సైన్యాన్ని మొత్తం ధుర్యోధనుడికి ఇచ్చి, తను ఒంటరిగా అర్జునుడికి రథసారథి అయ్యాడు. అంటే ఏమిటీ? అర్జునుడితో తన సైన్యాన్ని తనే దగ్గరుండి చంపించాడన్నమాట! ఇలాంటి తలతిక్క నిర్ణయాలే తర్వాత తరాల మీద ప్రభావం చూపాయి. ఇలాంటి విషయాల్ని ఆదర్శంగా తీసుకోవడం వల్లే, దేశం బానిసత్వంలోకి పోయింది. మొఘలులు గత జన్మలో బ్రాహ్మణులని అబద్ధపు రాతలు రాసి ప్రచారం చేశారు కదా? అన్యాయంగా దేశ ప్రజల్ని విడదీయడం కోసం, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడం కోసం ఎన్ని తప్పుడు రాతలైనా రాస్తూపోయారు. ఈ దేశ ప్రజల్ని సంఘటిత పరుస్తూ, సమైక్యంగా ఉంచే మాటలు, రాతలు ఏ మత గ్రంథంలోనైనా ఉన్నాయా?. లేవన్నది గ్రహించాలి! మరి ఆ పని వేటివల్ల జరుగుతోంది? సైన్సువల్ల జరుగుతోంది. మానవ జాతి అంతా ఒకటే అని నిరూపించిన జన్యుశాస్త్రం వల్ల జరుగుతోంది. ప్రతిదాన్నీ తర్కబద్ధంగా ఆలోచించమని చెపుతున్న హేతువాదం వల్ల జరుగుతోంది. ఈ దేశ ప్రజలు పూజారులను కాకుండా, పరిపాలన మీద ధ్యాస పెట్టే విద్యావంతులైన దేశ నాయకుల్ని, నిజాయితీపరుల్ని ఎన్నుకుంటే బాగుపడుతారు.

– సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త, మెల్బోర్న్ నుంచి

# ముళ్లబాటలో బడ్జెట్ సాహసయాత్ర




ఆర్థిక మంత్రిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శాసనసభలో నాలుగవ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాబోయే ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2026–7 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3.24 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ బడ్జెట్‌కు ముందు కొన్ని ఊహాగానాలు వెల్లడయ్యాయి. ఆరు గ్యారెంటీలలో మెజారిటీ పూర్తి చేసినప్పటికీ, కొన్ని ఉప గ్యారెంటీలను అమలు చేయాల్సి ఉంది. వాటిలో ప్రధానంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలలో ప్రధానంగా ఆకట్టుకున్న మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వృద్ధులకు చేయూత పెన్షన్ రూ.4వేలకు పెంపు గ్యారెంటీలను ఈ బడ్జెట్‌లో పొందుపరుస్తారేమోని చాలా మంది ఎదురు చూసారు. ఆశించినవి నెరవేరనప్పటికీ, ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో పేద, మధ్యతరగతి అనే తేడా లేకుండా 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ బీమా' పథకాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ పథకం వచ్చిన కారణంగా రైతు బీమా పథకానికి నిధులు కేటాయించాల్సిన అవసరం రాలేదు.

అయితే ఆరు గ్యారెంటీల కింద ఉప గ్యారెంటీలను కలిపి 12 హామీలను కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించారు. వాటిల్లో 9 ఆచరణలోకి వచ్చాయి. విద్యార్థులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విద్యా భరోసా కార్డు, తెలంగాణ ఉద్యమ కారులకు ఇళ్ళ జాగాలు, మహిళలకు నెలకు రూ.2,500 అమలు కాలేదు. 57 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ చేయూత కింద పెన్షన్‌లు ఇస్తామని, అలాగే దానిని రెట్టింపు చేస్తామనే హామీ నెరవేరనప్పటికీ, కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్‌లు ఇస్తామనే పేర్కొనడం ఊరట. అయితే, బడ్జెట్‌లో గతంలో లాగే పెన్షన్‌లకు రూ.14,861 కోట్లే కేటాయించటం ద్వారా, ఇప్పటి వరకు మరణించిన లేదా అనర్హుల తొలగింపు ద్వారా ఏర్పడిన ఖాళీలలోనే కొత్త పెన్షన్‌లు వస్తున్నాయి. పెండింగ్ దరఖాస్తుల సంఖ్య లక్షల్లోనే ఉంది. మరో హామీ యువతకు ఉపాధి కోసం రుణాలిచ్చే 'రాజీవ్ యువ వికాసాని'కి గత బడ్జెట్‌లోనే రూ.6వేల కోట్లు కేటాయించినా, మంజూరు కాలేదు. ఈసారి అంతే మొత్తాన్ని ఆ పథకానికి కేటాయించారు. మరో పథకం వ్యవసాయ కార్మికులకు ఏటా రూ.12వేల ఆర్థిక సహాయం పథకాన్ని గతంలో ప్రకటించినా అమలు కాకపోగా, ఈ సారి నిధులూ కేటాయించబడలేదు. వేతన సవరణ హామీని పక్కన బెట్టినప్పటికీ ఉద్యోగులకు ఆరోగ్యభద్రతా పథకాన్ని, జీవిత బీమా పథకాన్ని ప్రకటించి ప్రభుత్వం వారిని కొంత శాంతపరిచింది. ఇక నిధుల విషయానికి వస్తే అత్యంత కఠిన పరిస్థితులు నెలకొన్నాయి. ఘనంగా అంకెలు ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో వాస్తవ రూపం దాల్చడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి పూర్తిస్థాయి బడ్జెట్ (2024–25)ను రూ.2.91 లక్షల కోట్లుతో ప్రతిపాదించగా, అది ఆ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే సరికి రూ.2.36 లక్షల కోట్లకు మాత్రమే పరిమితమైంది. అంటే అసలు కంటే సుమారు రూ.55 వేల కోట్లు తక్కువ. ఆ తరువాత రూ. 3.04 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను, రూ.2.81 లక్షల కోట్లకు సవరించబడింది. సుమారు రూ.24వేల కోట్లు తగ్గింది. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి మరింత తగ్గే అవకాశం ఉంది. తాజాగా రూ.3.24 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌కు, సవరించిన 2025–26 బడ్జెట్‌కు మధ్య సుమారు రూ.43వేల కోట్ల అంతరం ఉంది. మూడు బడ్జెట్‌లలో ఆ మేరకు కోత పడేది సంక్షేమ, అభివృద్ధి పథకాలపైనే. ఇదేమి కొత్తగా జరుగుతున్న వ్యవహారమేమి కాదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి సాగుతున్న తతంగమే. వృద్ధి రేటు 10 – 12 శాతం ఉంటున్నప్పుడు, బడ్జెట్‌లను మాత్రం వాస్తవ వృద్ధి రేటు కంటే రెట్టింపు శాతంతో పెంచి చూపిస్తున్నారు.



ప్రతిపాదిత బడ్జెట్ కంటే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి బడ్జెట్ పరిణామం తగ్గుతుండటానికి ప్రధాన కారణం రాష్ట్ర సొంత పన్ను వనరుల నుంచి అంచనా వేసిన రాబడి రాకపోవడమే. ఆచరణలో ఎలా ఉన్నప్పటికీ తమ వాగ్దానాలకు నిధులను వార్చి పెట్టడం, అలాగే బడ్జెట్‌ను పెంచి చూపడం ద్వారా అధిక రుణాలను సాధించవచ్చని పాలకులు ఆశించటమే ఇందుకు కారణం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన చిక్కేమిటంటే బిఆర్ఎస్ నుంచి రూ.8లక్షల కోట్లకు పైగా వారసత్వంగా వచ్చిన అప్పులు, కాంట్రాక్టర్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బిల్లుల చెల్లింపు తదితర బకాయిలతోనే అసలు సమస్య. బిఆర్ఎస్ ప్రభుత్వానికి తొలినాళ్ళలో రుణాలను వెంటనే తిరిగి చెల్లించాల్సిన అవసరం రాలేదు. ఫలితంగా, వరుసగా బడ్జెట్, బడ్జెటేతర అప్పులను పెద్ద ఎత్తున చేసుకుంటూ పోయింది. ఆ ప్రభుత్వ హయాంలోని ఆఖరు సంవత్సరాల నుంచే అప్పుల కిస్తీలు, వడ్డీలు పెద్ద ఎత్తున చెల్లించాల్సి రావడంతో పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోయాయి. నిజానికి బిఆర్ఎస్ పార్టీ మూడవసారి అధికారంలోకి వచ్చినా ఇంతకు మించి చేసేదేమీ లేదు. ఈనేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం వెసులుబాటు లేకపోవడంతో పాటు, ఎన్నికల హామీలు తరుముతున్నాయి. జాగ్రత్తగా వాటిని అమలు చేస్తూ ముందుకు సాగుతున్నప్పటికీ, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలను అమలు చేస్తామన్న వాగ్దానం ఫలితంగా ప్రజల నుంచి ఆశలు, ఆకాంక్షలు పెరిగాయి. ఆర్థిక వనరులు తరిగిపోయాయి. అయినప్పటికీ అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, ఆర్థికంగా గడ్డుకాలంలో తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ బండిని ముళ్లబాటలో సాహసయాత్ర సాగిస్తున్నారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలు ఉద్యోగులు సైబర్ నేరాల భారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గోపగాని గురువయ్య అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ సిపి రమేష్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ డిసిపి కోటిరెడ్డి ఆదేశాల మేరకు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లాల్‌గడి మలక్‌పేటలోని బ్లింకిట్ కంపెనీలో సుమారు 200 మంది ఉద్యోగులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ మోసాలు, మహిళల భద్రత పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడటం వలన కలిగే అనార్థాలు వారి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందనే అంశాలపై వివరించారు. డ్రగ్స్ భారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు వలన జరిగే ప్రమాదాలపై వీడియోల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్లింకిట్ కంపెని ప్రతినిధులు, పోలీసులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులు ప్రతిభను చాటుకోవాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** చిన్నారులు విద్యతో పాటు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవాలని కూచిపూడి డాన్స్ టీచర్ తులసిరెడ్డి అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లో భరత నాట్యం, కూచిపూడి నాట్యం నేర్చుకున్న చిన్నారులు గజపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డాన్స్ టీచర్ తులసిరెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయ నృత్యాల్లో బాగంగా చిన్నారులు కూచిపూడి, భరత నాట్యం తదితర నాట్యాలు భక్తి శ్రద్ధలతో నేర్చుకున్నారని చెప్పారు. ఇలాంటి రంగాల్లో రాణించడానికి గ్రామస్థులు అన్ని విధాలుగా సహకరించాలని సూచించారు. మొబైల్స్ ఫోన్‌లకు దూరంగా ఉండాలంటే చిన్నారులను ఆయా రంగాల వైపు ఆసక్తి పెంపొందించాలని చెప్పారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. చిన్నారుల తల్లిదండ్రులు తమ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదవారు ఎంతో సంతోషంగా ఉన్నారని నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.జిహెచ్‌ఎంసి పరిధిలోని నాగారం డివిజన్ సాయి నివాస్ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో ముప్పు శ్రీనివాస్‌రెడ్డి,గూడురు ఆంజనేయులుగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఇంటి లబ్ధిదారుడు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్,గణపురం కొండల్‌రెడ్డి, శేఖర్‌యాదవ్, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్‌కు పిలుపు



**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, పారిశుధ్య కార్మికుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీన ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని గాంధీనగర్‌లో ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మున్సిపల్ సంగం రాష్ట్ర కార్యదర్శి యేసురత్నం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా మున్సిపల్ సంగం అధ్యక్షులు హరినాథరావులు పాల్గొని, కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, కార్మికులంతా ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జగద్గిరిగుట్ట, గిరినగర్, సుచిత్ర ప్రాంతాల కార్మికులను కలిసి ధర్నాకు హాజరు కావాలని కోరారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి అన్నారు.యువతలో క్రీడా స్ఫూర్తి ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పన్నాల కొండల్ రెడ్డి తెలిపారు.ఘట్‌కేసర్ సర్కిల్ పరిధి మర్రిపల్లి గూడలో జరుగుతున్న ఎంపిఎల్ సీజన్ 6 క్రికెట్ క్రీడా పోటీలను శనివారం టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆస్తకి పెంచుకుని శారీరక మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమి చెందిన క్రీడాకారులు మరోసారి ప్రయత్నం చేసి విజయం సాధించేందుకు పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్కిల్ నాయకులు బొడిగే శ్రీనివాస్,గ్రామ శాఖ అధ్యక్షులు లక్ష్మ ణ్, ఆనంద్, కిషన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన ప్రార్థనలు

### కోత్వాల్ విసి సజ్జనర్ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/చార్మినార్/బహదూర్‌పురా/-గోషామహల్:** భక్తి శ్రద్ధలతో ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకున్నారు. క్యూర్ ప్రాంతంలోని వివిధ ప్రాంతాలలో శనివారం ముస్లింలు ఈద్గాలు, మసీదులు, దర్గాలకు పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరి కొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వేల సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, కార్వాన్, నాంపల్లి, యాకుత్‌పురా, మలక్‌పేట్, బార్కాస్, ఫలక్‌నుమా, గోషామహల్, అబిడ్స్, సుల్తాన్‌బజార్, జాంబాగ్, గాంధీభవన్, మంగళ్‌హాట్, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, కింగ్‌కోఠి తదితర ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదులకు ప్రార్థనల కోసం భారీగా తరలివచ్చారు.

### మీరాలం ఈద్గాలో ప్రార్థనలు

రంజాన్ సందర్భంగా మీరాలం ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల భద్రతా ఏర్పాట్లను కోత్వాల్ విసి సజ్జనర్ స్వయంగా పర్యవేక్షించారు. ప్రార్థనల అనంతరం ఆయన చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలందరూ సుఖసంతోశాలతో ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసమంతా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల షాపింగ్ అవసరాలకు, ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని, అందరి సహకారంతో వేడుకలు విజయవంతంగా సాగాయని వివరించారు. పండుగ ఏర్పాట్లలో సహకరించిన మత పెద్దలకు, ఇతర ప్రభుత్వ విభాగాలకు ధన్యవాదాలు తెలిపారు.



కార్యక్రమంలో సౌత్‌రేంజ్ అదనపు సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి(ట్రాఫిక్) డి.జోయల్ డెవిస్, జాయింట్ సిపి(నార్త్‌జోన్) ఎన్.స్వేత, డిసిపి(నార్త్‌రేంజ్‌సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్), డిసిపి సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఆర్.వెంకటేశ్వర్లు, డిసిపి(రాజేంద్రనగర్)ఎస్. శ్రీనివాస్, డిసిపి(ట్రాఫిక్) అవినాశ్ కుమార్, తదితర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

### సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా సనత్‌నగర్‌లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో ముస్లింలు నిర్వహించిన సామూహిక ప్రార్థనలలో ఎమ్మెల్యే తలసాని పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, బాలరాజ్, ఫాజిల్, ఖలీల్, జమీర్, గోపిలాల్ చౌహాన్, వనం శ్రీనివాస్, సమి ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ మెగా డ్రైవ్



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ మెగా డ్రైవ్ నిర్వహించారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు ఎమ్మెన్నార్ జ్యోతి, ఆంజనేయులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు లక్ష్మీ కాంత్, స్వాతి, సాహితీ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో హోటల్స్, ఫుడ్ స్టాల్స్, టిఫిన్ సెంటర్స్ కు సంబంధించిన యజమానులు పాల్గొని దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 62 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## నకిలీ యజమానితో రిజిస్ట్రేషన్, ఐదుగురు అరెస్టు



**ప్రజాపక్షం/చర్లపల్లి :** నకిలీ యజమానితో ప్లాటును రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సిఐ ఆర్కపల్లి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందన్‌పల్లి చాముండేశ్వరీ నగర్ టిపిఎస్ కాలనీలో మాదను మాధురి తండ్రి లేట్ మాదను ఇన్నయ్య 1988 సంవత్సరంలో ప్లాటు కొనుగోలు చేశారు. అనంతరం 2021 సంవత్సరంలో తన తండ్రి మృతి చెందాడు. ప్లాటు స్థలం ఖాళీగా ఉండటాన్ని గమనించిన భూకబ్జాదారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉప్పల వేణు, దొసపాటి వెంకట్‌రెడ్డి మృతుడి పేరును దుర్వినియోగం చేసి అదే పేరుతో ఉన్న మరో వ్యక్తి మాదను ఇన్నయ్యగా నకిలీ యజమానిగా చూపిస్తూ అతని కుమార్తె గుండిగ జ్యోతిని డబ్బు ఆశ చూపించి ఆ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కుట్రలో కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రసాద్ అనే డాక్యుమెంట్ రైటర్ సహాయంతో నకిలీ గిఫ్ట్‌డిడ్ చేయించి ఆస్థలాన్ని ఆధీనంలోకి తీసకుని విక్రయించేందుకు ప్రయత్నించారు. నిందితులు ఉప్పల వేణు, దొసపాటి వెంకట్‌రెడ్డి, నకిలీ వ్యక్తి మాదను ఇన్నయ్య, అతని కుమార్తె జ్యోతి,డాక్యుమెంట్ రైటర్ ప్రసాద్‌లను అరెస్టు చేసి కోర్టు తరలించారు. ఏ6 నిందితురాలు అయిన సబ్ రిజిస్ట్రార్‌పై దర్యాప్తు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పవిత్ర ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) వేడుకలు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. మసీదులు, ఈద్గాల వద్ద ఉదయం నుండే వేలాదిగా ముస్లింలు కొత్త దుస్తులు ధరించి భక్తి శ్రద్ధలతో సామూహిక ప్రార్థనలో పాల్గొని ముగియగానే బంధు మిత్రులు ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకొంటూ సంతోషాలను పంచుకొన్నారు. పలు ప్రాంతాల్లో మసీదులు కిటకిటలాడి పో యాయి. మహ్మద్ ప్రవక్త సూచించిన వాక్యాలను మత పెద్దలు చదివి వినిపించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు రంజాన్ శుభాకాంక్ష లు తెలిపారు. కేవలం ముస్లింలే కాకుండా కులమతాలకు అతీతంగా మతసామరస్యానికి ప్రతీకగా పరస్పరం కలుసుకొని ఆత్మీయ ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. షీర్ కుర్మాను ఒకరికొకరు తినిపించుకొంటూ నోళ్లను తీపి చేసుకొన్నారు. దేశంలో అతి ప్రాముఖ్యంమైన మౌలాలి ఖిలాపై ఉన్న దర్గాకు నగరం న లుమూలల నుండే కాకుండా పలు రాష్ట్రాల నుండి ము స్లింలు కుటుంబ సభ్యులతో కల్సి వచ్చారు. ఎక్కడా ఎలాంటి అంవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మసీదులు, ఈద్గాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. శామీర్‌పేటలో తెలంగాణా రాష్ట్ర హజ్ క టి సభ్యుడు ముజిబుద్దిన్, మేడ్చల్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మహ్మద్ ఫాపిఉద్దిన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఎస్టీ సెల్ చైర్మన్ బిలియా నాయక్, తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ చైర్మన్ జితేందర్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటి చైర్మన్ న ర్సింహయాదవ్, జిల్లా ఆర్‌టిఓ సభ్యుడు జైపాల్‌రెడ్డి, ఆ లియాబాద్ మున్సిపాలిటి అధ్యక్షుడు తుంకి రమేష్, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష కృష్ణారెడ్డి, దీపక్ జాన్ తదితరులు రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. హెచ్ బి కాలనీ డివిజన్‌లో,, డివిజన్‌లోని అన్నపూర్ణ కాలనీ లో రిజ్వాన్ ఆధ్వర్యంలో జరిగిన రంజాన్ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, గుండారపు శ్రీనివాసరెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులు దేవివరప్రసాదరావు, మల్లికార్జునరావు, సలీముద్దిన్, నరసింహగౌడ్, సంజయ్ నాయక్ తదితరులంతా ఆలింగనాలు చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

### వికారాబాద్‌లో



రంజాన్ ఈద్ ఉల్ ఫితర్ పర్వదినం సందర్భంగా అలంపల్ల షాహిదర్గా వద్ద స్పీకర్ ప్రసాద్‌కుమార్ , మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య ముస్లిం సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి సుఖశాంతులతో జీవించాలని కోరారు. ఈ పండుగ ముస్లిం సోదరులకు అనందందయకంగా జరుపుకోవలన్నారు. అనంతరం వికారాబాద్ పట్టణంలోని పలువురు ముస్లిం నాయకుల ఇంటికి వెళ్ళి రంజాన్ వేడుకలలో పాల్గోని కుటుంబ శుభాకాంక్షలు తెలిపారు.

**పరిగిలో :** ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ,స్థానిక నాయకులతో కలిసి ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి, ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సోదరభవం పెంపోందించాలని అందరూ శాంతి సఖాలతో జీవించాలని ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో ముస్లిం చైర్‌పర్సన్ రజిత, వైస్ చై ర్మన్ హనుమంతు, బ్లాక్ అధ్యక్షులు పార్థసారధిపంతులు , పట్టణ అధ్యక్షులు కృష్ణ , కౌన్సిలర్ అఖిలబాదం శ్రీనివాస్,రవికాంత్‌రెడ్డి , నర్సింలు జగన్ , రామకృష్ణరెడ్డి, షోయబ్, గొల్లమల్లేశం ,తదితరులు పాల్గోన్నారు.



### బొంపల్లిలో ఘనంగా...



**దోమ :** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని బొంపల్లిలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ముస్లిం సోదరులను కలిసి ఎమ్మెల్యే ఆలింగనంచేసుకుంటు ఈద్ ముబారాక్ తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సౌహర్ధత. సోదరభావం పెంపోందాలని, అందరు శాంతి సుఖాలతో జీవించాలని ,అందరు శాంతి సుఖాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనీయర్ నాయకులు రాకొండ అంతిరెడ్డి, సర్పంచు విజయ్‌పవన్‌యాదవ్ , మాజీ సర్పంచు సురేష్ ,మల్‌రెడ్డి ఇంతియాజ్ ఖాన్ , భాస్కర్,కృష్ణ, ముస్లిం సోదరులు తదితరులు పాల్గోన్నారు.

### వికారాబాద్ పట్టణంలో



ముస్లిం సోదర , సోదరీమణులకు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అనంద్, వికారాబాద్ పట్టణంలోని అలంపల్లి దర్గా వద్ద సాముహిక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను కలిసి ఆత్మీయ ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలను ముగించుకుని ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది గ్రామంలోని మండల మైనార్టీ విభగం అధ్యక్షులు గయాజ్ ఇంటికి వెల్లి అయన గ్రామంలో నూతనం గా గెలిచిన బిఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులను సన్మానించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

### శామీర్‌పేటలో....



మత సామరస్యాలకు ప్రతీకగా రంజాన్ పండగను జరుపుకోవాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం శామీర్‌పేటలో రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ముజుబుద్దిన్ నివాసంలో రంజాన్ పండగను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ముజుబుద్దిన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు షఫియుద్దిన్, డిసిసి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు నాయకులు తేనిటి విందును స్వీకరించారు. రంజాన్ పండగ సందర్భంగా ఒకరికోకరు ఆలింగనం చేసుకుంటు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజి ఎంఎల్ఏ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### దుండిగల్ సర్కిల్‌లో

దుండిగల్ సర్కిల్ గాగిల్లాపూర్, దుండిగల్ బహదూర్ పల్లి బోరంపేట్ ఇందిరమ్మ కాలనీ సాయిబాబా నగర్ అపురూప కాలనీ షాపూర్ నగర్ ముస్లిం



మైనార్టీ సోదరుల ఆహ్వానం మేరకు రంజాన్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావలి గణేష్, ఏఆర్ సాధు యాదవ్, గజేంద్ర నర్సింహారెడ్డి, బైబడి సంతోష్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### నాగారంలో.....



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పండుగను ముస్లీం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని జామియా మసీదులో రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ముస్లీం సోదరులకు నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,గూడురు ఆంజనేయులుగౌడ్‌లు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు జహంగీర్,అంజాద్,మహమూద్,జలాల్‌పాషా,జలీల్‌పాషా,గౌస్,మెహరాజ్,ముస్లీం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### చర్లపల్లిలో



శాంతి,సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.శనివారం రంజాన్ పండుగను పురస్కరించుకుని కాప్రా మసీదులో లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.రంజాన్ పండుగ సందర్భంగా ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మనుషుల మధ్య ప్రేమ,దయ పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్రమైనదని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్‌గౌడ్,బద్రుద్దీన్,మహేష్,శివకుమార్,రహీం,ముస్లీం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### పవిత్ర ఆరాధనలకు క్రమశిక్షణకు ప్రతీక రంజాన్

తాండూరులో ముస్లీం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ వేడుకలను పురష్కరించుకుని శనివారం తాండూరు పట్టణ శివారు శెనిగేష్‌పూర్ రోడ్డు మార్గంలోని ఇద్గా, హైదారాబాద్ రోడ్డు మార్గంలోని ఆఇలేహదీస్ ఇద్గాలకు ముస్లీం సోదరులు పెద్దఎత్తన్న పాల్గోని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లీ సోదరులతో కలసి ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డిలు ప్రార్థనలు చే శారు. పవిత్ర ఆరాధనలకు, క్రమ శిక్షణ దాతృత్వానికి ప్రతీక రంజాన్ అన్నారు. ఈ వేడుకలలో సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లో నర్సిములు,మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గోన్నారు.



## పేదలకు వరం సిఎం సహాయనిధి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అందె మోహన్ ఆధ్వర్యంలో 12వ వార్డు లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కొందుర్గు మండలానికి 25చెక్కులు, ఫరూఖ్‌నగర్ మండలానికి 74చెక్కులు, షాద్‌నగర్ మున్సిపాలిటికి 47చెక్కులు, జిల్లేడు చౌదరిగూడ మండలానికి 21చెక్కులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చినట్లు తెలిపారు. మొత్తం 167మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన రూ.65.84లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్, మండల పార్టీల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, సర్పంచులు చందునాయక్, అశోక్, బాబునాయక్‌తోపాటు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం : అంజయ్య



**ప్రజాపక్షం/యాచారం :** ఇబ్రహింపట్నం నుండి ఈనెల 23 కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పి.అంజయ్య కొరారు. శనివారం మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో గ్రామస్తులకు కరపత్రం అంద జేశారు. ఈసంధర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో బాల్ రాజ్, మాజీ సర్పంచ్ బాషయ్య, రమేశ్, పాండుచారి.ఉప సర్పంచ్ రాములు, గోపాల కృష్ణ ,నర్సింహ్మా పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1నుండి 12వ వరకు సబ్ జూనియర్ జాతీయ హాకీ టోర్నమెంట్




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఏప్రిల్ 1వ తేది నుండి 12వ తేది వరకు ఝార్ఖండ్ లోని రాంచీలో (బాలికల) సబ్ జూనియర్ జాతీయ హాకీ టోర్నమెంట్, అదే విధంగా బీహార్‌లోని రాజ్‌గిరిలో బాలుర సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు, తెలంగాణ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ తెలిపారు. టోర్నమెంట్ పురస్కరించుకొని శనివారం గచ్చిబౌలిలోని హాకీ గ్రౌండ్‌లో టోర్నమెంట్ లో పాల్గొననున్న తెలంగాణ బాలికల హాకీ జట్టుకు, 27వ తేది శుక్రవరం వరకు, బాలుర జట్టుకు 28వతేది శనివారం వరకు వారం రోజుల పాటు క్యాంపు నిర్వహిస్తున్నామని, ఈ క్యాంపు లో బాలుర జట్టు, బాలికల జట్టు తమ ప్రతిభను చక్కగా కనబరుచుకొని టోర్నమెంట్‌లో పతకాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ భీంసింగ్, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ కె. భాస్కర్ రెడ్డి, కోశాధికారి పాండురంగారెడ్డి, రాజశేఖర్, వేణుతో పాటు మహిళ కోచ్‌లు, బాలుర కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన బానోరి లింగంగౌడ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి, భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా సిపిఐ నాయకుడు బానోరి లింగం గౌడ్ నిర్వహించిన పోరాటాలు,సాధించి పెట్టిన విజయాలు మరువలేనివని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం, కాంగ్రెస్ నాయకుడు శివశంకర్‌గౌడ్ కొనియాడారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సిపిఐ నాయకుడు బానోరి లింగం గౌడ్ వర్ధంతి మొయినాబాద్ మండలంలోని తోలుకట్టలోని స్మారక స్థూపం వద్ద జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ లింగంగౌడ్ అనునిత్యం బడుగు, బలహీన వర్గాల కోసం పెతందార్లపైన పోరాటం చేసిన నాయకుడని కొనియాడారు. సిపిఐ సీనియర్ నాయకుడు చేవెళ్ల ఎం.సుధాకర్ గౌడ్, చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి సిపిఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లింగంగౌడ్ సతీమణి అనసూయ, కుమారులు రాజు, ఇంద్రసేనతో పాటు ఆయన మిత్రులు వెంకటయ్య మల్లేష్, శ్రీనివాస్,బుచ్చయ్య,శ్రీశైలం గౌడ్,సాకలి కిష్టయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచెయ్యి

**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చెయ్యి చూపిందని ఎస్‌ఎఫ్ఐ యచారం మండల కార్యదర్శి కంబాల పల్లి విప్లవ్‌కుమార్ అన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి చేసిన ప్రకటనలు వాస్తవానికి భిన్నంగా ఉన్నాయన్నారు. నాణ్యమైన విద్య అంతర్జాతీయ ప్రమాణాలు డిజిటల్ అభివృద్ధి అనే మాటలు పదేపదే వినిపించి క్షేత్ర స్థాయిలో విద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యలపై ఎలాంటి పరిష్కారం చూపలేదదని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.26,674 కోట్లు మాత్రమే కెటాయించడం దారుణమన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించని పక్షంలో అందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

# బీవేర్ ఆఫ్ సమోసా

అపరిశుభ్ర వాతావరణంలో తయారు

టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** సామాన్యుడి నుంచి ధనవంతుల వరకు సమోసా అంటే ఇష్టంతో ఆరగిస్తారు. తక్కువ ధరలకు లభించే సమోసాలు తింటూ ఇరానీ చాయ్ తాగాల్సిందే. అటువంటి సమోసాల తయారీ గురించి తెలుసుకుంటే ఒకింత ఆందోళన చెందక మానరు. కొందరు వ్యక్తులు అపరిశుభ్ర వాతావరణంలో సమోసాలను తయారు చేస్తూ వినియోగదారుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఈ వ్యవహారం టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో వెలుగులోకి వచ్చింది.

అక్రమ సమోసా తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపి రూ.5 లక్షల విలువైన అపరిశుభ్ర ఆహార నిల్వలు సీజ్ చేయడంతో పాటు ఒక నిందితుడిని అరెస్ట్ చేయడం జరిగింది. హైదరాబాద్ సిటీ పోలీస్ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన హెచ్‌ఫాస్ట్, కుల్సుంపురా పోలీసుల సమన్వయంతో జియాగూడలోని ఒక అక్రమ ఆహార తయారీ కేంద్రంపై మెరుపు దాడి చేసి, దానిని సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ నేతృత్వంలోని హెచ్‌ఫాస్ట్ బృందం, కుల్సుంపురా పోలీసులు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌తో కలిసి ఎస్‌బిఏ గార్డెన్ ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సదరు తయారీ కేంద్రం ఎటువంటి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడు అబ్దుల్ రషీద్ (73) అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో, కుళ్ళిపోయిన గుడ్లు, పదేపదే మరిగించిన నూనెను ఉపయోగిస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా సమోసాలను తయారు చేస్తున్నట్లు తేలింది. ఈ క్రమంలోనే పాడైపోయిన 500 కోడిగుడ్లు, పలుమార్లు వినియోగించిన 5 కిలోల వంట నూనె, తయారు చేసిన 350 ఎగ్ సమోసాలు, 600 స్వీట్ కార్న్ సమోసాలు, 1000 ఉల్లిపాయ సమోసాలు, ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకోవడం జరిగింది.







## నిషేద ఆజ్ఞలు ఉల్లంఘన

## హైకోర్టు పరిసరాల్లో బాణాసంచా వినియోగం



**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** నిషేద ఆజ్ఞల ఉల్లంఘన జరిగింది. అది కూడా ఏకంగా హైకోర్టు పరిసరాల్లోనే కావడం విశేషం. తెలంగాణ హైకోర్టు పరిసరాల్లో అమల్లో ఉన్న ధ్వని నిషేధ ఆదేశాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన బార్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలు వరుసగా వెలువడుతున్న నేపథ్యంలో, గెలుపొందిన అభ్యర్థులు తమ విజయోత్సవాలను జరుపుకుంటూ ధ్వని నిషేధాన్ని పట్టించుకోకుండా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకంగా హైకోర్టు గేట్ నెం:6 వద్ద మంగళ వాయిద్యాలను వినియోగిస్తూ బాణాసంచా కాలుస్తూ భారీ శబ్దాలతో సంబురాలు నిర్వహించడం ద్వారా, హైకోర్టు జారీ చేసిన నిబంధనలు, ధ్వని కాలుష్య నియంత్రణ చట్టాలను ఉల్లంఘిస్తున్నట్లు ప్రజలు మండిపడుతున్నారు. చట్టాలపై పూర్తి అవగాహన కలిగిన న్యాయవాదులే ఈ విధంగా నిబంధనలను అతిక్రమించడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సంబంధిత పోలీసు విభాగం, ముఖ్యంగా చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అధికారులు ఎందుకు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధ్వని కాలుష్య నియంత్రణ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ ఘటనపై తక్షణ విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, న్యాయవర్గాల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది.

## ఆధునిక వ్యవసాయ సాగు అవగాహన సద్వినియోగం చేసుకోండి

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజాపాలనలో భాగంగా 20, 21, 22 తేదీలలో సిద్ధిపేట జిల్లాలోని నగునూరు మండలం నరమెట్ట గ్రామంలో రైతు ఉత్సవాలను నిర్వహిస్తున్నారని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఈనెల 22 న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేయనున్నారని ఉష తెలిపారు. ఇందుకుగాను రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి మాడుగుల, అమంగల్, కేశంపేట, షాబాద్, షాద్ నగర్ మండలాల నుంచి రెండు వందల మంది రైతులను నాలుగు బస్సులలో నరమెట్ట గ్రామానికి తీసుకువెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఆదివారం మండలంలోని నిర్దేశిత ప్రదేశాలనుంచి రైతులను ఎక్కించుకుని బస్సులు బయదేరుతాయని, వీరికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. రైతులందరూ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ ఆమె కోరారు. అంతేకాకుండా అక్కడ దాదాపుగా నూటయాబై స్టాళ్లను ఏర్పాటు చేయటం జరిగిందని, ఈ స్టాళ్లలో ఆధునిక వ్యవసాయంలో ఉపయోగపడే యంత్ర పరికరాలు, సామాగ్రి, సాగు విధానాలు ప్రదర్శించబడుతున్నాయని, వీటిని సందర్శించి అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని డిఏఓ ఉష పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం మధ్యాన్నాం మూడు గంటలకు రాష్ట్రంలోని అన్ని రైతు వేదికలలో లైవ్ టెలికాస్ట్ చేస్తారని, సిద్ధిపేట రాలేని రైతులు, ప్రజాప్రతినిధులు దగ్గరలోని రైతు వేదికలో హాజరు అయ్యి ప్రారంభోత్స కార్యక్రమం తిలకించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినవలసినదిగా డిఏఓ కోరారు.

# అందరినీ సమానంగా గౌరవించేదే ఇస్లాం ధర్మం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు

ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు





**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** కుల మతాలకు అతీతంగా అందరిని సమానంగా గౌరవించేతే ఇస్లాం ధర్మం అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం రంజాన్ సర్వదినం సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాల వద్దకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, భీశ్వ కిష్టయలు వెళ్ళి ముస్లింకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, మాజీ ఎంపిపి ఇద్రీస్ వద్ద నిర్వహించిన విందులో పాల్గొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, జమృద్ ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, ముబారక్, నెహ్రూనాయక్, లింగారెడ్డిగూడ అశోక్, శేఖర్, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

### సర్వ మతాల సారాంశం ఒక్కటే

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

సర్వ మతాల సారాంశం ఒక్కటేనని, సర్వ ధర్మాలు జీవకోటి పరిరక్షణకు తోడ్పాటును అందిస్తాయని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో ఉన్న ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిల్లి శేఖర్, రఘునాథ్ యాదవ్, గౌస్‌జానీ, అడ్డు అజాజ్, సుధీర్, యాదగిరి, రవీందర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, శేఖర్ పంతులు, యారం శేఖర్, బిలాల్, దినేష్ సాగర్, శివచారి, అల్లాడ శేఖర్, అన్మారి రాజు తదితరులు పాల్గొన్నారు.

**కేశంపేట:** రంజాన్ పర్వదాన్ని పురస్కరించుకొని ప్రార్థన మందిరాల వద్ద ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేశంపేట మండల పరిధిలోని నిర్ధవెళ్ళి గ్రామంలో ముస్లింలు సామూహితంగా ప్రార్థన మందిరం వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, ఉప సర్పంచ్ సపూరా ఆమేర్, మైనార్టీ నాయకులు ఎండి మక్బూల్, జబ్బార్‌ఖాన్, ఖలిక్ మౌలిసాబ్, హఫిజ్‌ఖాన్, నసీరుద్దీన్, జహేద్, అజిజ్, ఇస్మాయిల్‌ఖాన్, ఆర్మాన్ పాషా జబ్బార్, ఖాజా, ఫైజన్, అజహర్, జాకీర్, సిరాజ్, షాబుద్దీన్‌తోపాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**యాచారం :** యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో అయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్, మాదాపూర్ డివిజన్, గచ్చిబౌలి డివిజన్, కొండాపూర్ డివిజన్‌లలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చందానగర్ డివిజన్ పరిధిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో చందానగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి పాల్గొని శాంతి, ఐక్యత, సోదరభావంతో రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్, రాఘవరావు, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

**మాదాపూర్ డివిజన్‌లో..**రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి మాదాపూర్ డివిజన్ పరిధీలోని పలు ఈద్గాలతో పాటు హాఫిట్ పేట్‌లోని ఈదల్ ఫితర్ ఈద్గా దర్గా, మాతృశ్రీనగర్‌లలో గల దర్గాలలో శేరిలింగంపల్లి బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఇ.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ పండగ శుభాకాంక్షలులు తెలిపారు. కార్యక్రమంలో దర్గా ముతవల్లి సుజ్జాద నషీన్ సుల్తాన్, బిఆర్‌ఎస్ మాదాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు , ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.






### ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం నిండాలి

ఎమ్మెల్యే కాలే యాదయ్య


**శంకర్‌పల్లి:** శంకర్‌పల్లిలోని మున్సిపాలిటీ ఈద్గా ల వద్ద శనివారం జరిగిన రంజాన్ వేడుకలలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సహనం, త్యాగం, సేవాభావానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్, ఎఎంసి డైరెక్టర్ ఎండి.సర్ తాజ్,ఎండి జాకీర్, నాయకులు శేరి అనంతరెడ్డి, జూలకంటి పాండురంగారెడ్డి, గుండ చంద్రశేఖర్, చంద్రమౌళి పాల్గొన్నారు.







# వింబుల్డన్‌లో నవశకం..



టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఒకటైన వింబుల్డన్‌లో నవశకం మొదలవ్వనుంది. యూఎస్ ఓపెన్, ఆస్ట్రేలియా ఓపెన్‌లో అమలులో ఉన్న వీడియో రివ్యూ వ్యవస్థ ఈ టోర్నమెంట్‌లోనూ రాబోతోంది. దాంతో, చైర్ అంపైర్ తప్పుడు నిర్ణయాలను క్రీడాకారులు సవాల్ చేసే అవకాశం లభించనుంది. ఈ ఏడాది నుంచి వింబుల్డన్‌లో వీఆర్ఎస్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ విషయాన్ని శనివారం ఆల్ ఇంగ్లాండ్ లాన్ టెన్నిస్ క్రొకెట్ క్లబ్ ధ్రువీకరించింది. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో కొత్తగా వీడియో రివ్యూ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. ఆటగాళ్ల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ కొత్త సిస్టమ్‌ను తీసుకొస్తున్నారు. ఇప్పటికే యూఎస్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజయవంతమైన ఈ వ్యవస్థను వింబుల్డన్‌లోనూ కనిపించనుంది. ఈ ఏడాది నుంచే ఆరు కోర్టుల్లో ఈ వ్యవస్థను పాటించనున్నారు. సెంటర్ కోర్ట్, నంబర్ 1 కోర్టుతో పాటు చుట్టుపక్కల ఉండే షో కోర్టుల్లో జరిగే మ్యాచ్‌లకు వీఆర్ఎస్ వర్తించనుంది. 'ఇకపై టెన్నిస్ ప్లేయర్లు చైర్ అంపైర్ తీసుకునే కొన్ని నిర్ణయాలను సవాల్ చేయవచ్చు. నాట్ అప్, ఫౌల్ షాట్, టచ్ వంటి వాటిని వారు సమీక్షించవచ్చు. ఇవే కాకుండా పాయింట్ ఎండ్ కాల్ ఇవ్వడం, ప్లేయర్ హఠాత్తుగా ఆడడం మానేసినా లేదా పాయింట్ పూర్తి కాగానే ఆట ఆపేసినా వీడియో రివ్యూ సిస్టమ్‌ను ఉపయోగించి న్యాయం పొందవచ్చు.

మ్యాచ్ సమయంలో ఎన్ని వీడియో రివ్యూలైనా తీసుకోవచ్చు. నిరుడు ప్రవేశపెట్టిన లైవ్ ఎలక్ట్రానిక్ లైన్ కాలింగ్ వ్యవస్థ తర్వాత వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా వీఆర్ఎస్ తీసుకురావాలని నిర్ణయించాం' అని ఇంగ్లాండ్ లాన్ టెన్నిస్ క్రొకెట్ క్లబ్ వెల్లడించింది. ఈ ఏడాది జూన్ 29 నుంచి జూలై 12వ తేదీ వరకు వింబుల్డన్ జరుగనుంది.

### కోల్‌కత్తాకు వరుసగా
## షాకిస్తున్న పేసర్లు



పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ ఆరంభానికి ముందే కోల్‌కత్తా నైట్ రైడర్స్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్లు ఒక్కొక్కరుగా గాయాల పాలవుతున్నారు. ఇప్పటికే హర్షిత్ రానా, మథీశ పథిరనలు టోర్నీకి దూరమవ్వగా.. ఆకాశ్ దీప్ సైతం గాయం కారణంగా మెగా టోర్నీ నుంచి వైదొలిగాడు. దాంతో.. కోల్‌కత్తా పేస్ దళం దాదాపుగా ఖాళీ అయింది. ఇప్పటికే రానా, పథిరన స్థానంలో ఎవరిని తీసుకోవాలి? అని మల్లగుల్లాలు పడుతున్న ఫ్రాంచైజీకి ఇప్పుడు ఆకాశ్‌కు ప్రత్యామ్నాయం వెతకడం పెద్ద తలనొప్పిగా మారింది. ఐపీఎల్ పండుగకు ముందే ఫ్రాంచైజీలను గాయాలు వెంటాడుతున్నాయి. ఫలితం గా పలు జట్లు ప్రధాన పేసర్ల సేవలను కోల్పోతున్నాయి. అన్నిటికంటే ఎక్కువగా కోల్‌కత్తా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీని ఆటగాళ్ల గాయాలు కలవరపరుస్తున్నాయి. గత మూడు సీజన్లలో పేస్ భారం మోస్తున్న హర్షిత్ రానా మోకాలి గాయంతో దూరమవ్వగా.. వేలంలో రూ.కోట్లు కొల్లగొట్టిన మథీశ పథిరన ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆకాశ్ దీప్ ఉన్నాడులే అనుకున్న యాజమాన్యానికి పెద్ద షాకే తగిలింది. ఈ మధ్య కాలంలో మైదానంలో కంటే రిహాబిలిటేషన్ సెంటర్లోనే ఎక్కువగా గడుపుతున్న ఆకాశ్ దీప్ ఐపీఎల్ ఆరంభానికి ముందే మరోసారి గాయపడ్డాడు. నిరుడు అబుధాబీలో జరిగిన మినీ వేలంలో రూ.1 కోటి పలికిన ఈ పేసర్ సైతం గాయంతో ఐపీఎల్ నుంచి నిష్క్రమించాడు. ఈ విషయాన్ని 'క్రిక్‌బజ్'తో కోల్‌కత్తా ఫ్రాంచైజీ అధికారి ఒకరు ధ్రువీకరించారు. 'దురదృష్టవశాత్తూ ఐపిఎల్ నుంచి ఆకాశ్ దీప్ వైదొలిగాడు' అని ఆయన చెప్పారు. దాంతో.. ఇప్పుడు కోల్‌కత్తా పేస్ దళంలో కొత్తగా వచ్చిన బ్లెస్సింగ్ ముజరబానీపై బౌలింగ్ భారం పడనుంది. 19వ సీజన్ తొలి పోరులో మార్చి 29న ముంబై ఇండియన్స్‌తో కోల్‌కత్తా తలపడనుంది.

### ఐపీఎల్ కోసం భారత్ చేరుకున్న
## ఫ్లయింగ్ మ్యాన్..



ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ కోసం విదేశీ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా భారత్ వస్తున్నారు. ఈమధ్యే పొట్టి ప్రపంచకప్‌లో ఇరగదీసిన గ్లెన్ ఫిలిప్స్ గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడేందుకు శనివారం ఇండియాలో దిగాడు. విమానాశ్రయంలో ఈ కివీస్ ఆల్‌రౌండర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఫ్లయింగ్ మ్యాన్‌గా పేరొందిన ఫిలిప్స్ రాకకు సంకేతంగా గుజరాత్ ప్రత్యేక వీడియో పంచుకుంది. మైదానంలో పక్షిని తలపిస్తూ.. బౌండరీ లైన్ వద్ద డైవింగ్ క్యాచ్‌లతో అలరించే గ్లెన్ ఫిలిప్స్ ఐపీఎల్ కోసం భారత్‌లో అడుగుపెట్టాడు. గుజరాత్ టైటాన్స్ తరఫున బరిలోకి దిగనున్న ఈ కివీస్ ఆటగాడు శనివారం అహ్మదాబాద్‌లో విమానం దిగి.. స్క్వాడ్‌తో కలిశాడు. ప్రపంచ క్రికెట్‌లో ఫ్లయింగ్ మ్యాన్‌గా పేరొందని అతడి రాకను పురస్కరించుకొని గుజరాత్ ఫ్రాంచైజీ ఎక్స్‌లో ప్రత్యేకమైన పోస్ట్ పెట్టింది. సర్వర్ చేతు ల్లోంచి జారిపోతున్న టీ కప్పు.. గోడ మీద నుంచి కింద పడుతున్న గాజు గ్లాసు, ఓ వ్యక్తి చేతుల్లోంచి జారిపోతున్న ఫోన్‌తో వీడియో మొదలవుతుంది. టీ కప్పు, గాజు గ్లాస్, ఫోన్ కిందపడకుండా.. ఫిలిప్స్ ఒడుపుగా అందుకుంటాడు. ఈ స్పెషల్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరలవుతోంది. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన ఫిలిప్స్ పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ తొలి పోరులో మార్చి 31న పంజాబ్ కింగ్స్‌ను ఢీ కొట్టనుంది.




## పోర్ట్‌ఫోలియోల సర్దుబాటు..

ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున (మార్చి 31), మార్కెట్లలో ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. ఈ కాలంలో సాధారణంగా సంస్థాగత పెట్టుబడిదారులు తమ పోర్ట్‌ఫోలియోలను సర్దుబాటు చేసుకుంటారు. లాభనష్టాలను బేరీజు వేసుకుంటా రు. దీనివల్ల మార్కెట్‌లో అసాధారణ చలనం ఉండొచ్చు, కానీ అది తప్పనిసరిగా దీర్ఘకాల దిశను సూచించదు. వచ్చే వారం మార్కెట్‌పై అంచనా వేయాలంటే, మూడు కీలక అంశాలు పరిశీలించాలి. మొదట, గ్లోబల్ పరిణామాలు. ఇరాన్ యుద్ధం మరింత విస్తరించుతుందా లేదా నియంత్రణలోకి వస్తుందా? అన్నది ప్రధానంగా ప్రభావితం చేస్తుంది. రెండవది, చమురు ధరల దిశ. బ్రెంట్ క్రూడ్ మళ్లీ 110–120 డాలర్ల స్థాయికి చేరితే, భారత మార్కెట్లు ఒత్తిడికి గురవుతాయి. ఒకవేళ, 90–100 డాలర్ల మధ్య స్థిరపడితే, మార్కెట్‌కు మద్దతు లభిస్తుంది. మూడవది, దేశీయ పోర్టిఫోలియోల కొనుగోళ్లు కొనసాగితే, మార్కెట్ పడిపోవడం పరిమితమవుతుంది. ఈ ఆధారంగా చూస్తే, వచ్చే వారం మార్కెట్ పూర్తిగా కూలిపోవడం కంటే, ఒక పరిమిత పరిధిలో ముందుకు కదిలే అవకాశం ఎక్కువ. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు స్వల్ప లాభనష్టాలతో ఊగిసలాటలో ఉండవచ్చు. అయితే నెలాఖరు కారణంగా కొన్ని రోజుల పాటు అకస్మాత్తుగా పెరుగుదల లేదా పతనం కనిపించే అవకాశం ఉంది. దీనిని 'విండో డ్రెస్సింగ్' లేదా 'పోర్ట్‌ఫోలియో బాలెన్సింగ్' ప్రభావంగా చూడాలే తప్ప దీర్ఘకాల ట్రెండ్‌గా కాదు.



మొత్తానికి, భారత మార్కెట్లు ప్రస్తుతం గ్లోబల్ ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని చూపుతున్నాయి, కానీ ఇది పూర్తిస్థాయి భద్రత కాదు. పరిస్థితులు వేగంగా మారే అవకాశాన్ని ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలి.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 74,582.96 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 74,532.92 పాయింట్లు. నష్టం 30.96 పాయింట్లు).

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 23,114.50 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 23,151.10 పాయింట్లు. నష్టం 36.60 పాయింట్లు).

# కోలుకున్న స్టాక్ మార్కెట్లు
## స్వల్ప నష్టంతో బయటపడిన వైనం



**ముంబయి :** గత వారం భారీగా నష్టపోయిన భారత స్టాక్ మార్కెట్లు ఈ వారం కోలుకున్నాయి. గత వారం సెన్సెక్స్ 4,354.98 పాయింట్లు, నిఫ్టీ 1,299.35 పాయింట్లు చొప్పున నష్టాలను చవిచూసిన విషయం తెలిసిందే. అయితే ఈవారం అంతటి నష్టాలను ఎదుర్కోకుండా, స్వల్ప పతనంతో బయటపడింది. గతవారం భారత మార్కెట్లు, ప్రపంచ వ్యాప్తం గా అనిశ్చితి, ముఖ్యంగా ఇరాన్ యుద్ధం, చమురు ధరల పెరుగుదల, గ్లోబల్ మార్కెట్లలో వచ్చిన కుదుపుల ప్రభావాన్ని ప్రతిబింబించాయి. అయి తే ఈవారం అదే మార్కెట్లు స్వల్ప నష్టంతో ముగియడం, భారత మార్కెట్లలో ఒక రకమైన స్థిరత్వాన్ని సూచిస్తుంది. ఇది యాదృచ్ఛికం కాదు. దీని వెనుక పలు నిర్మాణాత్మక కారణాలు ఉన్నాయి. మొదటగా, గత వారం జరిగిన భారీ పతనం ఇప్పటికే షాక్ అబ్జార్షన్ పాత్ర పోషించింది. అంటే, పెట్టుబడిదారులు గ్లోబల్ రిస్క్‌ను ముందుగానే ధరల్లో ప్రతిబింబించడంతో, ఈవారం కొత్తగా పెద్ద గా ప్రతికూల ప్రభావం చూపలేదు. రెండవది, భారత ఆర్థిక వ్యవస్థలో అంతర్గత డిమాండ్ బలంగా ఉండటం. అమెరికా, యూరప్ మార్కెట్లు బాహ్య పరిస్థితులపై ఎక్కువగా ఆధారపడితే, భారత్‌లో వినియోగం, బ్యాం కింగ్, సేవల రంగా లు అంతర్గతంగా నడుస్తాయి. అందువల్ల గ్లోబ ల్ షాక్ వచ్చినా, అది పూర్తిగా మార్కెట్‌ను కూలదోసే స్థాయికి చేరడం కష్టమవుతుంది. మూడవది, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు కొంతవరకు విక్రయా లు చేసినప్పటికీ, దేశీయ సంస్థాగత మదుపరు లు మార్కెట్‌ను సపోర్ట్ చేశారు. ఇది భారత మార్కెట్ నిర్మాణంలో వచ్చిన ఒక కీలకమార్పు. ముందుగా మార్కెట్లు పూర్తిగా విదేశీ పెట్టుబడులపై ఆధారపడి ఉండేవి. ఇప్పుడు దేశీయ నిధులు సమతుల్యతను కల్పిస్తున్నాయి. నాలుగవది, చమురు ధరలు మొదట భారీగా పెరిగినా, తరువాత కొంత తగ్గడం వల్ల భయాందోళనలు తగ్గాయి. భారత్ చమురు దిగుమతులపై ఆధారపడే దేశం కావడంతో, ధరలు స్థిరపడటం మార్కెట్‌కు ఊరటనిచ్చింది. అయితే ఇక్కడ ఒక సాధారణ అభిప్రాయాన్ని పరిశీలించాలి: మార్కెట్ పడిపోలేదంటే పరిస్థితి సురక్షితంగా ఉంది అని భావించడం సరైందికాదు. వాస్తవానికి, ఈ స్థిరత్వం ఒక తాత్కాలిక సమతుల్యత మాత్రమే కావచ్చు.

## కలవరపెడుతున్న రూపాయి పతనం



ఫోరెక్స్ మార్కెట్‌లో డాలర్‌కు రూపాయి మారకపు విలువ ఈశుక్రవారం (మార్చి 20) గతంలో ఎన్నడూ లేనంతగా 64 పైసలు కోల్పోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. డాలర్‌కు రూపాయి మారకడం 93.53గా ఉంది. ఫోరెక్స్ చరిత్రలోనే ఇది కనిష్ఠ స్థాయి. పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు గణనీయంగా పెరగడం, అలాగే విదేశీ నిధుల నిరంతర నిష్క్రమణ రూపాయి పతనానికి కారణమయ్యాయి. ట్రేడర్ల ప్రకారం, చమురు ధరల పెరుగుదల, పెట్టుబడిదారులు రక్షణాత్మక విధానాలను అనుసరించడం వల్ల రూపాయి తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అదనంగా, భౌగోళిక అనిశ్చితి కారణంగా ఇంధన వ్యయాలు పెరుగుతూ ఉండటం వాణిజ్య లోటును విస్తరించడమే కాకుండా ద్రవ్యోల్బణ ఒత్తిడులను పెంచవచ్చని నిపుణులు అంటున్నారు. ఇంటర్ బ్యాంక్ విదేశీ మారక మార్కెట్లో రూపాయి 92.92 వద్ద ప్రారంభమై, తొలిసారిగా 93మార్క్‌ను దాటి, రోజంతా క్షీణిస్తూ చివరకు 93.53 వద్ద ముగిసింది. ఇది గత ముగింపుతో పోలిస్తే 64పైసల నష్టం. అం తకుముందు బుధవారం (మార్చి18) కూడా రూపాయి 49 పైసలు పడిపోయి 92.89 వద్ద ముగిసింది.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలని
## సింగరేణి పోరు జాతా
### ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో మార్చి 18 నుంచి 30 వరకు గోలేటి నుండి కొత్తగూడెం వరకు జరిగే సేవ్ సింగరేణి పేరుతో ఏర్పాటు చేసిన పోరు జాతా మార్చి 22 న గోదావరిఖనికి చేరుకుంటుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ తెలిపారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర నాయకత్వం సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించిందని, అందులో భాగంగా మార్చి 17 న గనులు డిపార్ట్మెంట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. మార్చి 18 నుంచి 30 వరకు సేవ్ సింగరేణి పోరు జాత సింగరేణి వ్యాప్తంగా నిర్వహించి హెడ్ ఆఫీస్ ముందు వంట వార్పు కార్యక్రమం జరుగుతుందన్నా రు. సమావేశంలో ఎఐటియుసి కేంద్రకార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్ మాట్లాడగా, సంకె అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో అన్ని విభాగాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## 31న కొండిగారి రాములు సంతాపసభ
### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఈనెల 31న ఇబ్రహీంపట్నంలో సిపిఐ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సంతాప సభ జరుగుతుందని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ కొండిగారి రాములు సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోని సిపిఐ శ్రేణులు ఉద్యమించాలన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించే సంతాప సభకు సిపిఐ కార్యకర్తలు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. క్యార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహ్మ, ఓరుగంటి యాదయ్యగౌడ్, పి.శివకుమార్, కావలి సురేష్, పి.నీలమ్మ, కాటంరాజు, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువులు దూరం చేసేలా రాష్ట్ర బడ్జెట్
### ఎఐఎస్ఎఫ్ నిరసన... బడ్జెట్ ప్రతులు దహనం

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** విద్యారంగ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని, ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమేనని ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక గీతాభవన్ చౌరస్తాలో ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సంధర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22 శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందని తెలిసిందన్నారు. 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సరానికి 8.22 శాతం మాత్రమే కేటాయించడం దారుణమఅన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల ఫీజు బకాయిలుంటే కేవలం నాలుగు వేల మూడువందల కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నునావత్ శ్రీనివాస్ నాయక్, నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, నగర సహాయ కార్యదర్శి బోయిని విష్ణువర్ధన్, సంపత్, సాయికృష్ణ, అశోక్, అభి తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగంపై నిర్లక్ష్యం..

**నిర్మల్ టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపడాన్ని నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాష్ మాట్లాడుతూ బడ్జెట్ పేద విద్యార్థులను చదువులకు దూరం చేసేలా ఉందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అస్లాం, గణేష్, పవన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.




### బడ్జెట్‌లో విద్యకు మొండిచెయ్యి

**భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించి బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకుండా మొండి చెయ్యి చూపిందని ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి వరక అజీత్ ఆరోపించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ప్రకటించిన బడ్జెట్‌లో విద్యారంగా కేవలం 8.22 శాతం మాత్రమే కేటాయింపులు చేశారని, ఎన్నికల సమయంలో 15 శాతం నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలకోట్ల స్కాలర్‌షిప్‌ల బకాయిలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి సరైన నిధులు కేటాయించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కొన్ని విశ్వవిద్యాలయాలకు భారీగా నిధులు కేటాయిస్తూ మరికొన్నింటిని విస్మరించడం సరైంది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్భాగాంధీ పాఠశాలలు, డిగ్రీ కళాశాలలకు నిధులు లేకపోవడం ఆందోళనకరమన్నారు. విద్యారంగానికి కనీసం 30 శాతం నిధుల కేటాయించి వేద విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, నాయకులు కళ్యాణ్, మహేష్, నవీన్, ప్రణయ్, దలీప్, రాజు, సుదీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** విద్యార్థులకు చదువులను దూరం చేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాంనాయక్ అన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా పుస్తకాలు పట్టుకుని చెవుల్లో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రఘురాంనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి నిధులు కేటాయించకుండా రాష్ట్ర అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ బడులలో సంక్షేమ హాస్టల్లో జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీ స్థాయిలలో అభివృద్ధికి ఈ నిధులు ఏమాత్రం సరిపోదని ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేసేలా ఈ ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి మాత్రం పెట్టడం లేదన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుభోధ్, ఉపాధ్యక్షులు కుశాల్‌దేవ్, నాయకులు రంజిత్, శివ, కమల్, ఈశ్వర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## పేదల ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి
### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/వలిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం 22ఎ జాబితాలో చేర్చిన పేదల ఇళ్ల స్థలాలను ఆ జాబితా నుంచి తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం వేములకొండ మత్స్యాద్రి ఫంక్షన్ హాల్‌లో నరిగె యాదయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని యానాల దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 17 మండలాలలో, ఆరు మున్సిపాలిటీలలో అదే విధంగా 422 గ్రామపంచాయతీలలో నిషేధిత జాబితాను ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఇందులో మొత్తం వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చట్టం 1908 ప్రకారంలోని సెక్షన్ 22ఎ పిఒటి చట్టంలో చేర్చారన్నారు. ఆ నెంబర్లను భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. ఈ ఇంటి స్థలాల భూములు నిషేధితజాబితాలో చేర్చడాన్ని రద్దు చేయాలన్నారు. ఈ భూముల్లో వెనకబడిన వర్గాలకు చెందినవారు ఇండ్లు నిర్మించుకొని నివసిస్తున్నారని, వాటికి ఇంటి పన్ను, విద్యుత్, తాగు నీటి కనెక్షన్లు ఉన్నాయని బిల్లులు క్రమంగా చెల్లిస్తున్న వారిని క్రయ విక్రయాలు జరగకుండా ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చడంతో వారు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ భూములలో గుడిసెలు నిర్మించుకున్న వారికి తక్షణమే పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఎలగందుల అంజయ్య, ఎల్లంకి మహేష్, బొడిగ సుదర్శన్, యాస జనార్దన్‌రెడ్డి, కట్ల యాదగిరి, బత్తుల బిక్షపతి, మారోజు నరసింహ చారి, సలిగంజి కృష్ణ కుమార్, పోషనబోయిన బొందయ్య పాల్గొన్నారు.



## కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మె విరమణ
### ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ ఉపేందర్

**ప్రజాపక్షం /రెబ్బెన :** సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో గత నాలుగు రోజులుగా ఎఐటియుసి ఆధ్వర్యంలో కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె విరమించారు. హక్కుల సాధన కోసం డ్రైవర్లు, క్లీనర్లు చేస్తున్న ఈ సమ్మెను విరమిస్తున్నట్లు ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ శనివారం గోలేటిలో వెల్లడించారు. యాజమాన్యంతో జరిగిన చర్చల్లో డ్రైవర్లకు 22,000 రూపాయలు, క్లీనర్లకు 11,000 రూపాయలు చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు. వేతన పెంపుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి అంగీకారం కుదరడంతో సమ్మె విరమించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నూతన ఒప్పందం ఏప్రిల్ 1, 2026 నుండి మార్చి 31, 2028 వరకు రెండు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని వివరించారు. సమ్మె విజయవంతానికి సహకరించిన సింగరేణి, టిటిసి యాజమాన్యాలకు, పోలీసు విభాగంతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండల పరిధిలో గత కొన్ని రోజుల క్రితం దొంగతనాలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగలను పెద్దకొత్తపల్లి ఎస్సై అరెస్ట్ చేసి, రిమాండ్ తరలించారు. ఎస్సై సతీష్ తెలిపిన వివకాల ప్రకారం ఐదు మంది అంతరాష్ట్ర దొంగల ముఠా మండల పరిధిలో గత కొన్ని రోజుల క్రితం పలు దొంగతనాల కేసుల్లో నిందితులైన దొంగలను అరెస్టు చేసి, 3 తులాల బంగారం, 75 తులాల వెండి, ఒక పల్సర్ బైక మూడు సెల్ ఫోన్లు, రికవరీ చేసి, దొంగల ముఠాను రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## హనుమాన్ దేవాలయ పునర్నిర్మాణం



**ప్రజాపక్షం/రేవల్లి :** రేవల్లి మండలం లోని తలుపునూరు గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని గ్రామస్తులంతా కలిసి చందాలు వేసుకొని పునర్నిర్మాణం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామస్తులంతా కలిసి గణేష్ హోమం నిర్వహించి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. దేవాయంలో గత పాత ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గోమాత ద్వారా ఉద్వాసన చేసి తొలగించారు. విజయదశమి వరకు దేవాలయ నిర్మాణం పూర్తి చేస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు యువకులు మహిళలు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు




**ప్రజాపక్షం/మద్దూర్/కొత్తపల్లి :** మద్దూర్, కొత్తపల్లి మండలాల్లో శనివారం రోజు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా రంజాన్ పండుగ జరుపుకున్నారు. ఉమ్మడి మద్దూర్ మండల వ్యాప్తంగా ముస్తాబైన ఈద్గాల వద్ద నూతన వస్త్రాలు ధరించి ఉదయమే ఈద్గాల వద్దకు చేరుకున్నా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆప్యాయంగా రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉమ్మడి మండలవ్యాప్తంగా మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## రేపు ఉచిత వైద్య క్యాంపు

**ప్రజాపక్షం/వంగూర్ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో ఈనెల 23 తేదీన నిర్వహిస్తున్న ఉచిత వైద్య క్యాంపును మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిని శాంతా బాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా స్త్రీల ఆరోగ్య సమస్యలు, కంటి సమస్యలు, చిన్న పిల్లలకు సంబంధించిన వ్యాధులకు, ఎముకలకు సంబంధించిన సమస్యలకు సంబంధిత వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. క్యాంపులో అన్ని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

హాజరైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ముస్లిం మైనార్టీ సోదరులు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు శుక్రవారం కనిపించిన నెలవంకతో శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలు ఈద్‌ఉల్ ఫితర్ ప్రత్యేక నమాజు కోసం వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ దీవెనలతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ పవిత్ర పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్ కుమార్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ విప్‌గా ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని, మహబూబ్ నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని వారి క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రాజు గౌడ్, సర్పంచులు రంగయ్య, రఘు నాయక్, రవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్రయ్య, గోవింద్ యాదవ్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు.

## త్వరలో పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

స్వచ్ఛంద విరాళాల సేకరణ

**ప్రజాపక్షం/మక్తల్ :** భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయులు మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను మక్తల్ పట్టణ కేంద్రంలోని కర్ని క్రాస్ రోడ్ దగ్గర పూలే చౌరస్తాలో ఏర్పాటు చేయాలని మక్తల్ పట్టణ కేంద్రానికి చెందిన ప్రజాసంఘాలు, బీసీ సంఘాలు నిర్ణయించాయి. ఈ క్రమంలో గతంలో అమరుడు నర్సింలు టీచర్ ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే విగ్రహంతో పాటు కొత్తగా సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసి ఈ ఇద్దరి మహనీయులను గౌరవించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. ఈ క్రమంలో ఈ మహత్తర కార్యక్రమానికి మక్తల్ పట్టణ ప్రజలు తమ సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మక్తల్ పట్టణ కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో వివిధ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దత్తాత్రేయ అడ్వకేట్, కె.రామాంజనేయులు గౌడ్, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డి.హెచ్.జి. పోలప్ప నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు మద్దిలేటి మానవ హక్కుల కార్యకర్త, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

# అభివృద్ధికి అడ్డుపడితే సహించేది లేదు

మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/అమరచింత :** ఆరు నూరైనా ఆత్మకూరు మండల కేంద్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి తీరుతానని పశుసంవర్ధక, పాడి పారిశ్రమ, క్రీడలు, యువజన శాఖ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ప్రజలకు హామీ ఇచ్చారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వాకిటి శ్రీహరి మాట్లాడారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పేదోడు ఆడపిల్లల పెళ్లి చేయాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆయన తెలిపారు. తీసుకున్న అప్పును సరైన సమయంలో తీర్చాలంటే కళ్యాణలక్ష్మి చెక్కులను సరైన సమయంలో ఇవ్వాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేకున్నా ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి పేదవాడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం రేషన్ షాపుల ద్వారా ఇస్తున్నామని గుర్తు చేశారు. ఆత్మకూరులో ఇప్పటికే అర్హులైన పేదవారికి రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఇంకా 1500 ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఆత్మకూరు రూపు రేఖలు మారుస్తానన్నారు. ఆరు నూరైనా ఆత్మకూరును అభివృద్ధి చేసి తీరుతానన్నారు. జూరాల వద్ద బ్రిడ్జిని పూర్తి చేస్తే ఆత్మకూరుకు మహర్దశ పడుతుందన్నారు. ఆత్మకూరు అభివృద్ధికి అడ్డుపడకండని ప్రతిపక్షాలకు హితవు పలికారు. పట్టణాభివృద్ధికి ప్రతిపక్షాలు హితవు పలికారు. పట్టణాభివృద్ధికి ప్రతిపక్షాలు అడ్డు పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమతుల్లా, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ముస్లిం సోదరులు, వారి కుటుంబ సభ్యులకు పర్యాటన, సాంస్కృతిక పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రంజాన్ పండుగను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలోని ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ సామూహిక ప్రార్థనాల్లో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నెల రోజులగా కఠిన ప్రార్థనలు ఆచరించిన రంజాన్ మాసం క్రమశిక్షణ, నిష్ట, దాతృత్యం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉపవాస దీక్షల ద్వారా మనస్సు పవిత్రతో పాటు సమాజంలో పరస్పర గౌరవం, సౌభ్రాతృత్యం పెంపొందుతుందని అన్నారు. ప్రభుత్వ పరంగా ముస్లింలకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి వెంట ప్రజాప్రతినిధులు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## అమ్మ చెరువులో మొసలి కలకలం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండలం పరిధిలోని కల్వరాల గ్రామంలో మొసలి కనిపించడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న అమ్మ చెరువులో మొసలి ప్రత్యక్షమైందని స్థానికులు తెలిపారు. శనివారం సాయంత్రం చెరువు వద్దకు వెళ్లిన కొందరు యువకులు నీటిలో కదులుతున్న మొసలిని గమనించి ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించడంతో విషయం తెలిసి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. చెరువు పక్కనే విస్తారంగా పంట పొలాలు ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని గ్రామ పెద్దలు సూచించారు. ముఖ్యంగా నీటి అవసరాల కోసం చెరువుకు వెళ్లే రైతులు, కూలీలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించాఉ. ఈ ఘటన పై గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. మొసలిని సురక్షితంగా పట్టుకొని అటవీ ప్రాంతానికి తరలించాలని వారు కోరుతున్నారు. గ్రామంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# శాంతి, సామరస్యాలకు ప్రతీక రంజాన్

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** రంజాన్ పండుగ శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించడానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు,. ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గద్వాల ఈద్ గాహ్ వద్ద శనివారం ఉదయం జరిగిన ప్రార్థన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్ పరస్పర గౌరవం, సేవాభావాన్ని, దాన గుణాన్ని పెంపొందించే పవిత్ర మాసమని తెలిపారు. హిందువులు, ముస్లింలు సహా అన్ని మతాల ప్రజలు కలిసి మెలిసి సఖ్యతతో జీవించాలని, సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని కాపాడాలని కలెక్టర్ సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఐక్యతను కొనసాగిస్తూ జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు ముస్లిం సోదరులు చేసిన ఉపవాస దీక్షల ఫలితంగా అల్లా దీవెనలతో ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అన్ని కులాలు, మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటే కలిసిమెలిసి జీవించేందుకు రంజాన్ పర్వదినం ఉపకరిస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌ను, ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డిను పలువురు ముస్లింలు సన్మానించి, ఈద్ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి తమ సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, పలువురు కౌన్సిలర్లు, ముస్లిం మైనారిటీ సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ అన్నీ వర్గాలను నిరాశపరిచింది



మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మూడవ బడ్జెట్ ప్రభుత్వం సంక్షేమం పథకాలపై ఎక్కువ దృష్టి పెడుతుందని అనుకున్నారు. కానీ పెట్టలేదనీ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్ నగర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడు బడ్జెట్‌లు పూర్తి అయినా ఎవరికి న్యాయం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు.. 11 డిక్లరేషన్‌లకు అనుగుణంగా బడ్జెట్ రూపాకల్పన లేదన్నారు. బీసీలకు ఏడాదికి రూ. 20 వేల కోట్లు.. ఐదేండ్లకు లక్షకోట్లు ఇస్తామని ఇప్పుడు కేవలం 3.85 శాతం మాత్రమే కేటాయించారంటే బీసీలకు మోసం చేయడం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు కేవలం 5 వేలకోట్లు మాత్రమే ఖర్చు చేసారని తెలిపారు. బీసీ గురుకులాల్లో అన్నం సరిగ్గా లేక విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని, మైనార్టీ గురుకులాల్లో వసతులు లేక ఖాళీ అవుతున్నాయని గుర్తు చేశారు. సీపీఎస్ రద్దు చేస్తామని ప్రభుత్వం మాట తప్పింది. పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు సరిగ్గా ఇవ్వడం లేదు. పదవి విరమణ పొందిన వారికీ ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదని విమర్శించారు. అన్నం పెట్టె రైతు ఇబ్బందుల్లో ఉన్నడు.. రైతు బంధు ఇవ్వడం లేదు.. కరెంటు సరిగ్గా ఇవ్వడం లేదు.. యూరియా సరిగ్గా అందించలేదు.. పండించిన తరువాత కనసీం గిట్టుబాటు ధర ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ వచ్చాక సంపద పెరిగిందా? తగ్గిందా? ప్రజలే ఆలోచన చేసుకోవాలన్నారు. బీసీలకు 50 వేల కోట్లు ఇవ్వాల్సిందే.. దళితులకు 10 లక్షలు ఇచ్చేందుకు బడ్జెట్ ఇవ్వాల్సిందే.. గిరిజనులకు, మైనార్టీలకు ప్రత్యేక సబ్ ప్లాన్ అమలు చేయాలనీ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ ఇది. అంకెల గారడీ తప్ప సంక్షేమ బడ్జెట్ కాదు. అన్నీ పార్టీలు రాజకీయలకు అతీతంగా ఒత్తిడి తీసుకువచ్చి అన్నీ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందె బడ్జెట్ రూపకల్పన చేసేందుకు ఒత్తిడి తేవాలని కోరారు. సమావేశంలో మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే రాయితీ సౌకర్యం పునఃరుద్ధరింపజేయించండి

ఎంపి డికె అరుణకు జడ్చర్ల ప్రెస్‌క్లబ్ వినతిపత్రం సమర్పణ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** అక్రిడిటేషన్ కార్డుకలిగి ఉన్న జర్నలిస్ట్‌లకు రైల్వే ప్రయాణంలో గతంలో ఉన్న 50శాతం రాయితీ సౌకర్యాన్ని పునఃరుద్ధరింపజేసేలా చూడాలని జడ్చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి.కృష్ణ ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యురాలు డీకే అరునకు వినతిపత్రం సమర్పించారు. శనివారం సాయంత్రం మున్సిపాలిటీ పర్యటనలో ఆమెను కలుసుకుని సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. నాలుగేళ్లకిందటి వరకు అక్రిడిటేషన్ కార్డు కలిగిన జర్నలిస్టుల వారి కుటుంబ సభ్యులకు రైలు టికెట్ల ధరల్లో 50శాతం రాయితీ ఉండేదని గుర్తుచేశారు. ఆ పథకాన్ని తిరిగి తీసుకువచ్చి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎంపి ప్రాధాన్యత అంశంగా తీసుకుని రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా టోల్‌గేట్‌లు ఉండవని, ఎలా చేయాలో పరిశీలిస్తానని భరోసా ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జర్నలిస్ట్‌లు టి.శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డితో ఉన్నారు.

# ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల క్షేత్రం శనివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించి సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, దేవస్థాన అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. మంత్రి జూపల్లి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ నెల 26 నుంచి జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాల గోడపత్రికను (పోస్టర్) ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం చేపటనున్న వివిధ మౌలిక సదుపాయాల కల్పన పనులకు మంత్రి భూమిపూజ చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తున్నామని, సిర్సనగండ్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ, ఆలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## జమ్ము తొలగింపు చర్యలు ప్రారంభం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కేతేపల్లి–కల్వరాల గ్రామాల మధ్య ఉన్న కేఎల్ఐ కాలువలో పేరుకుపోయిన జమ్ము కారణంగా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న కల్వరాల గ్రామ రైతులకు ఉపశమనం కలిగేలా చర్యలు ప్రారంభమయ్యాయి. రైతుల సమస్యలను గుర్తించిన మంత్రి జూపల్లి కృష్ణారావు తక్షణమే స్పందించి జమ్ము తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. కాలువలో అధికంగా పేరుకుపోయిన జమ్ము కారణంగా సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి రైతు ఇబ్బందులను వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కాలువ శుద్ధి పనుల కోసం యంత్రాన్ని ఏర్పాటు చేయించారు. మంత్రి ఆదేశాల మేరకు శనివారం నుంచే జమ్ము తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ చర్యతో కల్వరాల గ్రామానికి సాగునీరు సకాలంలో అందే అవకాశాలు మెరుగుపడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మధుగని నరసింహ, రంగాపురం తిరుపతయ్య, చింతల దయాకర్, పోచమోని ఆంజనేయులు, సత్తూరు భాస్కర్ గౌడ్, పోచమోని మల్లేష్, తంగేడి స్వాములు, బత్తుల హుస్సేన్, తంగేడి నాగేంద్రం, చెనమోని బొజ్జన్న, పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ఈద్-ఉల్- ఫితర్



నాగర్ కర్నూల్ ఈద్గా వద్ద ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, మైనార్టీ సోదరులకు శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ముస్లిం సోదరులు ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు నెలవంకతో శుక్రవారంతో ముగియడంతో శనివారం పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలు ఈద్ ఉల్ ఫితర్ ప్రత్యేక నమాజు కోసం వచ్చిన భక్తులతో కిట కిటలడాయి. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డు నగల ఈద్గాలో అల్లామా హాఫీజ్, ఆలీం మహమ్మద్ షాకీర్ సిద్దిఖి, హాఫీజ్ మహమ్మద్ మహబూబ్ అలీలు రంజాన్ ప్రాముఖ్యత, పవిత్రత గురించి వివరించారు. హాఫీజ్ మహమ్మద్ అన్వర్ ఉల్ హక్ ఈదుల్ ఫీతర్ ప్రత్యేక నమాజ్‌తో పాటు కుత్బను చదివించారు. వక్ఫ్ కాంప్లెక్స్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, జమా మస్జిద్ కమిటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖాదర్ ఏర్పాట్లకు సహకరించిన మున్సిపల్ అధికారులు చైర్మన్ ఇతర కౌన్సిలర్లకు జిల్లా స్థాయి అధికారులకు ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

**పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు**


నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలపడానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్లా రాజేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణా రావు, మున్సిపల్ చైర్మన్ సునేంద్రలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగం శశిధర్ రెడ్డిలతో పాటు ఆ పార్టీ కౌన్సిలర్లు నాయకులు తదితరులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ విప్‌గా ఎంపిక కావడం పట్ల జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ సంతోషకర సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్ద ఎత్తున అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, కార్యకర్తలు హాజరై ఎమ్మెల్యేని గజమాలతో ఘనంగా సత్కరించారు. పూలహారాలు, శాలువాలతో ఆయనకు అభినందనలు తెలియజేసి, ప్రభుత్వ విప్‌గా ఆయన నియామకం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటనర్సయ్య, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు శాంతన్న యాదవ్, సాయిలు యాదవ్, పెద్ద గొల్ల నర్సింహులు యాదవ్, టంకర కృష్ణయ్య యాదవ్, శ్రీనివాస్ యాదవ్, చందు యాదవ్, గోవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అనేక మంది యాదవ మహాసభ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మాంసం విక్రయ కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణంలోని పలు మాంసం, చికెన్ విక్రయ కేంద్రాలను శనివారం కల్వకుర్తి పశు వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తనిఖీ చేశారు. పట్టణ పశు విక్రయాల నిబంధనలు ప్రజారోగ్యంపై ప్రభావం అంశాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకల మాంసం విక్రయదారులు స్లాటర్ హౌస్ లోనే గొర్రెలు, మేకలను స్లాటరింగ్ చేయించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ స్లాటరింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. మాంసం విక్రయదారులు మాంసం విక్రయించే కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వ్యాధి సోకిన గొర్రెల మాంసం విక్రయించరాదన్నారు. అనంతరం పాస్ట్‌ఫుడ్, సెంటర్లను హోటల్స్‌ను, తనిఖీ చేశారు. జింజర్ హౌస్ ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉన్న చికెన్, మటన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రిజ్‌లలో మటన్, చికెన్‌లను నిల్వ చేయకూడదన్నారు. అట్టి పదార్థాలను నిలువ ఉంచినచో చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఆయన వెంట పశు వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

'స్టాప్ డ్రగ్స్ - స్టార్ట్ స్పోర్ట్స్' పేరిట ఎఐవైఎఫ్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, అమర వీరుడు భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ఘనంగా ప్రారంభించారు. క్రీడలతోనే శారీరక దృఢత్వం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగత్ సింగ్ యువతకు ధైర్యం, త్యాగం మరియు దేశభక్తికి ప్రతీక అని కొనియాడారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యతను పెంచుతాయని అన్నారు. నిరుద్యోగం, అవినీతి, మాదకద్రవ్యాల వంటి సామాజిక రుగ్మతలపై పోరాడే శక్తిగా యువత ఎదగాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కల్లూరు ధర్మేంద్ర, ఇతర సీపీఐ నేతలు.ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి వచ్చిన 16 వాలీబాల్ జట్లు.ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ నేతృత్వంలో ఈ పోటీలు మార్చి 23 వరకు కొనసాగుతాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, కళ్లేపల్లి మహేందర్, కౌన్సిలర్లు బబ్బూరి శ్రీధర్, పెళ్లిమల్లి లావణ్య శ్రీధర్ ,ఏఐవైఎఫ్ నాయకులు కంబాల వెంకటేష్, ఎర్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ హుండీల్లో డబ్బు దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడు అరెస్ట్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణంలోని ఈనెల 19న రాత్రి సమయంలో పలు ప్రాంతాల్లో దేవాలయ హుండీలు పగలగొట్టి,ఆటో, స్కూటీ,సెల్ ఫోన్లు దొంగతనాలు చేసిన నేరస్థున్ని టుటౌన్ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని నల్లగొండ డిఎస్పి కె.శివరాం రెడ్డి వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని రామగిరికి చెందిన మాతంగి సాయి నాథ్ అయ్యప్ప గుడిలో హుండీ ధొంగతనము తన స్కూటీ రెండు సెల్ ఫోన్లు ధొంగిలించినారని నల్లగొండ టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయబడింది.అదే రోజు రాత్రి వైకుంట నగర్‌లో ఒక ఆటో ఆర్‌టిసి కాలనీలో ఉన్న శ్రీ కృష్ణ టెంపుల్‌లో హుండీ దొంగతనము చేయగా, మరో రెండు కేసులు నమోదు చేశారని తెలిపారు.అలాగే పట్టణంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్,ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో సాంకేతిక ఆధారాల సమాచారంతో నల్లగొండ పట్టణంలో గత కొంత కాలంగా నివాసం ఉంటున్న మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కు చెందిన పోలిశెట్టి కార్తీక్ కుమార స్వామి అనే నిందితుడిని నల్లగొండ పట్టణ పరిధిలోని సావర్కర్ నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు నిందితుని వద్ద నుండి ఒక స్కూటీ,ఒక ఆటో రిక్షా,(2) సెల్ ఫోన్లు, మరియు రూ.3వేలు నగదు దొంగతనానికి ఉపయోగించిన రెండు ఐరన్ రాడ్స్ కట్టింగ్ ప్లేయర్ కూడ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.ఈ కేసు ఛేదించిన టుటౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. రాఘవరావు ఆధ్వర్యంలో, ఎస్ఐ వై.సైదులు,అహ్మద్ షరీఫ్,సిబ్బంది సాగర్ల శంకర్,బాలకోటి,ఫరూక్,సతీష్,ప్రదీప్ వెంకటేశ్వర్లుని అభినందించారు.

## నాణ్యమైన సేవలు అందించాలి

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** వినియోగదారులకు నాణ్యమైన సేవలందరించాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సంజీవని కాలేజి ఎదురుగా పెద్దబావి శోభ ఆనంద్‌రెడ్డిలు నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ పంపును ఆయన సర్పంచ్ పందుల వెంకటయ్య గౌడ్, ప్రజా ప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డిజిల్‌లను అందించాలని సూచించారు. కొండమల్లేపల్లి మండల వ్యాపార పరంగా ఎంతో అభివృద్ధి చెందడం శుభసూచకం అని అన్నారు. అనంతరం పెట్రోల్ పంపు యాజమాన్యం ఆనంద్‌రెడ్డి ఎంఎల్‌ఏ, ప్రజా ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించి, మెమోంటోలు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పందుల వెంకటయ్యగౌడ్, ఆలంపల్లి నర్సింహా, మాజీ పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మండల అభివృద్ధి ప్రధాత దూదిపాల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

# నల్లగొండను సస్యశ్యామలం చేస్తా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో ప్రతీ ఎకరాకూ సాగునీరు



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.శనివారం నల్లగొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో మంత్రి ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రాజెక్టు కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామంలోని రైతులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొండపాక గూడెం నుంచి అప్పాజీపేట వరకు నిర్మించనున్న నూతన పిల్ల కాలువ పనులకు అప్పాజీపేటలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా సమర్థవంతమైన కాలువల నిర్మాణంతో నియోజకవర్గంలోని చెరువులన్నింటిని నింపి ప్రతి ఎకరానికి సాగునీరు అందించనున్నట్లు తెలిపారు.దీంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగు విస్తీర్ణం మరింతగా పెరుగుతుందని అన్నారు.నల్లగొండ నియోజకవర్గం తనకు గుండెకాయలాంటిదని,అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ ప్రాజెక్టు ప్రజలకు వరం లాంటిదని, కాలువ నీటితో రైతులందరిలో ఆనందం వెల్లివిరుస్తుందని తెలిపారు.రైతు సంక్షేమం కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు.అప్పాజీపేట గ్రామంలో చేపట్టిన పిల్లకాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్,ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గంగుల అండాలు సైదులు,ఇరిగేషన్ ఈఈ సతీష్ చంద్ర,డిఈ పిచ్చయ్య,ఏఈ నవీన్ కుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ బూరి శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జడ్‌పిటిసిలు పాశం రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్,డీసీసీబీ మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, అప్పాజీపేట మాజీ సర్పంచ్ గంగుల సైదులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిన కాలువలు కాంగ్రెస్ హయాంలోనే పూర్తి

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జలయజ్ఞంలో భాగంగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టినటువంటి కాలువలు మళ్ళీ కాంగ్రెస్ హయంలోనే పూర్తయ్యాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి వద్ద వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారి కింది నుంచి వెళ్లే బస్వాపురం ప్రాజెక్ట్ కాలువను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి మాత్రమే మన ప్రాంతానికి నీరు వస్తుందని, కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి కాదని స్పష్టం చేశారు. బస్వాపురం ప్రాజెక్టు నుంచి కాలువల నిర్మాణం ద్వారా వైయస్ రాజశేఖర్ రెడ్డి హయంలోనే ప్రారంభమయ్యాయని, ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్యే విమర్శించారు. భువనగిరి వద్ద వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారి కిందనుంచి వెళ్ళే ఈ కాల్వను గత ప్రభుత్వం పట్టించుకోకు పోవడం వల్ల కాలువల ద్వారా చెరువులకు నీరు అందలేదని అన్నారు. ప్రస్తుతం ఈ కాలువ పూర్తి కావటం తో భువనగిరి, వలిగొండ మండలాలలో చెరువులు నింపి పంట పొలాలకు నీరు అందించే కార్యక్రమం మొదలైందని అన్నారు. ఏడున్నర కోట్ల ఖర్చుతో కల్వర్టు నిర్మానం పూర్తిచేసి నీరు అందిస్తున్నట్టు తెలిపారు. బసవపురం ప్రాజెక్టులో ఇంకా పూర్తిస్థాయి లో నీళ్లు నింపలేదనీ ముంపు గ్రామం బి ఎన్ తిమ్మాపురంలో ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇంకా కొంత మంది కి పరిహారం అందలే దని, మరో 50 కోట్లు నిధులు విడుదల చేస్తే బిఎన్ తిమ్మాపూర్ గ్రామం ఖాళీ అయ్యి నీళ్లు నింపడానికి అనువుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బస్వాపురం ప్రాజెక్టు 0.7 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యం ఉందన్నారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి వద్ద కూడా రోడ్డును కటింగ్ చేసి కాల్వ ద్వారా నీరు వెళ్లేలా చేసే కార్యక్రమం చేయబోతున్నట్లు తెలిపారు. మరో పైపు హైలెవల్ కాలువ నిర్మాణం ద్వారా వడపర్తి కత్వా కు నీరు వచ్చేలా భూసేకరణ మొదలైందని, మరో 6 నుంచి 7 కోట్ల విలువ చేసే భూ సేకరణ పూర్తి అయితే హైలెవల్ కాలువ పూర్తి అయి వడపర్తి నుంచి బీబీ నగర్ చెరువుకు నీరు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తానని భారీ మోసం

60 మంది వద్ద రూ.1కోటి 85 లక్షలు వసూళ్లు

బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలను ఇప్పిస్తానని 60 మంది నుండి రూ.1కోటి 85 లక్షలు వసూలు చేసిన ఓ వ్యక్తిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు అరెస్టు చేసిన సంఘటన సూర్యాపేట పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఇన్స్‌పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వాసుపత్రులలో స్టాప్‌నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తానని జిల్లాతో పాటు పలు జిల్లాలకు చెందిన 60 మంది నుండి రూ.1కోటి 85 లక్షలు వసూలు చేసి మోసం చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి సూర్యాపేట పట్టణంలో నివాసం ఉంటున్న మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నిందితుడు దుగ్యాల రఘురామ్ క్రీడల ఈవెంట్స్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకు పెద్ద పెద్ద నాయకులతో పరిచయం ఉందని, హైద్రాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో ఉద్యోగం చేస్తున్న వాణితో కలిసి 60 మంది వద్ద రూ.1కోటి 85 లక్షలు వసూలు చేశారు. వారిని నమ్మించి డబ్బులు తీసుకున్న వారు నకిలీ నియామక పత్రాలు ఇవ్వడంతో వారు అది పసిగట్టి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రఘురామ్‌ను అరెస్టు చేసిన పోలీసులు నకిలీ జాబ్ సర్టిఫికెట్లు, సెల్‌ఫోన్‌ను స్వాదీనం చేసుకున్నారు. మోసం చేసి తీసుకున్న డబ్బులతో జల్సాలు చేస్తూ రూ.30 లక్షల విలువైన ఫ్లాట్, మరో 35 లక్షల విలువైన కారును కొనుగోలు చేసినట్లు తాము గుర్తించామని సిఐ తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు




**ప్రజాపక్షం/సూర్యాపేట:** రంజాన్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లీం సోదరులు శనివారం అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద పెద్ద ఎత్తున తరలివచ్చారు. మౌలానా అత్తార్ సాహెద్ ప్రవచనాలు విని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపేందుకు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ రాజ్య సభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యతో పాటు పలువురు నాయకులు హాజరై అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పారు. అనంతరం ఆయా పార్టీల నాయకులు తమ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు ఇంటికి వెళ్లి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ వేడుకలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు జిల్లా పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు



మొరిశెట్టి లక్షాది, మున్సిపల వైస్ చైర్మన్ షఫి ఉల్లా, కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యాదాద్రి కోటపై 'బీర్ల' మార్క్ వ్యూహం!

నేడు జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజకీయ యవనికపై కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా, డిసిసి అధ్యక్షులు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సరికొత్త వ్యూహానికి తెరలేపారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేసేందుకు ఆయన సిద్ధం చేసిన 'సరికొత్త సైన్యం' నేడు కొలువుదీరనుంది. జిల్లా కేంద్రం సమీపంలోని రాయగిరి వివేరా హోటల్ వేదికగా నిర్వహించనున్న డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర కాంగ్రెస్ సారథి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతుండటంతో జిల్లా రాజకీయాల్లో వేడి పెరిగింది.

**సమన్వయమే ఆయుధంగా..** జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు , ఎంపీ మధ్య అద్భుతమైన సమన్వయకర్తగా ఐలయ్య తనదైన ముద్ర వేశారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామ్యేల్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలతో కలిసి గ్రూపు తగాదాలకు తావులేకుండా ఒకే తాటిపైకి తీసుకురావడంలో ఆయన సఫలీకృతమయ్యారు. అందరి అభిప్రాయాలను గౌరవిస్తూనే, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ఈ నూతన కార్యవర్గంలో పెద్దపీట వేశారు. ఆరుగురు ఉపాధ్యక్షులు 11 మంది ప్రధాన కార్యదర్శులు, ఒకరు కోశాధికారి, ఒకరు అధికార ప్రతినిధి, 17 మంది కార్యవర్గ సభ్యులతో ఏర్పడిన జిల్లా కమిటీకి పిసిసి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నేడు వారు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

**గులాబీ దళాన్ని 'మట్టి' కరిపించిన మంత్రాంగం..**
బీర్ల ఐలయ్య డీసీసీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాలో కాంగ్రెస్ గ్రాఫ్ అమాంతం పెరిగింది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆయన పక్కా ప్లానింగ్‌తో బిఆర్ఎస్ (టిఆర్ఎస్)కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. జిల్లాలోని 6 మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేసి, గులాబీ కోటలను బద్దలు కొట్టారు. అదే విధంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రత్యర్థులను మట్టికరిపించి, పల్లెల్లో హస్తం పార్టీకి తిరుగులేని పట్టు సాధించి పెట్టారు.

## నజీర్ నివాసంలో రంజాన్ వేడుకలు

: హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) వేడుకలు భువనగిరి పట్టణంలో ఘనంగా జరిగాయి. శనివారం పట్టణంలోని రేవంత్ టీం సభ్యుడు, ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.డి నజీర్ నివాసంలో ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నజీర్ నివాసానికి చేరుకున్న బీర్ల ఐలయ్యకు కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐలయ్య నజీర్ కుటుంబ సభ్యులందరినీ ఆప్యాయంగా పలకరించి, వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నజీర్‌ను ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పారు. వారి ఆతిథ్యాన్ని స్వీకరించి, ఏర్పాటు చేసిన ప్రత్యేక విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కౌన్సిలర్లు జగన్, బెండలాల్ రాజ్, చల్లగురుగుల రఘుబాబు, డిసిసి ప్రధాన కార్యదర్శి కానుగు బాలరాజ, మాజీ ఎంపీపీ బీర్ల శ్రీశైలం, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ హాజరయ్యారు.బ

## జ్యోతిరావుపూలే విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణను శనివారం ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ మహాత్మ జీవితం విద్య, సమాజ సేవ, విద్యావంతులపై మానవత్వం పెంపొందించేందుకు కృషిని ప్రత్యేకంగా గుర్తించారు. జ్యోతిరావు పూలే జీవితం ద్వారా సమానత్వ కోసం పోరాటం మనందరికి ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, సర్పంచ్ చిలుకల మంజుల, వెంకన్న, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

పవిత్ర పర్వదినం రంజాన్‌ను ఐక్యతతో జరుపుకోవాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మత కలహాలు లేకుండా సోదరభావంతో,ఐక్యతతో పండుగలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం పట్టణంలోని మునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద మంత్రి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడారు.రంజాన్ మాసంలో గత 30 రోజుల పాటు ముస్లింలు కఠోర ఉపవాసాలు, ప్రార్థనలు నిర్వహించడం వారి క్రమశిక్షణ,భక్తి, దాతృత్వానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.ఈ పవిత్ర పర్వదినం అందరి జీవితాల్లో ఆనందం, శాంతి నింపాలని, అల్లా ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3,500 కోట్లను కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగాల్లో



4 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రిజర్వేషన్ల వల్ల ముస్లింలు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్,అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, వై.అశోక్ రెడ్డి,ఏఎస్పి రమేష్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్, తహసీల్దార్ పరుశురాములు,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,కార్పొరేటర్లు,ఇతర అధికారులు, మైనార్టీ నాయకులు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.





## సాహిత్యం, కవిత్వానికి సమాజాన్ని మేల్కొలిపే శక్తి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** సాహిత్యం,కవిత్వం సమాజాన్ని మేల్కొలిపే శక్తిగా నిలుస్తాయని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.శనివారం నకిరేకల్‌లోని సత్య సాయి ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ కవి తుల శ్రీనివాస్ రచించిన పచ్చబొట్టు కవిత్వ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కవిత్వం భావవ్యక్తీకరణకు అద్భుతమైన సాధనమని, కవులురచయితలు ముందుకు వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు.యువ రచయితలు సమాజ సమస్యలను ప్రతిబింబించేలా రచనలు చేయాలని ఆకాంక్షించారు.అనంతరం కవి తుల శ్రీనివాస్‌ను అభినందించి,భవిష్యత్తులో మరిన్ని రచనలు చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ప్రజావాగ్గేయకారుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ సుప్తచేతనమైన ధ్యానస్థితిలో రాసిన కవిత్వమే చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు.జీవితం నుంచే నిజమైన కవిత్వం పుడుతుందని,సూక్ష్మ పరిశీలనతో కవిత్వం రాసే తత్వం తుల శ్రీనివాస్‌దని పేర్కొన్నారు. ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ప్రొఫసర్ బెల్లి యాదయ్య,ప్రొఫసర్ కోయి కోటేశ్వరరావు,పూజర్ల షంబయ్య,మునాస్ వెంకట్,డాక్టర్ పగడాల నాగేందర్,డాక్టర్ సాగర్ల సత్తయ్య,పెరుమాళ్ళ ఆనంద్,బండారు శంకర్,టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు చామల శ్రీనివాస్,సిఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
ఆదివారం
22-03-2026
www.prajapaksham.in

'బ్యాండ్ మేళం' మార్చి 26న రిలీజ్ అవుతోన్న ఈ సినిమా ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే లవ్‌స్టోరీగా దీన్ని రూపొందించారు. హీరో హీరోయిన్ మధ్య ఉండే ప్రేమ, గిల్లికజ్జాలను హత్తుకునేలా రూపొందించారు.

# రీల్

### చిరంజీవి చేతుల మీదుగా

## బ్యాండ్‌మేళం ట్రైలర్ రిలీజ్



మాగ్యంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ రూపొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. మార్చి 26న రిలీజ్ అవుతోన్న ఈ సినిమా ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే లవ్‌స్టోరీగా దీన్ని రూపొందించారు. హీరో, హీరోయిన్ మధ్య ఉండే ప్రేమ, గిల్లికజ్జాలను హత్తుకునేలా రూపొందించారు. హీరో హర్ష్ రోషన్ తన మరదలైన హీరోయిన్ ప్రేమను గెలవటానికి ఏం చేశాడు? తనకు ఎదురైన ఇబ్బందులేంటి? వాటిని ఎలా అధిగమించాడు? అనే అంశాలతో బ్యాండ్ మేళం సినిమా రూపొంది నట్లు తెలుస్తోంది. శివ రాజు ప్రణవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ సినిమాకు సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫీ అందించారు. శివ ముప్పరాజు స్క్రీన్ ప్లే, ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహించారు. ఈ చిత్రంలోని పాటలు ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్ర బోస్ రాశారు.

## రివార్డ్స్, అవార్డ్స్ రావడం ఆనందం

### నిర్మాత : బన్నివాస్



అవార్డ్ విన్నింగ్ చిత్రాలు, కమర్షియల్ మూవీస్..ఈ రెండూ భిన్నమైనవి. పురస్కారాలు గెల్చుకునే సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ దక్కదు అలాగే కమర్షియల్ మూవీస్‌కు అవార్డ్స్ వచ్చే అవకాశాలు తక్కువ. కానీ నిర్మాతగా మంచి వ్యాల్యూస్, కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రాలను నిర్మిస్తూ, డిస్ట్రిబ్యూట్ చేస్తూ ప్రేక్షకుల రివార్డ్స్, అవార్డ్స్ సొంతం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని నిర్మాత బన్నివాస్ అన్నారు.

బన్నివాస్ ఇటీవల నిర్మించిన, డిస్ట్రిబ్యూట్ చేసిన సినిమాలు అంబాజీపేట మ్యారేజి బ్యాండు, ఆయ్, తండేల్, లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాలు కమర్షియల్‌గా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడమే కాదు పలు ప్రతిష్టాత్మక అవార్డ్స్ గెల్చుకోవడం విశేషం.

బన్నీ వాస్ నిర్మించిన ఆయ్ సినిమా హోల్ సమ్ ఎంటర్‌టైనర్‌గా గతేడాది గద్దర్ అవార్డ్‌ను గెల్చుకుంది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రానికి బెస్ట్ సపోర్టింగ్ నటిగా శరణ్యకు గద్దర్ అవార్డ్ దక్కింది. ఈ ఏడాది తండేల్ సినిమా బెస్ట్ యాక్టర్, ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రంగా రెండు గద్దర్ అవార్డ్స్ సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడిగా నాగచైతన్య గద్దర్ అవార్డ్ గెల్చుకున్నారు. బన్నివాస్ డిస్ట్రిబ్యూట్ చేసిన లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాలు ఇటీవలి గద్దర్ అవార్డ్స్‌లో సత్తాచాటాయి. ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్‌తో పాటు ఈ అవార్డ్స్ అందించే ప్రోత్సాహంతో మరిన్ని మంచి ప్రాజెక్ట్ చేస్తున్నానని నిర్మాత బన్నివాస్ అంటున్నారు

## 'దేత్తడి' గ్లింప్స్ మార్చి 24న రిలీజ్



రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన ఆశిష్ హీరోగా, నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్‌తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా గ్లింప్స్ మార్చి 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ చేసిన గ్లింప్స్ పోస్టర్‌లో బ్లాక్, రెడ్ షేడ్స్‌తో రా ఎనర్జీ కనిపిస్తోంది. దేత్తడి సినిమాలో హై ఎమోషన్‌తో పాటు కొత్తగా చూపించే కల్చరర్ బ్యాక్‌డ్రాప్ స్టోరీ ఉండబోతోంది. మెయిన్ స్ట్రీమ్‌లో ఎక్కువగా చూడని అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఆశిష్ పూర్తిగా మాస్ లుక్‌లో కనిపించడమే కాకుండా, ఒరిజినల్ హైదరాబాద్ స్లాంగ్‌లో డైలాగ్స్ చెప్పబోతున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ జునైద్ కుమార్ అందిస్తున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో పాటు క్రియేటివ్ హెడ్‌గా కూడా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది.

## సందీప్ కిషన్‌తో సోషియో ఫాంటసీ చిత్రం




శంబాల బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు మళ్లీ ఓ అద్భుతాన్ని సృష్టించేందుకు రెడీ అయ్యారు. సందీప్ కిషన్‌తో ఓ భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీ మూవీని మేకర్స్ ప్లాన్ చేశారు.

ఈ సినిమాలో ఓ క్రేజీ కాన్సెప్ట్ పోస్టర్‌ను వదిలారు. ఈ పోస్టర్‌లో ఒక సింహం, తోడేలు కనిపిస్తున్నాయి. యుద్ధభూమి బ్యాక్‌గ్రౌండ్‌లో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ అలా నిటారుగా నిల్చుని ఉంది. 'కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు' అనే క్యాప్షన్ చూస్తే ఈ చిత్రం ఏ రేంజ్‌లో ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇది సందీప్ కిషన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. ఒక గొప్ప సినిమా అనుభూతిని అందించడానికి, నిర్మాతలు ప్రొడక్షన్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్ కథనం విషయంలో అన్ని విధాలా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక బృందం గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాల్ని త్వరలో ప్రకటిస్తామని, నిర్మాతలు తెలిపారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుందని నిర్మాతలు ప్రకటించారు.

### విజయ్ ఆంటోని

## తాజా చిత్రం వంద దేవుళ్లు

మల్టీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో వచ్చిన 'బిచ్చగాడు' చిత్రం ఎన్ని రికార్డుల్ని క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఈ కాంబో కలిసి వచ్చింది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో 'వంద దేవుళ్లు' అనే చిత్రం రాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ, శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. తాజాగా డైనమిక్ స్టార్ విష్ణు మంచు ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతో ఇంటెన్స్‌గా కనిపిస్తోంది. చెరుకు తోటలో విజయ్ ఆంటోనీ కత్తి పట్టుకున్న తీరు, వెనకాలే స్వాసిక మాసీ లుక్ అదిరిపోయింది. విజయ్ ఆంటోని ఇందులో రా అండ్ రస్టిక్ పాత్రని పోషిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తూ చిత్రయూనిట్‌కు విష్ణు మంచు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఇక ఈ మూవీకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరా మెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్యశ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేస్తున్నారు.



## 'కామాఖ్య' పవర్ ఫుల్ థ్రిల్లర్ : నటుడు సముద్రఖని

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వద్దేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు.

డైరెక్టర్ అభినయ కృష్ణ మాట్లాడుతూ కామాఖ్య నేను దర్శకత్వం వహించిన రెండో చిత్రం. మొదటి చిత్రం చిరంజీవా. ఆ చిత్రంలో యమధర్మరాజుకి ఒక గుడి ఉందని, అది తెలంగాణలోనే ఉందని చెప్పడం జరిగింది. కామాఖ్య అమ్మవారి నేపథ్యంలో ఈ చిత్రాన్ని ఒక ఉత్కంఠ భరితంగా ప్రజెంట్ చేస్తూ మీ ముందుకు తీసుకువస్తున్నాం. సముద్రఖని, అభిరామి సమైరా గారు ఇలా అద్భుతమైన నటీనటులందరూ కూడా వాళ్ల కోసమే ఈ పాత్రలు సృష్టించామా అన్నంత సహజంగా వారి వారి పాత్రల్లో ఒదిగిపోయారు. నా స్నేహితుడు రిశాంక్ అలాగే బాహుబలికి పనిచేస్తున్నప్పుడు సెంథిల్ దగ్గర పరిచయమైన రమేష్.. మేము ముగ్గురం కలిసి ఈ కథను ముందుకు తీసుకెళ్ళాం. అనుకున్న సమయంలో అనుకున్న బడ్జెట్లో ఈ సినిమాని తీయగలిగాం. దీనికి మా టీమ్ అందరూ ఎంతగానో సపోర్ట్ చేశారు. దృశ్యం సినిమా తరహాలో ఉండే మంచి థ్రిల్లర్ ఇది. త్వరలో ఈ సినిమా మీ ముందుకు రాబోతోంది. ఒక నటుడిగా నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. అలాగే ఇప్పుడు దర్శకుడుగా కూడా ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను. అభిరామి మాట్లాడుతూ ఇప్పటి వరకు నేను ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు. నన్ను ఇంత కొత్తగా చూపించిన డైరెక్టర్ అభిగారికి థాంక్యూ సో మచ్. ఈ సినిమాలో పనిచేస్తున్న యాక్టర్స్ టెక్నీషియన్స్ అందరు కూడా చాలా ప్రతిభావంతులు. ఒక చిన్న సినిమా వెనకాల చాలా హార్డ్ వర్క్ ఉంటుంది. టీం అందరూ కూడా ఈ సినిమా కోసం కలిసికట్టుగా పనిచేశారు. ఈ సినిమాకి సపోర్ట్ చేస్తూ ఆడియన్స్ వద్దకి తీసుకువెళ్లాలని మీడియా వారిని కోరుతున్నాను. తప్పకుండా అందరూ కూడా ఈ సినిమాని థియేటర్స్ లో చూడాలని ఆశిస్తున్నాను. ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ వాణినాథ్, డిఒపి: రమేష్ కుశేందర్ రెడ్డి, సంగీతం: గ్యాని ఎడిటర్: వరప్రసాద్, ఆర్ట్: భూపతి యాదగిరి, వి ఎఫ్ ఎక్స్ : ఫణి విహారిఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీహరి గౌడ



## బడ్జెట్‌లో గీత వృత్తిదారులకు అన్యాయం

### రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర బడ్జెట్‌లో అరకొరగా నిధుల కేటాయింపుతో గీత వృత్తిదారులకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. గతంలో కేటాయించిన నిధులను కూడా ఈ సారి కేటాయించలేదని విమర్శించారు. గీత కార్మికుల ఆర్థిక కార్పొరేషన్‌కు గత బడ్జెట్‌లో రూ.68 కోట్లు కేటాయించగా, దానిని సగానికి తగ్గించారని తెలిపారు. ఈసారి బడ్జెట్‌లో కూడా రూ.68 కోట్లు కేటాయించారని తెలిపారు. అవి కూడా పూర్తిస్థాయిలో విడుదల అవుతాయో లేదోనని సందేహం వ్యక్తం చేశారు. గత బడ్జెట్‌లో గీత వృత్తిదారుల సంక్షేమానికి కేటాయించిన రూ.10 లక్షలను ఖర్చు చేయలేదని, తాజా బడ్జెట్‌లో ఆ ఊసే లేదన్నారు. ఎక్స్ గ్రేషియా కింద గత బడ్జెట్‌లో రూ.6.10 కోట్లు కేటాయించారని, దానిని రూ.4.61 కోట్లకు తగ్గించారని, తాజా బడ్జెట్‌లో మరోసారి రూ.6.10 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇవి ఏ మాత్రం ఖర్చు చేస్తారో తెలియదని, ఇప్పటికే ఎక్స్ గ్రేషియా బకాయిలు సుమారు రూ.12 కోట్ల వరకు ఉన్నాయన్నారు. ఎక్సైజ్ పద్దులపై ఆమోదం సందర్భంగానైనా బడ్జెట్‌ను సవరించి గీత కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు కేటాయించాలని, ఎక్స్ గ్రేషియా, కొత్త పెన్షన్‌లు, సేఫ్టీ కిట్స్, భూముల కేటాయింపు గురించి నిధులు ఇవ్వాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గీత వృత్తిదారుల సహకార ఆర్థిక కార్పొరేషన్‌కు తక్షణమే చైర్మన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

### రూ. 3,200 కోట్ల విలువైన

## ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

### టిఎన్‌జిఒ కాలనీలో భూమికి ఫెన్సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం పరిధిలోని టిఎన్‌జిఓ కాలనీలో సుమారు 16 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ దాదాపు రూ. 3200 కోట్లు ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

**ఆక్రమణల వెనుక అసలు కథ**

గతంలో ప్రభుత్వం టిఎన్‌జిఒ ఉద్యోగుల నివాసాల కోసం ఇక్కడ కొంత భూమిని కేటాయించింది. అయితే, 2007లో రూపొందించిన హెచ్‌ఎండిఏ లే అవుట్ ప్రకారం, ఇందులో 10 ఎకరాలు, ముసాయికుంట (చెరువు ప్రాంతం), 4 ఎకరాలు గ్రీన్ బెల్ట్ (హరిత ప్రాంతం), 2 ఎకరాలు ప్రభుత్వ పాఠశాల కోసం కేటాయించారు. ఇంతటి విలువైన భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ వ్యవహారంలో కొందరు ఉద్యోగ సంఘం ప్రతినిధుల ప్రోత్సాహం కూడా ఉందంటూ హైడ్రా 'ప్రజావాణి'లో ఫిర్యాదులు అందాయి.

**క్షేత్రస్థాయిలో హైడ్రా మెరుపు చర్యలు**

ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు జిహెచ్‌ఎంసి, రెవెన్యూ విభాగాలతో కలిసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించుకున్న వెంటనే, ఆ 16 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 'ఇది ప్రభుత్వ భూమి అతిక్రమించిన వారు కఠిన చర్యలకు గురవుతారు' అని హెచ్చరిస్తూ బోర్డులను కూడా ఏర్పాటు చేశారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

ముసాయికుంటను, పర్యావరణానికి కీలకమైన గ్రీన్ బెల్ట్‌ను, భావి తరాల చదువు కోసం కేటాయించిన పాఠశాల భూమిని కాపాడటంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి, భూమాఫియా నుంచి భూములను విడిపించిన హైడ్రా అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు.



## పట్టణ ప్రగతికి సర్కార్ పెద్ద పీట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు పెద్ద పీట వేసింది. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సుమారు రూ. 17,907 కోట్లను కేటాయించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ. 723 కోట్ల నుంచి రూ. 763 కోట్ల వరకు అధికం కావడం విశేషం. ప్రభుత్వం తన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన మూసీ రివర్ ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి భారీగా నిధులను ప్రతిపాదించింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ. 1,500 కోట్లు కేటాయింపులు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి గత ఏడాది రూ. 100 కోట్లు ఉండగా, ఈసారి దాన్ని రూ. 300 కోట్లకు పెంచారు. తొలిసారిగా మురుగునీటి పునర్వినియోగం కోసం రూ. 100 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారు. హైదరాబాద్‌పై భారం తగ్గించేలా కరీంనగర్, వరంగల్ వంటి నగరాల అభివృద్ధికి కేటాయింపులను దాదాపు రెట్టింపు చేశారు. వరంగల్ స్మార్ట్ సిటీ రూ. 441.37 కోట్లు. కరీంనగర్ స్మార్ట్ సిటీ: రూ. 250.93 కోట్లు. ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలో వీటికి ప్రత్యేకంగా రూ. 55 కోట్లు (వరంగల్ 40, ఖమ్మం 15) గ్రాంట్లుగా ప్రకటించారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు. దీని కోసం రూ. 600 కోట్లు కేటాయించగా, మల్టీ మోడల్ సబర్బన్ రైలు రవాణా వ్యవస్థకు రూ. 5 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ (మున్సిపాలిటీలు) 1,483, మిషన్ భగీరథ (పట్టణ ప్రాంతాలు) 500, నగరపాలక సంస్థలకు గ్రాంట్లు 754.70, మున్సిపల్ మార్కెట్లు 100, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం 30 50, ఘన వ్యర్థాల నిర్వహణ 150, మొత్తం కేటాయింపుల్లో ప్రగతి పద్దు కింద రూ. 10,450 కోట్లు, నిర్వహణ పద్దు, కింద రూ. 7,458 కోట్లు వెచ్చించనున్నారు. గత బడ్జెట్‌లో యాదగిరిగుట్ట, వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీలకు నిధులు కేటాయించినప్పటికీ, ఈసారి వాటికి ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం గమనర్హం.



## నా కుటుంబానికి ఏమైనా జరిగితే ఆయుధం పడతా

### కేంద్ర హోం మంత్రికి రాజాసింగ్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోషామహల్ ఎమ్మెల్యే, బిజెపి బహిష్కృత నేత టి. రాజాసింగ్ తనకు, తన కుటుంబానికి వస్తున్న వరుస మరణ హెచ్చరికలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఆయన ఒక లేఖ రాశారు. స్థానిక యంత్రాంగంపై తనకున్న నమ్మకం పోయిందని, ఇదే తన చివరి విన్నపమని ఆయన లేఖలో పేర్కొన్నారు. గత కొంతకాలంగా తనకు వరుస బెదిరింపుల ఫోన్ కాల్స్, లేఖల ద్వారా నిరంతరం మరణ హెచ్చరికలు వస్తున్నాయని, ఇప్పుడు అవి తన కుటుంబ సభ్యులను కూడా లక్ష్యంగా చేసుకున్నాయని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బెదిరింపులపై స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. కేవలం రసీదు మాత్రమే ఇవ్వడం తప్ప, తదుపరి విచారణ జరపడం లేదని తెలిపారు. 'నేను ఇకపై భద్రత కోసం ఎవరినీ బ్రతిమలాడను. ఒకవేళ నా కుటుంబానికి ఏదైనా హాని జరిగితే, నేను మళ్లీ పోలీసుల దగ్గరకు వెళ్లను. నేనే స్వయంగా ఆయుధం పట్టి బాధ్యులను అంతం చేస్తాను' అని లేఖలో రాజాసింగ్ పేర్కొనడం గమనర్హం. ఈ బెదిరింపుల వెనుక ఉన్న మూలాలను కనిపెట్టడానికి ఉన్నత స్థాయి విచారణ జరపాలని, దోషులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన కేంద్ర హోంమంత్రిని కోరారు. ఇకపై జరిగే పరిణామాలకు తన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేసిన అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## రూ.3.13 లక్షల కోట్లకు చేరిన ఐటి ఎగుమతులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ బడ్జెట్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఐటి ఎగుమతులు రూ .3.13 లక్షల కోట్లకు చేరి, 9.39 లక్షల మందికి ఉపాధి కల్పించాయి. హైదరాబాద్ జిసిసిలకు 20 శాతం దేశీయ హబ్‌గా గూగుల్ సేఫ్టీ సెంటర్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర రావడం గర్వకారణం. కమ్యూనికేషన్స్ శాఖకు రూ.875 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం రూ.774 కోట్ల నుంచి 1 3 శాతం పెరుగుదల జరిగింది. ఇందులో ముఖ్య కేటాయింపులతో టివైబర్ నెట్‌వర్క్‌ను 50,000 ప్రభుత్వ సంస్థలకు ఉచిత హైస్పీడ ఫైబర్ కనెక్టివి టీ, ప్రస్తుతం 4,800 సంస్థలు కవర్ చేస్తున్నాయి. తెలంగాణ టివైబర్ నెట్‌వర్క్‌తో ప్రభుత్వ ఖర్చులు సగం (50శాతం) వరకు తగ్గుతాయి, ప్రైవేట్ ఐఎస్‌పిలపై ఆధారపడటం ఆగుతుంది.ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలు ఐఎస్‌పిల నుంచి డేటా తీసుకుంటున్నాయి.టివైబర్‌తో ఇది ఆగి లైసెన్స్ ఖర్చు పూ ర్తిగా కట్ అవుతుంది. హైస్పీడ్ ఫైబర్ డైరెక్ట్‌గా ప్రభుత్వానికి ఉచితం, మధ్య వర్తుల లేకపోవడంతో ఏటా లక్ష కోట్లు ఆదా అవుతుంది. తద్వారా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు లాంగ్ టా ర్మ్ లాభాలు ఉం టాయి. అలాగే జిఆర్‌ఐడి పాలసీతో హైదరాబాద్ బయట ఐటి విస్తరించేందుకు టి ఫైబర్‌కు ప్రత్యేక నిధులు కేటాయించారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

### తెలంగాణ చేనేత కార్మిక సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడెట్‌లో చేనేత రంగానికి తీ వ్ర అన్యాయం చేసిందని రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, అధ్యక్షులు పెం డెం సర్వేశం, ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతను ఆదుకుంటున్నట్లు ప్రకటనల ఆర్భాటమే తప్ప ఆచరణలో గుండు సున్నా అని పేర్కొన్నారు. బడ్జెట్‌లో చేనేత ,జౌళి శాఖకు కలిపి కేవలం రూ.257.56 కోట్లు మాత్రమే ప్రతిపాదించారని, అందులో రూ .203. 67 కోట్లు పవర్ లూమ్స్ కార్మికులకు, ఇన్సూరెన్స్ కోసం రూ.17.7కోట్లు, హైండ్‌లూ మ్స్ అండ్ టెక్స్‌టైల్స్ హెచ్ ఒడి రూ.15.6 కోట్లు ప్రతిపాదించారని వీటన్నిటినీ పరిశీలిస్తే చేనేతల కు కేటాయించింది ఏమీలేదన్నారు. బడెట్‌లో ప్ర తిపాదించిన కేటాయింపులలో టెక్స్‌టైల్స్ రంగానికి కేటాయించినవే ఉన్నాయని చేనేత అని ప్రకటించి మోసం చేయడం దారుణమన్నారు. మిల్లు యజమానులు, బడా పారిశ్రామిక వేత్తల అనుకూల విధానాలను విడనాడి చేనేత రంగాన్ని ర క్షించేందుకు బడ్జెట్ సవరించి ప్రత్యేకంగా చేనేతకే రూ. 2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చే శారు. తద్వారా చేనేత కార్మికులకు చేతినిండా ప ని కలిపించి ,పనికి తగిన ప్రతిఫలం అందేట్టుగా చూసి వారి అభివృద్ధికి సంక్షేమానికి నిర్దిష్టంగా చర్యలు చేపట్టాలని కోరారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com